ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మహబూబ్‌నగర్

: fb.com/vaartha Digital

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-8-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 198 పేజీలు: 10+4 వెల: 6.50

దివ్యాస్త్ర ఎంకె -3 తొలి ప్రయోగం సక్సెస్

వందేమాతరం ఆపారంటూ సోనియాపై అమిత్ షా ధ్వజం

3

70 యేళ్ల రికార్డ్ బ్రేక్ దిశగా ఎల్ నినో
ఉష్ణోగ్రతలు, కరవుపై ప్రభావం
నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్పియరిక్ అడ్మినిస్ట్రేషన్ అంచనా

## సముద్రంలో నిప్పుల తుఫాను!



5

## బెంగాల్ అసెంబ్లీ మాజీ డి. స్పీకర్ అనుమానాస్పద మృతి

టిఎంసి కార్యాలయంలో ఆయన మృతదేహాన్ని కనుగొన్న పోలీసులు





### ఓటర్ల ముసాయిదా

# నేడు విడుదల

నియోజకవర్గాల వారీగా జాబితాలు రెడీ

ఓటర్ల ఇంటి బాటలో పార్టీల బిఎల్ఎలు

'సర్' నోటీసులకు 12 సర్టిఫికెట్లలో ఒకటి చూపాలి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు16:** తెలంగాణలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్)తో రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల లెక్క తేల్చారు. ఈ క్రమంలో ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి సోమవారం సాయంత్రం విడుదల చేయనున్నారు. ప్రతి నియోజకవర్గం వారీగా ఓటర్ల వివరాలు ఉండనున్నాయి. అయితే రాజకీయ పార్టీలు బూతుల వారీగా ఓటర్ల వివరాలు కావాలని అడిగినందున ఈ మేరకు జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. కాగా, సర్ ప్రక్రియ కారణంగా భారీ సంఖ్యలో ఓట్లు గల్లంతు కానుండటంతో రాజకీయ పార్టీల్లో చర్చలు మొదలయ్యాయి. అన్‌కలెక్టబుల్ ఓటర్ల జాబితాను మరోసారి పరిశీలించేందుకు నాయకులు దృష్టి సారించాయి. ఎన్నికల అధికారులు మొత్తం రూ.3.38 కోట్ల ఓటర్లలో 73.30 లక్షల మందిని ఏఎస్‌డీడీ (ఆచూకీ లేనివారు(ఆబ్సెంట్), శాశ్వతంగా వలస వెళ్లినవారు(షిఫ్టింగ్), మృతి చెందిన వారు(డెత్), డూప్లికేట్) విభాగాల కింద అన్ కలెక్టబుల్ జాబితాలో చేర్చారు. ఇందులో శాశ్వతంగా వలస వెళ్లిన వారివి 45,18,981, చనిపోయిన వారివి 9,22,230, ఆచూకీ లేనివారీ ఓట్లు 11,25,546, డూప్లికెట్ ఓట్లు 6,70,203, ఇతర కారణాల ఓట్లు 1,02,294 ఉన్నట్లు వెల్లడించారు. ఈ ఓటర్లకు డిజిటలైజేషన్ కాకపోవడంతో ముసాయిదాజాబితాలో ఓట్లుఉండవు. వీరిని తొలగించిన ఓట్లకింద గుర్తిస్తారు. >>2

### కెసిఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్

# మాది సోషల్ జస్టిస్



ఆదివారం ములుగు కలెక్టరేట్ వద్ద జరిగిన సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

పేదల సంక్షేమానికి ఇచ్చిన ప్రతిహామీని అమలు చేస్తున్నాం

ప్రజల చైతన్యమే ప్రజాస్వామ్యానికి బలం

రైతు ప్రయోజనాలకు పెద్దపీట

చారిత్రక వారసత్వం వరంగల్లు సొంతం

పరకాలలో ప్రజాపాలన- ప్రగతిబాట విజయోత్సవ సభలో సిఎం రేవంత్

**ఉమ్మడి వరంగల్ బ్యూరో/ పరకాల,:ఆగస్టు 16: ప్రభాతవార్త:** కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్ అయితే, మాది సోషల్ జస్టిస్, ఆనాడు కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే ఆయన కొడుకు కేటీఆర్, అల్లుడు హరీష్‌ను మంత్రులను చేసుకుండు, కానీ నేను ముఖ్యమంత్రి కాగానే మా సీతక్క, కొండా సురేఖను మంత్రులను చేశా అని సిఎం ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే ఎర్రబెల్లి దయాకర్ రావుకు మంత్రి పదవి ఇచ్చిండు, నేను సిఎం అయ్యాక మా అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పదవి ఇచ్చా అని చెప్పారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే ఆయన బిడ్డను ఎంపీని చేసుకుండు, ఓడిపోతే ఎమ్మెల్సీ ఇచ్చిండు, నేను డాక్టర్ కావ్యను ఎంపీగా, యశస్వినిని ఎమ్మెల్యేగా చేశా అని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా పరకాల మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి బాట విజయోత్సవ సభకు రాష్ట్ర సిఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అంతకుముందు ముఖ్యమంత్రి దాదాపు రూ.484కోట్ల >>2

## బుచ్చమ్మకి ఇల్లు

మేడారంలో తనను కోరిన వృద్ధురాలికి తక్షణమే మంజూరు చేసిన సిఎం రేవంత్

మేడారం నుంచి ములుగు దాకా పలు అభివృద్ధి కార్యక్రమాలతో సిఎం పర్యటన

చేయూత పింఛన్ పత్రాల అందజేత

జంపన్న వాగు సమగ్ర అభివృద్ధికి చర్యలు

ములుగును ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి సీతక్క

7



కల్తీలు, నకిలీలకు

# ఇక చెక్

టిజి సేఫ్ బోర్డు ఏర్పాటు

కమిషనర్‌గా అవినాష్ మొహంతి

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కల్తీ ఆహార వస్తువులు, నకిలీ ఔషధాల భరతం పట్టేం దుకు సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. నకిలీ ఔషధాల విషయంలో ఇప్పటికే డ్రగ్ కంట్రోల్ బోర్డు వుండగా కల్తీ ఆహార వస్తువుల నిర్మూలనకు హైదరాబాద్ వరకు హెచ్ ఫాస్ట్ అనే విభాగం వుండగా కొన్ని జిల్లాలలో పోలీసు విభాగాలు సొంతంగా దాడులు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కల్తీ ఆహార వస్తువులు, నకిలీ ఔషధాలను సమూలంగా నిర్మూలించేందుకు రాష్ట్ర సర్కారు తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్)ను ఏర్పాటు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా ఏర్పాటైన ఈ విభాగం కమిషనర్‌గా సీనియర్ ఐపిఎస్ అధికారి అవినాష్ మొహంతిని నియమించారు. అవినాష్ మొహంతి ఇప్పటికే డ్రగ్ కంట్రోల్ బోర్డు డిజిగా వున్నారు. కొత్తగా ఏర్పాటైన టిజి సేఫ్‌కు ఆయన కమిషనర్‌గా వ్యవహరిస్తారు. సంజీవరెడ్డి నగర్‌లోని వెంగళరావు నగర్‌లో >>2

తుమ్మిడిహెట్టి బ్యారేజి అంచనా

# 12085 కోట్లు

ప్రభుత్వానికి అందిన డిపిఆర్

కొత్తగా 5.85 లక్షల ఎకరాలకు ఆయకట్టు

80 టిఎంసిలు మళ్లించేలా సమగ్ర ప్రణాళిక



**హైదరాబాద్, ఆగస్టు 16,ప్రభాతవార్త:** తుమ్మిడిహెట్టి నుంచి భూఉపరితం ద్వారా నీటిని మళ్లించడానికి వార్ధా ,వెయిన్‌గంగ నదులు కలిసే మహారాష్ట్రలోని గడ్‌చరోలి జిల్లా చప్రాళ నుంచి చంద్రాపూర్ అహేరికిసమీపప్రాంతమే అత్యంత అనువుగా ఉంటుందనీ రూ.12085 కోట్లతో ప్రాజెక్టు వ్యయాన్ని గణనచేస్తూ తెలంగాణ ప్రభుత్వానికి డిపిఆర్ అందింది. ఇక్కడ 150 మీటర్ల పూర్తి స్థాయి నీటి మట్టంతో 6.517 కి.మీ. పొడవుతో బ్యారేజి నిర్మించడం వల్లగేట్ల నిర్వహణ సులభంగా ఉంటుందని జలనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రాణహిత నది వెంబడి సుమారు 134.83 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న వన్య మృగ సంరక్షణ ప్రాంతంలో ఎలాంటి ముంపు ఉండదని తెలంగాణ ప్రభుత్వం కు ఇటీవలే నిపుణులు నివేదించిన డిపిఆర్ తెలిపింది. బ్యారేజి నిర్మాణంతో ఏర్పడే ముంపు 32 శాతమే మిగితా నీరు 68 శాతం నదీ గర్భం లోనే నీటిమట్టం నిల్వ ఉంటుందని సమగ్ర ప్రాజెక్టు రూపకర్తలు అభిప్రాయపడుతున్నారు. బ్యారేజి నిర్మాణం పై డిపిఆర్ నాలుగు ప్రత్యామ్నాయాలను సూచించింది. నాలుగు ప్రతిపాదనలో వార్ధా వెయిన్‌గంగా కలిసే ప్రాంతం వద్ద బ్యారేజీ నిర్మాణంకు తొలిప్రాధన్యత ఇచ్చారు. తుమ్మిడిహెట్టి నుంచి సుందిళ్ల బ్యారేజీకి నీటిని మళ్లించి అక్కడి నుంచి ప్రస్తుతం ఉన్న లిఫ్టు ద్వారా ఎల్లంపల్లికి ఎత్తిపోయడంతో పాటు మరో 5.85 లక్షలఎకరాల ఆయకట్టుకు కొత్తగా నీటిని అందించే డిపిఆర్ తయారించారు. బ్యారేజి ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.12,085 కోట్లు >>2



కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఉన్నతస్థాయి సమీక్ష. తక్షణ చర్యలకు ఆదేశం

హైదరాబాద్ సహా 8 స్టేషన్ల నీటిలో 'ఇ. కొలి' బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తింపు

దేశవ్యాప్తంగా 20,000 చోట్ల కొత్త ఫిల్టర్ల ఏర్పాటుకు రైల్వే శాఖ నిర్ణయం

### ఇక 'స్వచ్ఛ'

# రైల్వే నీరు

కాగ్ నివేదికతో కదిలిన కేంద్రం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు16:** దేశవ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు అందిస్తున్న తాగునీరు సురక్షితం కాదని, ప్రమాదకర బ్యాక్టీరియా ఆనవాళ్లు ఉన్నాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక హెచ్చరించడంతో రైల్వే మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ నేతృత్వంలో సీనియర్ అధికారులతో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష అనంతరం, స్టేషన్లలో సురక్షితమైన తాగునీటిని అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని రైల్వే బోర్డును ఆదేశించారు. ఈ సమస్యను అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ, రైల్వే బోర్డు స్థాయిలో నేరుగా పర్యవేక్షించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా రైల్వే నెట్‌వర్క్‌లోని 20,000 ప్రదేశాలలో వాటర్ కూలర్లతో పాటు సమగ్ర ఫిల్టరేషన్, పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు. స్టేషన్లలో "ట్యాంక్ టూ ట్యాప్" వాటర్ ఫిల్టరేషన్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని, పాత నీటి ట్యాంకులను వెంటనే మార్చాలని ఆదేశించారు. నీటి నాణ్యత పరీక్షల నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, దీనిపై జవాబుదారీతనాన్ని స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. నీటి నాణ్యతకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంచి పారదర్శకత పాటించాలని కూడా ఆదేశాల్లో పేర్కొన్నారు. దేశంలోని అన్ని జోన్ల పరిధిలో 512 నాన్‌సబర్బన్ గ్రేడ్ రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సేవలను కాగ్ అంచనా వేసింది. ఈ తనిఖీల్లో భాగంగా నాలుగు జోన్ల >>2

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ రద్దుకు

# కాంగ్రెస్ కుట్ర

ప్రభుత్వ ధోరణికి వ్యతిరేకంగా నేడు

రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు

పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసిన కెటిఆర్

7



### రష్యా, ఉక్రెయిన్

# హోరాహోరీ

వెయ్యికి పైగా డ్రోన్లతో విరుచుకుపడిన ఉక్రెయిన్

సమారా నగరంలోని రాకెట్, అంతరిక్ష కేంద్రం, మరో సైనిక స్థావరంపై భారీగా దాడులు

ఆరుగురు మృతి, పలువురికి తీవ్రగాయాలు

రష్యా సైతం కీవ్‌పై భారీగా క్షిపణి దాడులు

**కీవ్, ఆగస్టు 16:** ఉక్రెయిన్ సైన్యం సమారా నగరంలోని రష్యా రాకెట్, అంతరిక్ష కేంద్రంపై ఫ్లామింగో క్షిపణులతో దాడి చేసిందని ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. ఫ్లామింగో క్షిపణి సుమారు టన్ను పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదని, తక్కువ ఎత్తులో 3,000 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని >>2

# దినదిన గండం 'మహిళా' చదువులు!

రోజువారీ ఖర్చులకూ నిధుల కొరత



గ్రాంట్స్ లేవు, ప్రత్యేక కేటాయింపులూ లేవు

విద్యార్థినుల నుంచి రూ.1200 చొప్పున వసూలు

అడిగితేనే ఇస్తున్న రశీదులు..

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీలో ఇదీ తంతు!

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 16:** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఏకైక మహిళా విశ్వవిద్యాలయం రోజువారీ ఖర్చులకు నిధులు లేక అవస్థలు పడుతోంది. రోజువారీ ఖర్చులతోపాటు యూనివర్సిటీ కొనసాగింపుకు ప్రభుత్వంనుంచి ఎటువంటి గ్రాంట్స్ ఇవ్వకపోవడంతోపాటు, ప్రత్యేకంగా నిధులనుసైతం ఇవ్వకపోవడంతో.. యూనివర్సిటీని కొనసాగించడం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో యూనివర్సిటీకి చదువుకోవడానికి వస్తున్న విద్యార్థినుల నుంచే ఫీజు రూపంలో వసూలు చేస్తున్నారు. యూనివర్సిటీలో ఉన్న సుమారు 2వేల మంది విద్యార్థినులున్నారు. వారిలో ఫీజురీయింబర్స్‌మెంట్‌కి అర్హతలేని వారి నుంచి పూర్తిఫీజును వసూలు చేస్తుండగా, ఫీజురీయింబర్స్‌మెంట్‌కి అర్హులైన వారి నుంచి రూ. 1200 వసూలు చేస్తున్నారు. ఇలా వసూలు చేస్తున్న ఫీజుకు యూనివర్సిటీ నుంచి ఎలాంటి రశీదును >>2



ఇంఫాల్‌లో విద్యార్థుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఆదివారం జరిగిన మణిపురి స్టూడెంట్స్ ఫెడరేషన్ సభ్యులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు

# నేడు విడుదల

>> ఈ మేరకు రాష్ట్రంలో పెద్దఎత్తున ఓట్లు ఉండడంతో ప్రధాన రాజకీయ పార్టీలు వీటిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాయి. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీల అగ్ర నేతలు ఇప్పటికే పలుసార్లు తమ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లను అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో నియోజకవర్గాల వారీగా ఏఎస్‌డిడి ఓట్ల వివరాలను రాజకీయ పార్టీలకు అందించడానికి ఎన్నికల సంఘం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ లిస్ట్ ప్రకారం ఆ ఓటర్ల ఇంటి బాట పట్టడానికి ప్రధాన పార్టీలు సిద్ధమయ్యాయి. సోమవారం ఓటర్ల ముసాయి జాబితా విడుదల కాగానే మంగళ, బుధవారాలలో ఓట్లు కోల్పోయిన వారిపై ఆరా తీస్తారు. రాజకీయ పార్టీ నియోజకవర్గాల వారీగా ఏఎస్‌డిడి జాబితా తీసుకుని ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి విచారణ చేపట్టనున్నాయి. మరి నిజంగానే ఆ ఓటరు ఏఎస్‌డిడి జాబితాలో ఉన్నారా? స్థానికంగా ఓటరు ఉంటే ఎందుకు జాబితాలో ఉంచారు? అనే వాటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతాయి. కాగా, చాలా చోట్ల ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేయలేదని, వీటిని ఏఎస్‌డిడి జాబితాలో పెట్టినట్లు అనుమానాలు ఉన్నాయని, ఇంటింటికి వెళ్లి తమ పార్టీ విచారణకు సిద్ధమవుతోందని పార్టీ నేతలు పేర్కొంటున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం నిజంగానే స్థానికంగా ఓటర్లు ఉంటే వారికి తిరిగి ఓటు వచ్చేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఏఎస్‌డిడి జాబితాలోని ఓట్లు తిరిగి పొందే అవకాశం లేకపోవడంతో ఫారం6 ద్వారా మళ్లీ కొత్తగా ఓటు నమోదు చేయించాలని నిర్ణయించారు. అందుకు కావాల్సిన పత్రాలు, ఎస్ఐఆర్ 2002 వివరాలను కూడా ఇప్పుడే సేకరించి దగ్గర పెట్టుకున్నారు. రాష్ట్రంలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, 2.64 కోట్ల పత్రాలకు (78.30 శాతం) డిజిటలైజేషన్ ప్రక్రియ జరిగింది. ఓట్లు తేడాలున్న జాబితా (అనామలీస్)లో ఉన్న ఓటర్లే 60 లక్షల మంది వరకు ఉన్నారు. వీరందరికీ నోటీసులు ఇవ్వడానికి ఎన్నికల సంఘం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముసాయిదా జాబితా విడుదలయ్యాక ఎస్ఐఆర్ 2002తో మ్యాపింగ్ అయి, సరిగా ఉన్న ఓటర్లు, నోటీసులు అందుకునే ఓటర్ల వివరాలు కచ్చితంగా తెలుస్తాయి. నోటీసులు వచ్చిన వారు కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన 12 ఐడెంటిటీ కార్డుల్లో ఒకటి ఈఆర్వో ముందు హాజరై తప్పకుండా చూపించాలి. అప్పుడే ఓటు హక్కును కాపాడుకునే అవకాశం ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్‌యూ ఉద్యోగులు లేదా పెన్షనర్లకు జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా పెన్షన్ చెల్లింపు ఉత్తర్వులు(పీపీవో), 01-07-1987 ముందు ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు, తపాలా కార్యాలయాలు, ఎల్ఐసీ, స్థానిక సంస్థలు జారీ చేసిన గుర్తింపు పత్రాలు, ప్రభుత్వం నిర్దేశించిన అధికారితో జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్, విదేశాంగ శాఖ జారీ చేసిన పాస్‌పోర్టు, గుర్తింపు పొందిన బోర్డులు, విశ్వవిద్యాలయాలు జారీ చేసిన మెట్రిక్యులేషన్ (ఎస్ఎస్‌సి) లేదా ఇతర విద్యార్హత పత్రాలు, సంబంధిత అధికారి జారీ చేసిన శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం, అటవీ హక్కుల ధ్రువీకరణ పత్రం, క్యాస్ట్ సర్టిఫికెట్, జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సీ) (ఎక్కడైనా అమలులో ఉంటే), రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక సంస్థలు జారీ చేసిన కుటుంబ రిజిస్టర్ పత్రం, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా భూమి, ఇంటి కేటాయింపు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు (కమిషన్ నిర్దేశించిన నిబంధనలు వర్తిస్తాయి),

కాగా, 1987 జులై 1వ తేదీ కంటే ముందు జన్మించిన వారు 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించాలి. 1987 జులై 1 నుంచి 2004 డిసెంబరు 2 మధ్యలో జన్మించిన వారు ఎన్నికల సంఘం పేర్కొన్న వాటిలో ఒక గుర్తింపు కార్డుతో పాటు తల్లిదండ్రుల్లో ఎవరిదైనా ఒకరి ఐడీ కార్డు కూడా చూపాలి. 2004 డిసెంబరు 2 తర్వాత పుట్టిన వారు తన సొంత గుర్తింపు కార్డుతో పాటు తల్లిదండ్రుల ఇద్దరి ఐడీ కార్డులు చూపించాలని నిబంధనలను ఎన్యుమరేషన్ ఫారాలలో పొందుపరిచారు.

# నేటి నుండి ఎపి అసెంబ్లీ

**విజయవాడ,ఆగస్టు 16, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈనెల 17వ తేది సోమవారం నుండి ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉ.9గం.లకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అవుతాయి. ఈ మేరకు సమాచార శాఖ ఒక బులిటన్ విడుదల చేసింది. ఉదయం .10గం.లకు రాష్ట్ర శాసన మండలి సమావేశాలు ప్రారంభం అవుతాయి. అసెంబ్లీ సమావేశాల ప్రత్యక్ష ప్రసారం(లైవ్ టెలికాలికాస్ట్)ను అసెంబ్లీ మీడియా పాయింట్ తోపాటు సచివాలయ నాల్గవ భవనంలోని ప్రచార విభాగం (పబ్లిసిటీ సెల్) ద్వారా చేయబడుతుంది. తొలి రోజు ప్రశ్నోత్తరాల అనంతరం అసెంబ్లీ సమావేశాల నిర్వహణ తదితరంశాలపై మీటింగ్ జరుగుతుంది. ఈ సమావేశంలో ఎన్నిరోజులు అసెంబ్లీ నిర్వహించాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటారు. బీసీ సంరక్షణ కోసం ప్రత్యేక పాలసీతో సహా పలు కీలకంశాలపై అసెంబ్లీలో చర్చించనున్నారు. ఇకఇప్పటికే కూటమి పక్షాలు తమ 175 మంది సభ్యులు తప్పనిసరిగా సమావేశాలకు హాజరు కావాలని ఆదేశించాయి. వైసిపి తమ ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు నిరసనగా శాసనసభకు హాజరు కావట్లేదని ప్రకటించింది.

# మరో అల్పపీడనం

## పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్

**హైదరాబాద్, అగస్టు 16, ప్రభాతవార్త:** వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని దీని ప్రభావంతో తెలంగాణలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. వాయువ్య బంగాళాఖాతం, ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్ - ఉత్తర ఒడిశా తీర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడిందని వెల్లడించింది. ఇది రాబోయే 24 గంటల్లో వాయువ్య దిశగా కదులుతూ బలపడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో తీరం వెంబడి గంటకు 40 నుండి 50 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందంది. ఈ అల్పపీడనం కారణంగా తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ, జనగామ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతోపాటు పలు ప్రాంతాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఈదురుగాలులతోపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# హోరాహోరీ

>> నివేదికలు తెలిపాయి. రష్యా యుద్ధ విమానాలకు స్థావరంగా ఉన్న సవాస్లేయ్కా సైనిక వైమానిక స్థావరంపై కూడా సైన్యం దాడి చేసిందని జెలెన్స్కీ తెలిపారు. సుదూర దాడుల్లో మంచి ఫలితాలు సాధించినట్లు ఆయన ప్రకటించారు. 'మంచి విజయం. మా సరిహద్దు నుంచి దూరం సుమారు 900 కిలోమీటర్లు' అని సమారా దాడి గురించి ఆయన అన్నారు. 'ఈ యుద్ధం విషయంలో రష్యాపై మా సుదూర ఆంక్షల ప్రణాళిక అమలవుతోంది. రష్యా యుద్ధ సామర్థ్యం తగ్గించడం ముఖ్యం. శాంతి అవసరం. నిర్దిష్ట స్థావరాలకు స్పష్టమైన నష్టం కలిగించడం ద్వారా ఇది రష్యాలో కనిపించాలి' అని ఆయన అన్నారు. రష్యాపై ఉక్రెయిన్ వెయ్యికిపైగా డ్రోన్లతో విరుచుకుపడింది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము రకు చేసిన దాడుల్లో 8 వందల డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. మాస్కోలోని పలు ప్రదేశాలే లక్ష్యంగా దాడులు చేపట్టినట్లు ఉక్రెయిన్ సైన్యం వెల్లడించింది. మాస్కో ఆయిల్ రిఫైనరీకి సమీపంలోనూ ఈ దాడులు జరగడంతో అక్కడ పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. భారీగా పొగ వ్యాపించింది. ఈ దాడుల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో ప్రజలు గాయాల పాలయ్యారు. దాడుల కారణంగా మాస్కోలోని ప్రధాన విమానాశ్రయాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. దీంతో పలు విమానాలు రద్దవ్వగా.. మరికొన్ని ఆలస్యంగా నడిచాయి. గత ఐదేళ్లలో కీవ్.. మాస్కోపై చేసిన అతిపెద్ద దాడుల్లో ఇదీ ఒకటని రష్యా మీడియా కథనాలు వెల్లడించాయి. క్రిమియాపైనా ఉక్రెయిన్ పెద్దఎత్తున దాడులు కొనసాగిస్తోంది. సైనిక సరఫరాలను, విద్యుత్తు వ్యవస్థలను స్తంభింపజేసేలా తాజా దాడులు జరిపింది. క్రిమియాలోని క్షిపణి వ్యవస్థలపై దాడి చేసినట్లు ఉక్రెయిన్ తెలిపింది. మరోవైపు తెల్లవారుజామున కీవ్‌లోని అనేక ప్రాంతాలపై రష్యా డ్రోన్ దాడులుచేసింది. ఈ దాడుల్లో అనేక నివాసాలు, దుకాణాలు మంటల్లో చిక్కుకున్నాయి.

**బ్రిటిష్ డ్రోన్లను ఉపయోగిస్తున్న ఉక్రెయిన్**

6నెలలుగా రష్యా భూభాగంలో సుదూర దాడులు చేసేందుకు ఉక్రెయిన్ బ్రిటిష్ డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు సమాచారం. చాలా దాడులు ఉక్రెయిన్ డ్రోన్లతోనే జరిగినప్పటికీ, బ్రిటిష్ డ్రోన్లు కూడా విజయవంతమైన దాడులు చేశాయని ఉక్రెయిన్ సైనిక వర్గాన్ని ఉటంకిస్తూ ది టైమ్స్ శనివారం నివేదించింది. బ్రిటిష్ డ్రోన్లు మాస్కో సమీపంలోనే కాకుండా యారోస్లావ్, వోల్గోగ్రాడ్ ప్రాంతాల్లోని చమురు శుద్ధి కార్మాగారాలపై దాడులు చేశాయి. బ్రిటిష్ రాయల్ నేవీ పరీక్షించిన న్యాన్ జెట్ ఇంజిన్ డ్రోన్‌ను రష్యా సరిహద్దుకు సమీపంలోని ఉక్రెయిన్ సరిహద్దు నగరం బెల్గొరోడ్‌ను లక్ష్యంగా చేసుకునేందుకు కూడా ఉపయోగించినట్లు ఆ పత్రిక తెలిపింది.

## వారం - వర్జ్యం

17-08-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.పంచమి సా.5.05 న.చిత్త తె.4.59
వ.మ.12.14-మ.1.55
దు1. మ.12.36-మ.1.27
దు2. మ.3.08-మ.3.59
రాహు ఉ.7.30-ఉ.9.00
శుభ ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. ఏ పనిని చేపట్టినా చికాకు కలిగిస్తాయి. వాహన సౌఖ్యంకలదు.

**వృషభం :** ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**మిథునం :** సాంకేతిక పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారాలలో స్వల్ప మార్పులు చోటు చేసుకుంటారు.

**కర్కాటకం :** చర్చాగోష్ఠులలో పాల్గొంటారు. పనులు మందకొడిగా సాగుతాయి. నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

**సింహం :** దూరప్రాంతాల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**కన్య :** వివాదాలకు దూరంగా ఉండండి. ఉద్యోగులకు స్థాన చలనం ఉంటుంది. సోదరుల కలయిక. వాహన సౌఖ్యం.

**తుల :** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడుతాయి. ఆస్తి వివాదాలు, కోర్ట్ కేస్‌లు పరిష్కార దశకు చేరుకుంటాయి. వస్త్ర లాభం.

**వృశ్చికం :** స్త్రీలతో వివాదాలు ఏర్పడకుండా జాగ్రత్తలు పాటించండి. ఊహించని విధముగా ఉద్యోగావకాశాలు పొందుతారు.

**ధనుస్సు :** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. స్వల్ప ధనలాభం. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**మకరం :** ఋణబాధల నుండి విముక్తి పొందుతారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. సోదరుల కలయిక.

**కుంభం :** మీలోని సృజనాత్మకత వెలుగు చూస్తుంది. వ్యాపారాభివృద్ధి పట్ల దృష్టి సారిస్తారు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**మీనం :** పూర్తిగా ఆశలు వదులుకొన్న కార్యక్రమాలను సానుకూలము చేసుకోవటానికి కృషి చేస్తారు. వాహన సౌఖ్యం కలదు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మాది సోషల్ జస్టిస్

>> వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే సడ్డకుని కొడుకు సంతోష్‌రావుని ఎంపీని చేసుకుండు నేను మిత్ర ధర్మంగా వేం నరేందర్ రెడ్డికి రాజ్యసభ ఇచ్చా, కెసిఆర్ ముఖ్యమంత్రి అయితే వినోద్ రావును ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌గా చేసుకుండు, నేను ఉద్యమ కారుడు కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చా అని చెప్పారు. కేసీఆర్ సిఎం అయితే ఆయన కొడుకు కేటీఆర్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్ చేసుకున్నాడు, నేను మహేష్ గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా చేశా అని పేర్కొన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే ఆయన కుటుంబానికే లాభం, కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. వరంగల్ గడ్డకు గొప్ప చరిత్ర, పోరాట స్ఫూర్తి, ప్రజా చైతన్యం ఉన్నాయని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన మహనీయులు, తమ జీవితాలను సర్వం త్యాగం చేసిన ఎందరో ఉద్యమకారులు ఈ ప్రాంతం నుంచి వచ్చారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే, పోరాడే చైతన్యం వరంగల్ ప్రజల సొంతమని అన్నారు. కాకతీయుల పాలన, వారి నిర్మాణాలు, చారిత్రక వారసత్వం వరంగల్ ప్రాంత గొప్పతనానికి ప్రతీకలని సీఎం అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్, దాశరథి వంటి మహనీయులు ప్రజల కోసం తమ జీవితాలను అంకితం చేశారని గుర్తు చేశారు. ప్రజల నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవకులుగా పనిచేయాలని, ప్రజలపై ఆధిపత్యం చెలాయించే భావన ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని సీఎం స్పష్టం చేశారు. ప్రజల చైతన్యమే ప్రజాస్వామ్యానికి బలమని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంపై భారీగా అప్పుల భారాన్ని మిగిల్చినప్పటికీ, ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని ఏకకాలంలో ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను క్రమబద్ధీకరిస్తూనే రైతులు, మహిళలు, నిరుపేదలు, యువత, అణగారిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సీఎం అన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, ఇతర సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలుస్తున్నామని తెలిపారు. పేదల జీవితాల్లో ఆర్థిక, సామాజిక భద్రత కల్పించడమే ప్రజాపాలన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోళ్లు, వరి పంటకు బోనస్ వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. వ్యవసాయాన్ని దండగ నుంచి పండుగగా మార్చి రైతును రాజుగా చేయాలన్నది ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారతకు ప్రజాప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని సీఎం తెలిపారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంతో పాటు మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు పెంచేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సీఎం తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్ రింగ్ రోడ్డు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటి కీలక అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. వరంగల్ ప్రాంతంలో మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమ్మక్క-సారలమ్మ దేవతల చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత ప్రాంతాల అభివృద్ధికి కూడా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. దశాబ్దాలుగా వరంగల్ ప్రజలు కోరుకుంటున్న మామునూరు విమానాశ్రయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సాకారం చేస్తున్నామని మంత్రి తెలిపారు. భూసేకరణ కోసం రూ.300 కోట్లకు పైగా ఖర్చు చేసి చర్యలు చేపట్టామని, రాబోయే రెండేళ్లలో మామునూరు విమానాశ్రయాన్ని పూర్తి చేసి విమాన సర్వీసులు ప్రారంభించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

వరంగల్ నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సుమారు రూ.5,700 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రైతాంగానికి కీలకమైన దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

సుమారు రూ.6,000 కోట్లకు పైగా వ్యయంతో కొనసాగుతున్న దేవాదుల ప్రాజెక్టును ప్రజా ప్రభుత్వ హయాంలో పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు. పరకాల నియోజకవర్గ అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేస్తున్న కృషికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రజాప్రతినిధుల అభ్యర్థనలకు సానుకూలంగా స్పందిస్తూ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు.

# తుమ్మిడిహెట్టి బ్యారేజి అంచనా
# 12085 కోట్లు

>> అవుతుందని లెక్కకట్టారు. ప్రస్తుతం ప్రామాణిక నిర్మాణ ధరల ప్రకారం అంచనాను రూపొందించారు. తెలంగాణ ప్రభుత్వం నియమించిన కన్సల్టెన్సీ సంస్థ అందించిన డిపిఆర్ ప్రకారం మూడు నెలలో అంటే 91 రోజుల్లో 80.986 టిఎంసిల నీటిని మళ్లించే అవకాశం ఉంది. దీనిపై రేవంత్ రెడ్డి ఉత్తమ్ కుమార్ లు ఇటీవల ప్రాజెక్టుల సమీక్షలో సమగ్రంగా చర్చించినట్లు నీటిపారుదల శాఖ అధికారులు ధృవీకరించారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో తెలంగాణ కొనసాగిన రోజుల్లోనే తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల పూర్తి స్థాయి నీటిమట్టంతో బ్యారేజి నిర్మించి 160 టిఎంసిల నీటిని మళ్లించి చేవెళ్ల వరకు సరఫరా చేసేలా ప్రాణహితచేవెళ్లను చేపట్టారు. 28 ప్యాకేజీలుగా పనులు విభజించి ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మేంట్, కన్‌స్ట్రక్షన్ బిఎంసి విధానంలో టెండర్లు ఖరారు చేసి కొన్ని పనులు కూడా మొదలుపెట్టారు. బ్యారేజి ఎత్తుపై మహారాష్ట్రతో చర్చలు జరిపి అంతర్రాష్ట్ర బోర్డు ఏర్పాటు చేశారు.. తుది నిర్ణయానికి రాలేదు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా చర్చలు జరిగినా.. 148 మీటర్ల ఎత్తుకే పరిమితం కావాలని మహారాష్ట్ర సూచించింది. దీనితో మేడిగడ్డ అన్నారం సుందిళ్ళ కేంద్రంగా కాళేశ్వరం తెరపైకి తెచ్చారు. ఆ మూడు బ్యారేజి నిర్మించి ఎల్లంపల్లికి ఎత్తిపోసేలా కాళే శ్వరాన్ని అప్పటి ప్రభుత్వం నిర్మించింది. అది కూళేశ్వరం అవడంతో తుమ్మిడి హెట్టి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని పథకాన్ని పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం లో2023 నవంబర్ లోహామి ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్లతో బ్యారేజి నిర్మించి ఎల్లంపల్లికి మళ్లించేలా కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ, మహారాష్ట్రలతో చర్చలు ప్రారంభించింది. వార్ధా వెయిన్ సంగమం వద్ద బ్యారేజి ని 291.33 క్యూమె క్కులతో డిజైన్ చేశారు. దీనివల్ల 90 రోజుల్లో 80 టీఎంసీలు మళ్లించడానికి అవకాశం ఉంటుంది. గతంలో ప్రాణహిత చేవెళ్లలో 582.65 క్యూమెక్కుల నీటిని మళ్లించేలా డిజైన్ చేశారు. వార్ధావెయిన్ గంగా కూడలి వద్ద బ్యారేజి డిపిఆర్ పథకం సాకారమైతే కొత్తగా అక్కడ 5.85 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది . ఇందులో ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో రెండు లక్షల ఎకరాలు, ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద లక్షా 65 వేల ఎకరాలు, సింగూరు నుంచి చేపట్టిన సంగమేశ్వర కాలువ కింద 70 వేలు, బసవేశ్వర కాలువ కింద లక్షా యాభైవేల ఎకరాలు ఉంటుందని డిపిఆర్ లో చూపారు. ఈ ప్రతిపాదన ప్రకారం ముంపు ప్రాంతం 80 శాతం మహారాష్ట్రలో ఉంటుంది తెలంగాణలో 20 శాతం ఉంది. మొత్తం ముంపులో 68 శాతం నది పొడవునా ఉందని, వెయిన్‌గంగపైన 16.5 కి.మీ, వార్ధాపైన 21 కి.మీ. ఉంటుంది. గ్రామాలు ముంపునకు గురికావు. దీనివల్ల పునరావాస పునర్నిర్మాణం వంటి ఆటంకాలు ఏర్పడవు. నదీ ప్రాంతంలో తెలంగాణలో 1,111 ఎకరాలు, మహారా ష్ట్రలో 3,104 ఎకరాలు, చప్రాల పర్యావరణ సున్నిత ప్రాంతం లో 943 ఎకరాలు, ఇతర భూములు తెలంగాణలో 198 ఎక రాలు, మహారాష్ట్రలో 821 ఎకరాలు మాత్రమే ముంపుకు గురవుతోందని డిపిఆర్ లో నిపుణులు వివరించారు. రెండవ ప్రతిపాదన కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించే బ్యారేజి నుంచి 71.5 కి.మీ. దూరం ప్రాణహిత చేవెళ్లలో భాగంగా కాలువ పనులను చేపట్టారు. గతంలో 40 కి. మీ. వరకు కాలువ పనిని గతంలో చేశారు. ఈ కాలువను 76.65 కి. మీ. వరకు పొడి గించి, తర్వాత 20.9 కి.మీ. దూరం టన్నెల్ తవ్వకం ఆ తర్వాత 8.25 కి.మీ. గ్రావిటీ కాలువ తవ్వి సుందిళ్ల బ్యారేజీకి మళ్లిస్తారు. సుందిళ్ల బ్యారేజీకి ఎగువన మూడు కి.మీ. దూరంలో ఫోర్ షోర్ లో ఈ నీరు కలుస్తుంది. సుందిళ్ల నుంచి ప్రస్తుతం ఉన్న లిఫ్టు ద్వారానే ఎల్లంపల్లికి ఎత్తిపోస్తారు. అయితే ఇదీ గతంలో 71.5 కి.మీ. నుంచి ఎల్లంపల్లికి లిఫ్టు ద్వారా ఎత్తిపోసేలా ప్రణాళికను మార్పు చేశారు ప్రాణహిత నుంచి 20 టిఎంసిలు వినియోగించుకొనేలా ఇప్పటికే ఆమోదించిన నీటితోపాటు నికర జలాల్లోనే మిగులు ఉన్న మరో 57.086 టిఎంసీలు కలిపి 77.086 టిఎంసిలు మళ్లించాల్సి వస్తుంది. 80టిఎంసిలు మళ్లించేలా నిర్ణయించినట్లు డిపిఆర్ తయారు చేశారు. గతంలో వార్ధా వెయిన్ గంగా కలిసిన తరువాత 1.5 కి. మీ. దిగువన 3.4 కి.మీ. పొడవుతో బ్యారేజి నిర్మాణాన్ని ప్రతిపాదించారు. దీనివల్ల చప్రాల వన్య మృగ సంరక్షణ ప్రాంతం ముంపునకు గురవుతుంది. దీంతోపాటు మరో మూడు ప్రత్యామ్నాయాలను కూడా పరిశీలించి చివరకు వార్ధా కలిసే చోట బ్యారేజి నిర్మాణాన్ని ప్రతిపాదించారు. 62,232 క్యూసెక్కుల వరద ప్రవాహం వెళ్లేలా వార్ధాకు 60 గేట్లు, వెయిన్‌గంగకు 77 గేట్లతో డిజైన్ చేశారు. ప్రాణహిత చేవెళ్లలో 582.65 క్యూమెక్కుల నీటిని మళ్లించేలా డిజైన్ చేయగాప్రస్తుతం 291.33 క్యూసెక్కులతో డిజైన్ చేశారు. దీనివల్ల 90 రోజుల్లో 80 టిఎంసిలు మళ్లించడానికి అవకాశం ఉంటుంది.



ఆదివారం న్యూఢిల్లీలోని 'సదైవ అటల్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ

# వాజ్‌పేయికి రాష్ట్రపతి, ప్రధాని నివాళి

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** మాజీ ప్రధాని, దివంగత నేత అటల్ బిహారీ వాజ్‌పేయి 8వ వర్ధంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ మేరకు ఆదివారంఎక్స్ వేదికగా పోస్టులు చేశారు. దేశ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన అసాధారణ రాజనీతిజ్ఞుడు అటల్‌జీ అని ప్రధాని మోడీ కొనియాడారు. వాజ్‌పేయికి అపారమైన దూరదృష్టి ఉందని ప్రశంసించారు. ఆయన మాటలు, కృషి తరతరాలకు స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు. మాజీ ప్రధాని నాయకత్వం దేశాన్ని మరింత బలోపేతం చేసిందన్నారు. సుపరిపాలన, ప్రజా సంక్షేమంపై అటల్‌జీ చూపిన దృష్టి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తుందని ప్రధాని మోడీ చెప్పుకొచ్చారు. మరోవైపు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి ఘనంగా నివాళులు అర్పించారు. న్యూఢిల్లీలోని 'సదైవ అటల్ సమాధి వద్దకు ఆమె చేరుకున్నారు. ఈ సందర్భంగా పుష్పాంజలి ఘటించారు. అనంతరం దేశానికి వాజ్‌పేయి అందించిన సేవలను రాష్ట్రపతి స్మరించుకున్నారు. ఆమెతోపాటే కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్; ఉపరాష్ట్రపతి ఆర్ రాధాకృష్ణన్, స్పీకర్ ఓం బిర్లా తదితరులు కూడా అటల్ సమాధివద్ద నివాళులర్పించి ఆయనను స్మరించుకున్నారు.

# 'మహిళా' చదువులు!

>> ఇవ్వడం లేదని విద్యార్థినులు తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం 2014 జూన్ 2న ఏర్పడిన తరువాత రాష్ట్రంలో మహిళా యూనివర్సిటీ లేదు. దీంతో 2022లో ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న కోఠిలోని మహిళా కాలేజీని తెలంగాణ మహిళా యూనిరవర్సిటీగా ఏర్పాటు చేస్తూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీవో జారీ చేసింది కానీ తరువాత కార్యక్రమాలు ఏమీ చేపట్టలేదు. మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా పేరు మార్చారు. దీంతో 2025-26 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీలో, పీజీలోనూ అడ్మిషన్లను తీసుకున్నారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో 31 కోర్సుల్లో 1850 సీట్లను, పీజీలో 37 కోర్సులకు 997 సీట్లను మంజూరు చేశారు. వాటిల్లో అడ్మిషన్లను తీసుకున్నారు. జూన్‌లో 2026-27 విద్యా సంవ త్సరం ప్రారంభమైంది. గత ఏడాది అడ్మిషన్లు తీసుకున్నవారు ఇపుడు ద్వితీయ సంవత్సరంలోకి వెళ్లారు. కోఠి మహిళా కాలేజీలోనే మహిళా వర్సిటీకి కొత్తగా భవనాలను నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం నిధులను కేటాయించారు. అయితే యూనివర్సిటీ రెగ్యులర్‌గా కొనసాగడానికి మాత్రం నిధులను ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించలేదు. కేటాయించిన నిధులు కేవలం వేతనాల కోసమే సరిపోతాయి. ఈ నేపథ్యంలో గతం లో మహిళా యూనివర్సిటీగా కొనసాగిన సమయంలోనూ.. ఇపుడు వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీగా కొనసాగుతున్న సమయంలో కూడా విద్యార్థుల నుంచి కొంతమేరకు ఫీజుల రూపంలో డబ్బులు వసూలు చేసి యూనివర్సిటీని నడిపిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా మారి ఏడాదిన్నర కావొస్తున్నప్పటికీ ఇప్పటి వరకు కూడా ఇంకా అకౌంట్‌ను కొత్తగా వర్సిటీ పేరు మీదకు మార్చలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మహిళా వర్సిటీకి ప్రత్యేకంగా గ్రాంట్స్ మంజూరు చేయాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# నకిలీలకు ఇక చెక్

>> గల డ్రగ్ కంట్రోల్ బోర్డు కార్యాలయం నుంచి టిజి సేఫ్ పనిచేసే అవకాశాలున్నాయి. కాగా టిజి సేఫ్ విభాగం ఫుడ్ సేఫ్టీ, స్టాండ్ యాక్ట్ 2026 ప్రకారం విధులు నిర్వహిస్తుంది. ఆగస్టు 15వ తేదీ నుంచే ఈ విభాగం అమల్లో వచ్చినట్లుగా సర్కారు జిఓ జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ విభాగాలు ఏకీకృత పరిపాలన కిందకు వస్తాయి. ఆహారం, ఔషధాలు, కాస్మెటిక్స్‌ల లైసెన్స్‌ల జారీ, తనిఖీలు, శాంపుల్స్ సేకర ణ, వాటి పరీక్షలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అంతా టిజి సేఫ్ పరిధిలో వస్తుంది. దీంతో పాటు లీగల్, ప్రాసిక్యూషన్, లేబొరేటరీ, పరిపాలన విభాగాలు కూడా టిజి సేఫ్ కిందకు వస్తాయి. ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ టెస్టింగ్ లెబొరేటరీలను ఒకే గొడుకు కిందకు తీసుకురానున్నారు. అక్రమాలతో పాటు కల్తీపై నిఘా పెంచే దుకు నిఘా వ్యవస్థ ఏర్పాటుతో పాటు తనిఖీలను కొత్త విభాగం చేబట్టనుంది. కాగా టిజి సేఫ్ తన విధుల ను మొదటి దశలో క్యూర్ ప్రాంతంలో (ఓఆర్ఆర్‌పరిధి వరకు) నిర్వహించనుంది.

# ఇక 'స్వచ్ఛ' రైల్వే నీరు

>> పరిధిలోని 8 స్టేషన్లలోని వాటర్ కూలర్ల నుంచి సేకరించిన నీటి నమూనాలలో 'ఇ. కొలి'బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తించారు. ఈ బ్యాక్టీరియా వల్ల ఫుడ్ పాయిజనింగ్, డయేరియా, కిడ్నీ వైఫల్యం వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. 'ఇ. కొలి' బ్యాక్టీరియాను గుర్తించిన స్టేషన్లలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని హైదరాబాద్, దక్షిణ రైల్వేలోని కోయంబత్తూర్, పాలక్కాడ్ జంక్షన్లు, మధ్య రైల్వేలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్, భీవండి రోడ్, కళ్యాణ్, లోనావాలా, తూర్పు రైల్వేలోని మధుపూర్ ఉన్నాయి.

NOTICE
MAHADHAN

In order to make the Indian Farmers internationally competitive, Mahadhan Agritech Limited brings to you the following Imported & Indigenous 100% Water Soluble Mixture of Fertilisers as per order dated 24.10.2015, issued by Ministry of Agriculture & Farmers Welfare, Govt. of India, New Delhi.

| Sr.No. | Particulars / Grade | NPK 14-10-28 |
|---|---|---|
| 1 | Moisture percent by weight, maximum | 0.5 |
| 2 | Total Nitrogen percent by weight, minimum | 14 |
| 3 | Total Phosphorous and water soluble phosphorous (as $P_2O_5$) percent by weight, minimum | 10 |
| 4 | Water Soluble Potassium (as $K_2O$) percent by weight, minimum | 28 |
| 5 | Total Chloride per cent by weight, maximum | 1.5 |
| 6 | Matter insoluble in water per cent by weight, maximum | 0.5 |
| 7 | Sodium (as NaCl) per cent by weight, maximum | 0.5 |
| 8 | Lead (as Pb) per cent by weight, maximum | 0.003 |
| 9 | Cadmium (as Cd) per cent by weight, maximum | 0.0025 |
| 10 | Arsenic (as As) per cent by weight, maximum | 0.01 |

Salient Features:
1. 100% Water Soluble
2. Improves Quality and yield of the produce
3. Suitable to use through drip irrigation and foliar application
Packing : Available in 500 gm, 1 Kg, 5 Kg, 10 Kg and 25 Kg Packing
Supply and sales of above Mahadhan WSF grades will be done after 30-35 days

Manufactured / Imported & Marketed by -
MAHADHAN AGRITECH LIMITED
Registered Office : Sai Hira, Survey No. 93, Mundhwa Road, Mundhwa, Pune - 411036.
www.mahadhan.co.in



## గవర్నర్ శివప్రతాప్‌శుక్లాతో యుపి మంత్రి రవీంద్రజైస్వాల్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు16:** ఉత్తరప్రదేశ్ స్టాంపులు, కోర్టు ఫీజులు, రిజిస్ట్రేషన్ శాఖల సహాయ మంత్రి రవీంద్ర జైస్వాల్ ఆదివారం లోక్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు. వివాహ వేడుకల్లో గవర్నర్ తెలుగు సినీ నిర్మాత బండ్ల గణేష్ కుమార్తె వివాహ వేడుకకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా హాజరయ్యారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొన్న గవర్నర్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కొంపల్లిలోని ఆస్పెషియస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన డాక్టర్ బి. కల్యాణ్ చక్రవర్తి కుమారుడు చిరంజీవి అభయ్ చక్రవర్తి సుక్షితల వివాహ వేడుకలకు గవర్నర్ హాజరయ్యారు. నూతన వధూవరులను గవర్నర్ ఆశీర్వదించారు.



## వందేమాతరం ఆపారంటూ సోనియాపై అమిత్‌షా ధ్వజం

### జాతీయ పతాకాన్నే ఎగురవేయని

### ఆర్ఎస్ఎస్‌పై మీరేం చెపుతారని కాంగ్రెస్ కౌంటర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమం లో జాతీయ గీతం వందేమాతరాన్ని కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ మధ్యలోనే ఆపించారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధ్వజమెత్తారు. జాతీయ గీతాన్ని అవమానించినందుకు కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో అమిత్‌షా మాట్లాడుతూ వందేమాతరం గీతం కొనసాగుతుండగానే దాన్ని ఆపా లని కాంగ్రెస్ అధ్యక్షుడిని సోనియా గాంధీ కోరారని, ఈ ఘటనను అందరూ టీవీలో చూశారని అన్నారు.'వందేమాతరం గీతాన్ని పూర్తిగా ఆలపించకుండా మధ్యలోనే ఎలా ఆపగలరు కాంగ్రెస్ నేతలు సిగ్గుపడాలి. జాతీయ గీతంతో ముడి పడిన త్యాగాలను ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ మర్చిపోయిందని షా విమర్శించారు. దేశ స్వాతంత్రం కోసం వేలాది మంది ఉరికంబాలను ఎక్కారని, తూటాలు, లాఠీ దెబ్బలను ఎదుర్కొన్నారని, ఎన్నో సంవత్సరాలు జైళ్లలో గడిపారని ఆయన అన్నారు. కనీసం సిగ్గు మిగిలి ఉంటే బ్యాంకిమ్ చంద్ర చటర్జీకి, దేశ ప్రజలకు చేతులు జోడించి క్షమాపణ చెప్పాలి. సోనియా జీ ప్రజలు మిమ్మల్ని గమనిస్తున్నారు. ఈ దేశ ప్రజలు దీనిని ఎప్పటికీ క్షమించరని అమిత్ షా వ్యాఖ్యానించారు. అమిత్ షా ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు కుర్చీ ఏర్పాటు చేయాలని సోనియా గాంధీ సైగ చేశారని, వందేమాతరం గీతాన్ని ఆపాలని ఆమె సూచించలేదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఉదిత్ రాజ్ స్పష్టం చేశారు. ఇది పూర్తిగా అబద్ధాల పుట్ట. సోనియా గాంధీ అలా చేయలేదు. మా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరోగ్యంగా లేరు. ఎక్కువసేపు నిలబడలేరు. అందుకే కార్యక్రమ నిర్వహణకు సంబంధించి సోనియా గాంధీ సైగ చేశారు. వందేమాతరం గీతాన్ని ఆపాలని ఆమె సూచించలేదని ఉదిత్ రాజ్ అన్నారు. బీజేపీకి సైద్ధాంతిక మార్గదర్శక సంస్థగా ఉన్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌పై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. జాతీయ పతాకం విషయంలో ఆర్ఎస్ఎస్ గత వైఖరిని ప్రశ్నించారు.ఆర్ఎస్ఎస్ 52 సంవత్సరాల పాటు జాతీయ పతాకాన్ని ఎగురవేయలేదు. దీనిపై అమిత్ షా ఎప్పుడు క్షమాపణ చెబుతారని ప్రశ్నించారు వారు జాతీయ పతాకాన్ని అంగీకరించలేదు. కాషాయ జెండానే ఉండాలని పట్టుబట్టారు. దీనికి ఎప్పుడు క్షమాపణ చెబుతారని ఉదిత్ రాజ్ ప్రశ్నించారు.ప్రజల దృష్టిని కీలక సమస్యల నుంచి మళ్లించేందుకే బీజేపీ వందేమాతరం అంశాన్ని అనవసర వివాదంగా మారుస్తోందని ఆయన ఆరోపించారు.వాజ్‌పేయిని ప్రశంసించిన షాచిత్తోర్‌గఢ్ సభలో అమిత్ షా మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి సేవలను కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఒత్తిడి ఉన్నప్పటికీ పోఖ్రాన్ అణు పరీక్షలను నిర్వహించేందుకు వాజ్‌పేయి తీసుకున్న ధైర్యమైన నిర్ణయాన్ని ప్రశంసించారు. దేశంలో గ్రామీణ రహదారి అనుసంధానాన్ని మెరుగుపరిచేందుకు జాతీయ రహదారుల ద్వారా ఆయన చేసిన కృషిని గుర్తుచేశారు.గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన ఘనత కూడా వాజ్‌పేయికే దక్కుతుందని షా అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆ దార్శనికతను మరింత ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు.రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వంలో దేశ సరిహద్దులు మరింత సురక్షితంగా మారాయని, మావోయిస్టులను నిర్మూలించడంలో గణనీయమైన పురోగతి సాధించామని అన్నారు.

## మీ అభ్యంతరం నన్ను ఎంతో కలచివేసింది

### సోనియాగాంధీకి బంకించంద్ర ఛటర్జీ వారసుడి లేఖ

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో వందే మాతరం గీతాన్ని అవమానించారని ఆరోపిస్తూ పశ్చిమ బెంగాల్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే, ప్రముఖ కవి, రచయిత బంకిమ్‌చంద్ర చటోపాధ్యాయ వారసుడు సుమిత్రో ఛటర్జీ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీకి లేఖ రాశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, దేశ ప్రజలకు, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని నైహాటి అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే అయిన ఛటర్జీ బంకిమ్ చంద్ర చటోపాధ్యాయ రచించిన వందే మాతరం పూర్తి గీతాన్ని ఆలపిస్తున్న సమయంలో చోటుచేసుకున్న ఘటనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశం 80వ స్వాతంత్ర్య వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ, యావత్ దేశం మాతృభూమిని ఆరాధిస్తున్న సమయంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యాలయంలో జరిగిన పరిణామం కేవలం విచారకరమైనదే కాకుండా, చారిత్రక తప్పిదాన్ని సిగ్గుచేటుగా పునరావృతం చేసినట్లుగా ఉందని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ కార్యకర్తలు వందే మాతర్ం పూర్తి గీతాన్ని ఆలపిస్తున్న సమయంలో సోనియా గాంధీ ముఖంలో కనిపించిన అసౌకర్యం, అసంతృప్తి, అలాగే గీతాన్ని పదేపదే ఆపేందుకు చేసిన ప్రయత్నాలు తనను తీవ్రంగా బాధించాయని ఛటర్జీ తెలిపారు. భారతీయ పౌరుడిగా, దేశభక్తుడిగా, అన్నింటికంటే ముఖ్యంగా ఋషి బంకిమ్ చంద్ర చటోపాధ్యాయ కుటుంబానికి ప్రత్యక్ష వారసుడిగా నేను ఈ లేఖను తీవ్ర వేదన, శూన్యత, ఆవేదనతో రాస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు.

వందే మాతరానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ ఛటర్జీ అరవిందుడి వ్యాఖ్యలను ఉటంకించారు. మంత్రం అందించబడింది. ఒక్క రోజులోనే మొత్తం దేశం దేశభక్తి అనే మతంలోకి దీక్ష పొందిందని అరవిందుడు పేర్కొన్నారని తెలిపారు. వందే మాతరం కేవలం ఒక మంత్రం మాత్రమే కాదని, దేశభక్తి అనే భావనకు ప్రతీకగా నిలిచినదని ఆయన వివరించారు.ఈ మంత్రం ఖుదీరాం బోస్ సహా అనేకమంది నిర్భయ విప్లవకారులకు స్ఫూర్తినిచ్చిందని, ఉరికంబాన్ని ఎదుర్కొని ప్రాణత్యాగం చేసేందుకు వారిని ప్రేరేపించిందని ఛటర్జీ అన్నారు.

## దివ్యాస్త్ర ఎంకె-3 తొలి ప్రయోగం సక్సెస్

**లక్నో, ఆగస్టు 16:** ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన రక్షణ రంగ స్టార్టప్ సంస్థ కావా యూఏవీ ప్రైవేట్ సంస్థ రూపొందించిన తదుపరి తరం జెట్ ఇంజిన్ ఆధారిత లాయిటరింగ్ మ్యూనిషన్ దివ్యాస్త్ర ఎంకె3 తొలి విమాన పరీక్ష విజయవంతమైంది. ఆగస్టు 11న ఈ పరీక్ష నిర్వహించినట్లు సంస్థ ఆదివారం ప్రకటించింది. భారత్‌లోనే పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన తొలి జెట్ ఇంజిన్ ఆధారిత లాయిటరింగ్ మ్యూనిషన్‌గా డివ్యాస్త్ర ఎంకె3ను కావా యూఏవీ పేర్కొంది. డీజీ ప్రొపల్షన్ అభివృద్ధి చేసిన స్వదేశీ జెట్ ఇంజిన్‌తో ఈ వ్యవస్థను రూపొందించినట్లు తెలిపింది. ప్రాజెక్టు ప్రారంభమైన ఏడాదిలోపే తొలి విమాన పరీక్షను పూర్తి చేసినట్లు వెల్లడించింది.విదేశీ జెట్ ఇంజిన్ లేదా కీలక విదేశీ సబ్‌సిస్టమ్ ఏదీ ఉపయోగించలేదని, పూర్తిగా భారత్‌లోనే తయారు చేసి, భారత్‌లోనే ప్రయోగించినట్లు సంస్థ పేర్కొంది. ఇది 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తికి నిదర్శనమని తెలిపింది.తొలి విమాన పరీక్ష విజయవంతం కావడం దేశీయ రక్షణ ఉత్పత్తి రంగంలో కీలక మైలురాయిగా కావా యూఏవీ సహ వ్యవస్థాపకులు అభివర్ణించారు. భారత్ తన సొంత భూభాగంలోనే జెట్ ఇంజిన్‌తో నడిచే ఖచ్చిత దాడి సామర్థ్యం కలిగిన వ్యవస్థను రూపొందించి, ఇంజినీరింగ్ చేసి, విమాన పరీక్ష నిర్వహించగల సామర్థ్యాన్ని ప్రదర్శించిందని వారు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) కూడా మానవరహిత వైమానిక వాహనం (యూఏవీ) నుంచి ప్రయోగించే యుఎల్‌పిజిఎం వి3 ప్రెసిషన్ గైడెడ్ మిస్సైల్ తుది డెలివరబుల్ కాన్ఫిగరేషన్ అభివృద్ధి పరీక్షలను పూర్తి చేసింది. కర్నూలు సమీపంలోని డీఆర్‌డీవో పరీక్షా కేంద్రంలో గగనతలం నుంచి భూతలానికి, గగనతలం నుంచి గగనతలానికి ప్రయోగించే రెండు విధానాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఆయుధ వ్యవస్థను నియంత్రించేందుకు సమీకృత గ్రౌండ్ కంట్రోల్ సిస్టమ్‌ను వినియోగించారు. ఆయుధ వ్యవస్థ సిద్ధం చేయడం, ప్రయోగించే ప్రక్రియలను ఆటోమేటిక్‌గా నిర్వహించే అధునాతన సాంకేతికతను ఈ జీసీఎస్‌లో పొందుపరిచినట్లు డీఆర్‌డీవో తెలిపింది.యుఎల్‌పిజిఎం వ్యవస్థ అభివృద్ధి, ఉత్పత్తి కోసం డీఆర్‌డీవో హైదరాబాద్‌కు చెందిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్, అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థలతో భాగస్వామ్యం చేసింది. ప్రస్తుత పరీక్షల కోసం బెంగళూరుకు చెందిన న్యూస్పేస్ రిసెర్చ్ అండ్ టెక్నాలజీస్ అభివృద్ధి చేసిన యూఏవీల్లో ఈ వ్యవస్థను అనుసంధానించారు.



## నేడు ఎంసిఆర్ టిమ్స్‌ను ప్రారంభించనున్న సిఎం రేవంత్

### ఏర్పాట్ల పనులపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంసీఆర్ టిమ్స్)ని నేడు (సోమవారం) ముఖ్య ఎంసీఆర్ టిమ్స్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్టు తెలిపారు. సనత్‌నగర్‌లో నిర్మించిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డా. ఎంసీఆర్ టిమ్స్) ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం పరిశీలించారు. నేడు (సోమవారం) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంసీఆర్ టిమ్స్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో హాస్పిటల్ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆరోగ్యశాఖ, పోలీస్, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ, సమాచార పౌర సంబంధాల శాఖ, ట్రాఫిక్ పోలీస్ తదితర శాఖల ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమా వేశం నిర్వహించారు.



ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే ముఖ్యమంత్రి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వైద్యులు, మీడియా ప్రతినిధులు, ప్రజలు, ఇతర అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమన్వయంతో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమ వేదిక, ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, సెక్యూరిటీ, ప్రజల రాకపోకలు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై మంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రారంభోత్సవ కార్యక్రమం నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని ట్రాఫిక్ పోలీసులను మంత్రి ఆదేశించారు. వాహనాల పార్కింగ్, అతిథులు, ప్రజాప్రతినిధుల రాకపోకలకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా పోలీస్, ఇతర శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, ఐ అండ్ పీఆర్ కమిషనర్ ముకుంద రెడ్డి, హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్ఎస్‌బీ ఎండీ అశోక్ రెడ్డి, అదనపు డీసీపీ (ట్రాఫిక్) వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## సిటీ పోలీసు విభాగంలో 150 ఎస్‌పిఒ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** హైదరాబాద్ పోలీసు విభాగంలో 150 స్పెషల్ పోలీసు ఆఫీసర్స్ (ఎస్‌పిఒ) పోస్టుల భర్తీకి ఆదివారం నాడు నోటిఫికేషన్ జారీ చేశారు. తాత్కాలిక ప్రాతిపదికన వుండే ఈ ఉద్యోగాల కోసం మాజీ సైనికులు, మాజీ పారామిలటరీ సిబ్బంది, విశ్రాంత పోలీసు సిబ్బంది అర్హులు. మాజీ సైనికులు 58 యేళ్లకు తక్కువగా, మాజీ పారా మిలటరీ సిబ్బం ది, విశ్రాంత పోలీసు సిబ్బంది పదవీ విర మణ చేశాక రెండేళ్ల వయస్సులోపు వుండాలి. అయితే వీరి వయస్సు 62 ఏళ్లకు మించరాదు. ఈ పోస్టులకు ఎంపికైన వారికి నెలకు 26 వేల రూపాయల వేతనం చెల్లిస్తారు. ఎలాంటి సెలవులు వుండవు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి కలిగిన వారు ఈ నెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు పేట్లాబూర్జులో గల సిటీ సాయుధ బలగం హెడ్ క్వార్టర్స్‌లో ఎస్‌పిఓస్ కార్యాలయంలో తమతమ ఉద్యోగాలకు సంబంధించిన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సాయుధ బలగం డిసిపి వెంకటేశ్వర్లు తెలిపారు.

## ఎడ్‌సెట్-2026 మొదటి విడతలో 9,407 మందికి సీట్ల కేటాయింపు

### 20లోగా కాలేజీల్లో చేరాలి.. అడ్మిషన్ల కన్వీనర్

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో బిఇడిలో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఎడ్ సెట్-2026 కౌన్సెలింగ్‌లో భాగంగా మొదటి విడతలో 9407 మందికి సీట్లు కేటాయించారు. సీటు పొందిన అభ్యర్థులు ఈ నెల 20లోగా కాలేజీల్లో చేరాలని అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 13,965 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో మొదటివిడత కౌన్సెలింగ్‌లో 15,009మంది వెబ్‌ఆప్షన్లు ఇవ్వగా అందులో 9,407మందికి సీట్లను కేటాయించినట్టు పాండురంగారెడ్డి తెలిపారు. సీటు పొందిన అభ్యర్థులు ఈ నెల 20లోగా ట్యూషన్ ఫీజు చెల్లించి జాయినింగ్ రిపోర్ట్ చేయాలన్నారు.

## భవనంపై నుంచి దూకి ఎంబిబిఎస్ విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్ (ఉప్పల్), ఆగస్టు 16, ప్రభాతవార్త :** ఎంబిబిఎస్ విద్యార్థి ఒకరు నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ పిఎస్‌కాలనీలో నివసించే కొల్కూరి రాంరెడ్డి కుమా రుడు కొల్కూరి భరద్వాజ్ (18) ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. అయితే ఆదివారం ఉదయం 3.20 గం టల వరకు మృతుడి సోదరి గుడిపల్లి వరేణ్యతో కలిసి చదువుకున్నాడని తెలిపారు. ఉదయం 7.25 గంటలకు వరేణ్య లేచి చూడగా అతను కలిపించలేదని తెలిపారు.



కొల్కూరి భరద్వాజ్

దీంతో బంధువులు చుట్టుపక్కల అన్నిచోట్ల వెతికినట్లు తెలిపారు. స్నేహితులు, బంధువులను సంప్రదించారు, కానీ ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆదివారం ఉదయం 8.30 గంటలకు కొల్కూరి భరద్వాజ్ ఉప్పల్ ప్రధాన రహదారిలో నిర్మాణంలో ఉన్న ఎన్ఎస్ఎల్ భవనం పైనుండి దూకగా అక్కడికక్కడే మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతుడు ఉద యం వరకు చదువుకుని రెండు, మూడు గంటలలోగానే ఆత్మహత్య చేసు కోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థకు వసూళ్ల జోష్

### నాలుగు నెలల్లో రూ.5,094.67 కోట్లు రాబడి

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ రెవెన్యూ వసూళ్లలో గణనీయమైన పురోగతి సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27కు సంబంధించి ఏప్రిల్ నుంచి జూలైవరకు నాలుగు నెలల్లో సంస్థ పరిధిలోని 21 సర్కిళ్లలో రూ.5,185.69 కోట్ల డిమాండ్‌కుగాను రూ.5,094.67 కోట్ల రెవెన్యూ వసూలైంది. దీంతో మొత్తం వసూళ్ల శాతం 98 శాతానికి చేరింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సైబర్‌సిటీ, బంజారాహిల్స్, హబ్సిగూడ, హైదరాబాద్ సెంట్రల్, సరూర్‌నగర్, సికింద్రాబాద్, మెడ్చల్ సర్కిళ్లు మెరుగైన పనితీరు కనబరిచాయి. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో సూర్యాపేట, నాగర్‌కర్నూల్, సిద్దిపేట, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ సర్కిళ్లు కూడా లక్ష్యాలకు అనుగుణంగా వసూళ్ల సాధించాయి. అదేవిధంగా రూ.215.39 కోట్ల కలెక్టబుల్ బకాయిల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని సంస్థ అధికారులు నిర్ణయించారు. ప్రతి సర్కిల్లో బకాయిల తగ్గింపునకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, రెవెన్యూ వసూళ్ల శాతాన్ని మరింత పెంచనుంది. కాగా దక్షి ణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ బకాయిల వసూళ్లకు కొరఢా ఝులిపిస్తోంది.


ఎల్టీవినియోగదారుల బిల్లింగ్, రెవెన్యూ కలెక్షన్, నెలవారీ వసూళ్లు, కలెక్టబుల్ బకాయిలవసూళ్లు, ఆదాయ వృద్ధిపై సంస్థ ప్రత్యేకంగా దృష్టిసారించింది. ప్రభుత్వ సంస్థల నుండి రావాల్సిన బకాయిలు ఏళ్లతరబడి రూ.వేల కోట్లు రావాల్సిఉన్నా వాటిని పట్టించుకోని సంస్థ, సామాన్యులకు మాత్రం తారెత్తిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నోటీసుల మీద నోటీసులు ఇస్తూ హడావిడీ చేస్తోందని చెబుతున్నారు.

## నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ విన్యాసాలు అదరహో

### ఇబ్రహీంపట్నంలోని ఎన్ఎస్‌జి రీజనల్ హబ్‌ను సందర్శించిన కేంద్రమంత్రి బండి సంజయ్

### మారుతున్న భద్రతా సవాళ్లను అధిగమిస్తూ కమాండోలు అందిస్తున్న సేవలు భేష్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 16:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదివారం మధ్యాహ్నం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జి) 28వ స్పెషల్ కంపోజిట్ గ్రూప్ (ఎస్‌సిజి) ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌జి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. గ్రూప్ ఆపరేషనల్




సన్నద్ధత, సామర్థ్యాలు, ప్రత్యేక నైపుణ్యాల గురించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉగ్రవాద దాడులు, బాంబు పేలుళ్ల సమయాల్లో ఎన్ఎస్ జీ సేవలపై రిహార్సల్స్ ప్రదర్శించారు. ఎన్ఎస్‌జి సిబ్బంది చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. ఆపద సమయాల్లో గదుల్లోకి ప్రవేశించి ఆపరేషన్ నిర్వహించే విధా నాలను కె9 శునకాల దాడి (అసల్ట్ డాగ్స్) ప్రత్యేక నైపు ణ్యాల విన్యా సాలను ఎన్ఎస్ జి గార్డ్స్ ప్రద ర్శించారు. ప్రత్యే క ఆయుధాలు, పరిక రాలను ప్రదర్శించారు. వీటి ద్వారా ఎన్ ఎస్‌జిలో ఉన్న ఆధునిక సామర్థ్యాలు, ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఆపరేషన్‌కు సిద్ధంగా ఉండే సామర్థం స్పష్టమైంది. ఎన్ఎస్‌జీ కమాండోల అద్భుత ప్రదర్శన, వృత్తి నైపుణ్యం, అప్రమత్తత, సన్నద్ధతతోపాటు దేశ సేవ పట్ల అంకితభావాన్ని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రత్యేకంగా అభినందించారు. మారుతున్న భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు విభిన్న అత్యున్నత స్థాయి ఆపరేషనల్ సిద్ధతను కొనసాగిస్తుండటం హర్షణీయమని పేర్కొన్నారు. ముంబై 26/11 దాడుల తరువాత దేశంలో వివిధ ప్రాంతాల్లో ఎన్ఎస్‌జి రీజినల్ హబ్స్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్‌జి ప్రాంతీయ కేంద్రం ట్రైనింగ్ సెంటర్లో కౌంటర్ టెర్రరిజం, బాంబ్ డిస్పోజల్, కౌంటర్ ఐఈడీ వంటి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఈ కేంద్రంలో ఆపరేషనల్, శిక్షణ మౌలిక వసతులతో కూడిన ఎన్ఎస్‌జి కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో కమాండో బ్యారెక్స్, ఆఫీసర్స్ మెస్, పార్కింగ్ సదు పాయాలు, ఇతర భవనాలు, నిర్వహణ మౌలిక వసతులు, ప్రత్యేక శిక్షణ/ఫైరింగ్ సదుపాయా లున్నాయి. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఈ ఇబ్రహీంపట్నం కేంద్రంగా అత్యవసర సేవలు అందించనున్నారు.

## లక్ష టన్నుల సామర్థ్య గోడౌన్లకు కేంద్రం ఆమోదం

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** తెలంగాణలో గోడౌన్ల మరో లక్ష టన్నుల సామర్థ్యం కలిగిన గోదాముల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ గోదాములను జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్), గ్రామీణాభివృద్ధి ఫండ్స్ (ఆర్ఐడీఎఫ్)తో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో గోడౌన్లు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణం చేపట్టనున్నారు. దీనికి సంబంధించి వేర్‌హౌసింగ్ విభాగం తయారుచేసిన ప్రతిపాదనలను (డీపీఆర్) కేంద్రానికి పంపించగా వాటికి గతంలోనే ఆమోదం లభించింది. దీంతో రాష్ట్రంలో కొత్తగా గోడౌన్లు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఈ మేరకు అధికారులు సన్నాహాలు చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం తెలంగాణలో వేర్‌హౌసింగ్ విభాగం ఆధ్వర్యంలో 7.2 లక్షల టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు ఉన్నాయి. వీటిని క్రమంగా 10 లక్షల టన్నులకు విస్తరించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నది. కాగా రాష్ట్రవ్యాప్తంగా వేర్‌హౌసింగ్, సివిల్ సప్లైస్, మార్కెటింగ్ శాఖలు, భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ), ప్రైవేట్ గోడౌన్లతో కలిపి మొత్తంగా 66.65 లక్షల టన్నుల సామర్థం గల గోదాములు ఉన్నాయి. ఈ కెపాసిటీని కోటి టన్నులకు విస్తరించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

## నేటి నుంచి ఐసెట్ ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్

### రేపు సర్టిఫికెట్ వెరిఫికేషన్, 18, 19 తేదీల్లో వెబ్‌ఆప్షన్లు

### 22న సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐ సెట్-2026 ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ నేటి(సోమవారం) నుంచి ప్రారంభం కానుంది. రేపు(మంగళవారం) సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్టు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18, 19 తేదిల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశమిచ్చారు. ఈ నెల 22న ఫైనల్ ఫేజ్ సీట్ల కేటాయింపు ఉంటుందని కమిషనర్ తెలిపారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 20లోగా కాలేజీల్లో చేరాలని సూచించారు. మొదటి విడతలో ఎంబీఏలో 57 శాతం సీట్లను, ఎంసీఏలో 39 శాతం సీట్లను కేటాయించారు. ఐ సెట్-2026లో 46,654 మంది అర్హత సాధించారు. వారిలో 21,097 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. అందులో 20,469 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. ఆప్షన్లు ఇచ్చిన వారిలో 19,526 మందికి మొదటి విడతలో సీట్లను కేటాయించారు.

రాష్ట్రంలో 309 ఎంబీఏ కాలేజీలు, 92 ఎంసీఏ కాలేజీలున్నాయి. వాటిల్లో కన్వీనర్ కోటాలో ఎంబీఏలో 29,457 సీట్లు, ఎంసీఏలో 6784 సీట్లు అందుబాటులో ఉండగా అందులో మొదటి విడతలో ఎంబీఏలో 16,896 సీట్లను కేటాయించగా, ఎంసీఏలో 2630 సీట్లను కేటాయించారు. ఎంబీఏలో 12,561 సీట్లు, ఎంసీఏలో 4154 సీట్లు ఇంకా ఖాళీగా ఉన్నాయి. ఎంబీఏ కాలేజీల్లో యూనివర్సిటీ కాలేజీలు 25 ఉంటే వాటిల్లో 1550 సీట్లకు గానూ 1305 సీట్లను(84శాతం) కేటాయించారు. గవర్నమెంట్ కాలేజీలు 4 ఉండగా వాటిలో 260 సీట్లకుగానూ 248 సీట్లును(95శాతం) కేటాయించారు. ప్రైవేటు కాలేజీలు 280 ఉంటే వాటిల్లో 27,647 సీట్లకుగానూ 15,343 సీట్లను(55శాతం) కేటాయించారు. 309 ఎంబీఏ కాలేజీల్లో 29,457 సీట్లకుగానూ 16,896 సీట్లను (57శాతం) కేటాయించారు. ఎంసీఏ కాలేజీల్లో యూనివర్సిటీ కాలేజీలు 18 ఉంటే వాటిల్లో 1076 సీట్లకుగానూ 753 సీట్లను(70శాతం) కేటాయించారు. ప్రైవేటు కాలేజీలు 74 ఉండగా వాటిల్లో 5708 సీట్లకుగానూ 1877 సీట్లను(33శాతం) కేటాయించారు. మొత్తం 92 ఎంసీఏ కాలేజీల్లో 6784 సీట్లకుగానూ 2630 సీట్లను(39శాతం) మొదటి విడతలో కేటాయిం చారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 14 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్ట్ చేయడానికి అవకాశం కల్పించారు. నేటి నుంచి ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌ను ప్రారంభించనున్నారు.

NOTICE

MAHADHAN

In order to make the Indian Farmers internationally competitive, Mahadhan Agritech Limited brings to you the following Imported & Indigenous 100% Water Soluble Mixture of Fertilisers as per order dated 24.10.2015, issued by Ministry of Agriculture & Farmers Welfare, Govt. of India, New Delhi.

| Sr.No. | Particulars / Grade | NPK 14-10-28 |
|---|---|---|
| 1 | Moisture percent by weight, maximum | 0.5 |
| 2 | Total Nitrogen percent by weight, minimum | 14 |
| 3 | Total Phosphorous and water soluble phosphorous (as $P_2O_5$) percent by weight, minimum | 10 |
| 4 | Water Soluble Potassium (as $K_2O$) percent by weight, minimum | 28 |
| 5 | Total Chloride per cent by weight, maximum | 1.5 |
| 6 | Matter insoluble in water per cent by weight, maximum | 0.5 |
| 7 | Sodium (as NaCl) per cent by weight, maximum | 0.5 |
| 8 | Lead (as Pb) per cent by weight, maximum | 0.003 |
| 9 | Cadmium (as Cd) per cent by weight, maximum | 0.0025 |
| 10 | Arsenic (as As) per cent by weight, maximum | 0.01 |

Salient Features:
1. 100% Water Soluble
2. Improves Quality and yield of the produce
3. Suitable to use through drip irrigation and foliar application
Packing : Available in 500 gm, 1 Kg, 5 Kg, 10 Kg and 25 Kg Packing
Supply and sales of above Mahadhan WSF grades will be done after 30-35 days.

Manufactured / Imported & Marketed by -
MAHADHAN AGRITECH LIMITED
Registered Office : Sai Hira, Survey No. 93, Mundhwa Road, Mundhwa, Pune - 411036.
www.mahadhan.co.in

వార్త

కన్పించే శత్రువు శాపంలా అన్పించవచ్చు. కాని నటించే మిత్రుడు శత్రువు కన్నా ప్రమాదకరం.

- జాన్ గే

## మత్తు వదిలిస్తారా?

గతి తప్పినా, మతి తప్పినా ఏ వాహన చోదకుడైనా వెళ్లేది నేరుగా యమలోకానికే అన్న విషయంలో ఎవరికీ ఏ భిన్నాభిప్రాయమూ ఉండదు. వాహనాలు నడిపేటప్పుడు అది నేల మీదనైనా, గాల్లోనైనా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. ఎంతో మంది ప్రయాణికుల ప్రాణాలు, భవిష్యత్తు వాహన చోదకుల అప్రమత్తత మీదనే ఉంటుంది. వారు ఏ తప్పు చేసినా ప్రయాణికుల ప్రాణాల్లో గాల్లో కలిసిపోతాయి. మాదకద్రవ్యాలు, గంజాయి, మద్యం సేవించిన వారువాహనాలు నడిపినప్పుడు రోడ్డు ప్రమాదాల్లో పడి చనిపోయిన సంఘటనలెన్నెన్నో వింటున్నాము. కుటుంబ జీవనాధారమైన వ్యక్తులు విమాన ప్రమాదాల్లో చనిపోయిన వారి కుటుంబాల పరిస్థితి దిక్కుతోచదు. థాయ్‌లాండ్‌లోని పుకెట్-ఢిల్లీ ఎయిర్ ఇండియా విమానం గాల్లో ఉండగానే 300 అడుగులు కిందకు పడిపోయిన ఘటనలో 'బ్లాక్ బాక్స్' డేటా చెప్పిన విషయాలు అవలోకిస్తే కొంత ఆశ్చర్యమూ కొంత దిగులు కలుగుతుంది. విమానంలోని మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు ఒకేసారి విఫలమవడంతో దాదాపు 4 సెకెన్లతోపాటు ఫ్లైట్ కంట్రోల్స్ పూర్తిగా మొరాయించాయని విమాన తయారీ సంస్థ ఎయిర్‌బస్ తన ప్రాథమిక నివేదికలో వెల్లడించింది. ప్రధానంగా చెప్పుకోవాల్సిన విషయం మరొకటి ఉంది. పైలట్ గంజాయి తీసుకున్నట్లు రెండుసార్లు చేసిన డోపింగ్ పరీక్షల్లో తేలింది. మాదకద్రవ్యాల ప్రభావంతోనే పైలెట్లు గతి తప్పి విమానాలు ప్రమాదాలకు గురై ఎన్నోప్రాణాలు గాల్లో కలిసిపోయిన సంఘటనలు వింటున్నాము. మత్తు ఎంత ప్రమాదమో అందరికీ తెలిసిందే.ప్రభుత్వాలు అప్రమత్తం చేస్తున్నా, ప్రభుత్వ ఉద్యోగులు, విమాన చోదకులు మాదకద్రవ్యాలు తీసుకోరాదని నిబంధనలున్నా ఎవరూ పాటించడం లేదు. వాటి నిషేధాన్ని అమలు పెట్టాల్సిన అధికారులు కూడా పట్టించుకోరు. ఈభయంకర సత్యాల నేపథ్యంలో ఎయిర్ ఇండియా పైలెట్లకు డోపింగ్ పరీక్షలను తప్పనిసరి చేసింది. ఏ-320 నియోవిమానం హఠాత్తుగా 300 అడుగుల కిందకుపడిపోయి తీవ్ర సంచలనం సృష్టించింది. ప్రయాణికులు ఎంతగానో గాభరాపడ్డారు. ప్రతి విమానంలోనూ ఉన్నట్లే ఈ విమానంలోకూడా 'డిజిటల్ ఫ్లైట్ డేటా రికార్డర్' సమాచారాన్ని విశ్లేషించిన అనంతరమే పైలెట్ల వ్యవహారశైలి, తీసుకున్న మాదక ద్రవ్యాల వివరాలు వెల్లడయ్యాయి. విమానంలోని అసాధారణ పరిస్థితుల వల్లనే విమాన గమనాన్ని ఎత్తును నియంత్రించే ఎలివేటర్లు, అలెరౌన్లు స్పాయిలర్లు నాలుగు సెకన్లపాటు పైలెట్ ప్రమేయం లేకుండా తమంతటతామే కదిలాయని విశ్లేషణలో తేలింది. విమానం రెక్కలుగాల్లో తగినంత లిఫ్ట్ ఇవ్వలేకపోతున్నాయని 'స్టాల్'హెచ్చరికలు వచ్చాయి. ప్రయాణికుల భద్రత, నమ్మకమే ప్రధానంగా ఎయిర్ ఇండియా యాజమాన్యం కఠిన నిర్ణయం తీసుకుంది. ఒక ప్రమాదం జరగడం దాని విశ్లేషణ, పరిణామాలను బట్టి నిర్ణయాలు తీసుకోవడంవల్లన పోయిన ప్రాణాలు తిరిగిరావు. దాదాపు ప్రపంచంలో ఎలాంటి వాహన చోదకతలో లోపాలున్నాయన్న అయినా విమర్శలకు గురికాకుండా ప్రమాదం వాటిల్లకుండా ముందుజాగ్రత్తలతో పైలెట్లకు డోపింగ్ తప్పనిసరి చేయడం ఆహ్వానించదగినదే. ప్రమాదానికి గురైన విమాన ప్రధాన పైలట్ సుదీప్ విశిష్ట్ విచిత్ర వ్యవహారశైలి, తడపాటు, నడవలేక తూలుతున్నవైనాన్ని బట్టి మూత్ర నమూనాల పరీక్ష చేయిస్తే అసలు విషయం బయటపడింది. ఈ విమానం కిందకు దిగేక్రమంలో ప్రయాణికులు తీవ్ర ఒత్తిడికిగురయ్యారు.దాదాపు ప్రయాణికులు కుదుపునకు గురై విమానంపై కప్పునుబలంగా ఢీకొట్టారు. విమానా న్ని నడిపే పైలట్ సరైన మానసికస్థితిలో కానీ శారీరక పటుత్వంతో కానీ లేకుంటే జరిగే ప్రమాదాలకు, దుస్సంఘటనలకు ఆ విమాన సంస్థే బాధ్యత వహించాల్సిందే. విమానాల వర్కింగ్ కండిషన్ బాగుంటేనే అవి సజావుగానడుస్తాయి. తాజాగా ఎయిర్ ఇండియా తీసుకున్న నిర్ణయం వలన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 5వేల మంది పైలెట్లు డోపింగ్ టెస్ట్ చేయించుకోవాల్సి ఉంటుంది. పైలెట్లు, సిబ్బంది డోపింగ్ టెస్ట్‌లో నిషేధిత ఆహార పదార్థాలున్న సంకేతాలు కానీ,ఆనవాళ్లు కానీ కనబడితే, నిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్‌గా వస్తే అది ప్రమాదాలను సూచిస్తుంది. ఘటన జరిగినప్పుడే కాస్త హడావుడి.మళ్లీ మామూలే. ముందుగా విమాన భద్రతా లోపం కన్పిస్తే జాగ్రత్తపడేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. విమానయాన సంస్థలు యేటాకనీసం10శాతం ఫ్లైట్ క్రూను యాదృచ్ఛికంగా సైకోయాక్టివ్ ప్రమాదాలు పడుతుంటాయి. ఒక పరీక్షల్లో పాజిటివ్ వచ్చినంత మాత్రాన శరీరం రోగగ్రస్థమని అనుకోనక్కర్లేదు. ఈ పరీక్షలను ఒక్క పైలట్‌లకే సబ్ స్టాన్స్ పరిమితం చేయడం తప్పు.డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఏవియేషన్ నిబంధనల ప్రకారంయేడాదికి 10శాతం మంది పైలట్లకు మాత్రమే యాదృచ్ఛికంగా డ్రగ్స్ పరీక్షలు నిర్వహిస్తుంటారు. ఆధునిక విమానయాన రంగంలో సిబ్బందిపై విపరీత పనిభారం, సక్రమంగా లేని రోస్టర్ వేళలు,తగినంత విశ్రాంతి దొరక్కపోవడం వంటిఅంశాల్లో వారి మానసిక ఒత్తిడివారి ఆరోగ్యం మీద పడుతోంది. డ్రగ్స్ వాడకాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించకూడదు. విమానం నడిపే పైలట్ చేతిలో వందలకొద్దీ ప్రాణాలుంటాయి.ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా అంతే సంగతులు.ఎయిర్ ఇండియా వంటి విమానయాన సంస్థలు మరికొన్ని తమ సర్వీసులను నడిపిస్తున్నాయి. ఆ సంస్థలు కూడా తమ పైలట్‌లు ఇటువంటి నిబంధనలు పాటించేటట్లు చూసుకోవాలి. నిన్నమొన్నటి విమాన ప్రమాదం మొదటిది కాకున్నా, ఇలాంటి ప్రమాదం మరొకటి జరగకుండా అప్రమత్తంగా ఉండాలి.



ప్రతి ఒక్కరూ ఇది చెడు అని చెప్పగలరు. అయితే అందులో నుంచి బయటపడే మార్గం చెప్పగలిగినవాడే నిజమైన మిత్రుడు.

స్వామి వివేకానంద



సాధారణంగా ప్రతి వారు 'నాకు' ముక్తి కావాలనుకుంటారు. ఇది సరికాదు. 'నాకు' అనే పదం నుండి విముక్తి కావాలి.

రమణ మహర్షి

## ప్రజావాక్కు

### మానవ వివేచన ముఖ్యం

కృత్రిమ మేధస్సు వేగంగా విస్తరిస్తున్న కొద్దీ ఉద్యోగ ప్రపంచం స్వరూపం కూడా గణనీయంగా మారుతోంది. ఏఐ ఆధారిత కోర్సులకు బిజినెస్ స్కూళ్లు,ఉన్నత విద్యా సంస్థలు ప్రాధాన్యం ఇవ్వడం అవసరమే. అయితే సాంకేతికనైపుణ్యాలకే పరిమితమైతేభవిష్యత్ ఉద్యోగ ప్రపంచాన్ని ఎదుర్కొనే సమగ్ర సామర్థ్యం విద్యార్థుల్లో పెరగదు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మానవీయ నైపుణ్యాలను పెంపొందించడంపైనే విద్యాసంస్థలు దృష్టి సారించాలి. కమ్యూనికేషన్, బృందంగా పనిచేయడం, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కారం, నిర్ణయ సామర్థ్యం వంటి నైపుణ్యాలు ఏఐ విస్తరిస్తున్నా తమ ప్రాధాన్యాన్ని కోల్పోవు. యంత్రం సమాచారాన్ని వేగంగా విశ్లేషించగలదు. కానీ ఆ సమాచారానికి సందర్భాన్ని జోడించడం, దాని విశ్వసనీయతను పరిశీలించడం, నైతిక పరిణామాలను అంచనా వేయడం, తుది నిర్ణయం తీసుకోవడం మానవ వివేచనపైనే ఆధారపడి ఉంటుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల భవనాలు దాదాపుగా ఆధునీకరించబడినవి. ఏప్రభుత్వ కార్యాలయం అయినా మార్పులు చేసేటప్పుడు ప్రధానంగా పారిశుధ్యపు వసతి, నీటి సరఫరా, విద్యుత్ కలిపే చేస్తారు. మరి మహిళలకు ఒకటి వేరేగా వాష్‌రూమ్ ఉంటేనే సిబ్బంది, మహిళ విద్యార్థినీలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.ఇవి లేనందున కొందరుఅమ్మాయిలు వేరే ప్రైవేట్ పాఠశాలకు వెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు. ఇది అతి సహజమైనది. కొందరు బడి మానివేయడం బాధాకరం. వీరు చెప్పే ధైర్యం లేక అలా చేస్తున్నారు.ఇది చిన్న సమస్య. విద్యాశాఖ ఈ వసతి కూడా లేని పాఠశాలల్లో వాష్‌రమ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.

- బి. మేఘనాదం, విశాఖపట్నం

### యూరప్ సంక్షోభం!

నిజానికి మొరాకోలో పేదరికం తగ్గింది అయితే యువకులలో నిరుద్యోగం పెరిగింది.అది ఎంతగా అంటే దేశంలో ఉన్న మొత్తం నిరుద్యోగం కంటే మూడింతలు ఎక్కువ నిరుద్యోగంఉంది.అందుకేకొన్నినివేదికలప్రకారం స్పెయిన్ లోను, గ్రీస్‌లోను ఇటలీలోకి వలసలు పెద్ద మొత్తంలో ఉన్నాయి. అభివృద్ధి అనేది ఉపాధి రహితంగా ఉంది.

-భారత అవినాష్, జనగామ

### పరిశుభ్రత ప్రతి పౌరుడి కర్తవ్యం

నేడు కొందరు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం, ప్లాస్టిక్ సీసాలు,కవర్లు, ఆహార అవశేషాలు రోడ్లపై పడేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. చెత్తను నిర్లక్ష్యంగా పారేయడం వల్ల దుర్వాసన, దోమలు, ఈగలు పెరిగి అనేకవ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. మన ఇల్లు ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో,మన వీధులు,పార్కులు, బహిరంగ ప్రదేశాలుకూడా అంతేశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది. పరిశుభ్రత ప్రభుత్వ బాధ్యతే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం కూడా. పరిశుభ్రమైన పరిసరాలతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం. ఇతరులకు ఆదర్శంగా నిలుద్దాం.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### అన్నదాత పట్ల చొరవ చూపాలి

ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక కుదేలవుతున్న రైతన్న కష్టాలువర్ణనాతీతం.అనాది నుంచి కర్షకుడికి అతివృష్టి, అనావృష్టి అవినాభావ సంబంధం అంటే అతిశయోక్తికాదు. అగ్నికిఆజ్యం పోయకుండా కల్తీ విత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ సంబంధిత వనరులతో మూలిగే నక్కమీదతాటికాయపడినట్లు ఈ యేడాది రుతుపవనాలు ఆలస్యానికి కారణమయిన ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం వల్ల పంటలకు కోలుకోలేని దెబ్బ. మొత్తం దేశం సాగుకు గుదిబండ దాంతోఅప్పుల బాధతో ఆగని ఆత్మహత్యలు. దేశానికి వెన్నెముఖ శ్రామికుడు కళ్లలో మెరుపులు చూసినప్పుడే ప్రజలు సుభిక్షం. కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత పట్ల మరింత చొరవ చూపాలి.

- ఆర్. వెంకటేష్, బెంగళూరు

### వినియోగదారుల రక్షణ నైతిక బాధ్యత

వాట్సాప్ ప్రతిపాదించిన యూజర్‌నేమ్ ఫీచర్‌పై దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చ ఒక కీలకఅంశాన్ని వెలుగులోకి తెచ్చింది.వినియోగదారుల సౌలభ్యం ఎంతముఖ్యమో, వారి భద్రత అంతకంటే ముఖ్యమనే విషయాన్ని ఈవివాదం గుర్తు చేస్తోంది. ఫోన్ నంబర్‌కు బదులుగా యూజర్‌నేమ్ ఆధారంగా సంభాషించే అవకాశం కల్పించడం గోప్యతకు మేలు చేసినా, అదే సమయంలో నకిలీగుర్తింపులు, వ్యక్తుల పేర్లను అనుకరించడం,ఆర్థికమోసాలు, సైబర్ నేరాలకు అవకాశం కల్పిస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం భద్రతాపరమైన అంశాలపై వివరణ కోరుతూ జాగ్రత్త వైఖరిని అవలంబించడం సముచితమే.

-సి.సాయి, నల్గొండ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# యువత వికాసమే అభివృద్ధికి కొలమానం

**యువతుల విషయంలో భద్రత, ప్రయాణ సౌకర్యం, పిల్లల సంరక్షణ, అనువైన పని విధానాలు కల్పించి వారు స్థిరమైన ఆదాయం పొందేపరిస్థితులను సృష్టించాలి. అలాగే గ్రామీణ, చిన్న పట్టణ యువతకు నాణ్యమైన విద్య, ఇంటర్నెట్, గ్రంథాలయాలు అందుబాటులో ఉంచి ఆర్థిక పరిస్థితి అడ్డంకిగా మారకుండా విద్యా రుణాలు, ఉపకార వేతనాలను విస్తరించాలి. 2036 నాటికి యువత జనాభా 34.55 కోట్లకు తగ్గే అవకాశం ఉన్నందున ప్రస్తుత దశలో తీసుకునే నిర్ణయాలు దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి. యువత సంఖ్యను మానవ సామర్థ్యంగా మార్చడానికి విద్యతోపాటు నైపుణ్యం, ఉపాధి, మానసిక ఆరోగ్యం, ఆర్థికభద్రత, మహిళల భాగస్వామ్యం అవసరం. యువతను కేవలం దేశ 'భవిష్యత్తు' అని పిలవడంతో సరిపెట్టకుండా వారు తమ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకునే వాతావరణాన్ని నిర్మించడమే ప్రభుత్వ విధానాల ప్రధాన లక్ష్యం కావాలి.**

డి. జయరాం

నేటి యువత ఆకాంక్షలను కేవలం ఒక ఉద్యోగానికి మాత్రమే పరిమితం చేయడం సరిపోదు. ఆర్థిక స్వావలంబన, స్థిరమైన ఆదాయం, నాణ్యమైన ఉద్యోగం, వ్యక్తిగత స్వేచ్ఛ, నిరంతర అభ్యాసం, పని వ్యక్తిగత జీవితాల మధ్య సమతుల్యత వారి ప్రధాన ప్రాధాన్యతలుగా మారాయి. గ్రామీణ యువతకు స్థిరమైన ఉపాధిమార్గాలు, పట్టణ యువతకు వృత్తిపరమైన పురోగతి, యువతులకు ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు భద్రత, ప్రయాణ సౌకర్యాలు, అనుకూలమైన పని వాతావరణం ప్రధాన అవసరాలుగా కనిపిస్తున్నాయి. జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవడంతో పాటు తమ జీవిత నిర్ణయాలను స్వతంత్రంగా తీసుకునే స్వేచ్ఛను వారుకోరుకుంటున్నారు. 2026 నాటికి భారత దేశంలో 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత జనాభా సుమారు 36.74 కోట్లకు చేరింది. 2021 నాటికి ఈ సంఖ్య 37.14 కోట్లుగా ఉండగా, దేశ జనాభాలో యువత వాటా 27.2 శాతంగా నమోదైంది. 2031 నాటికి ఇది 35.66కోట్లకు,2036 నాటికి 34.55 కోట్లకు తగ్గుతుందని ప్రభుత్వ అంచనాలు చెబుతున్నాయి. ప్రస్తుతం భారత్ వద్ద ఉన్న ఈ భారీ యువ జనాభా ఒక ప్రత్యేకమైన ఆర్థిక అవకాశం. విద్య, నైపుణ్యాలు, ఉపాధి, ఆరోగ్యం, ఆర్థిక భద్రత వంటి అంశాలను సమర్థంగా అనుసంధానించగలిగితేనే ఈ జనాభా ఉత్పాదక శక్తిగా మారుతుంది. ఈ మారిన ఆకాంక్షలకు ఆర్థిక పరిస్థితులు పెద్ద సవాలుగా నిలుస్తున్నాయి. 2026 డెలాయిట్ సర్వేప్రకారం భారత జెన్ జెడ్ స్పందించిన వారిలో 54 శాతం మంది ఆర్థిక అనిశ్చితి కారణంగా ముఖ్యమైన జీవిత నిర్ణయాలను వాయిదా వేసుకున్నట్లు తెలిపారు. అలాగే 37 శాతం మందికి సొంత ఇల్లు కొనుగోలు చేయడం అందుబాటులో లేకపోగా, 29శాతం మంది ఆర్థిక అసురక్షిత భావనను వ్యక్తం చేశారు.మరో 27శాతం మందికి నిరుద్యోగమే ప్రధానఆందోళనగా మారింది. ఈ గణాంకాలు యువత జీవితంలో ఆర్థిక స్థిరత్వం ఎంత కీలకంగా మారిందో స్పష్టం చేస్తున్నాయి. అందువల్ల నేడు ఉద్యోగ ఎంపికలో వేతనంతో పాటుఉద్యోగ భద్రత, నైపుణ్యాల పెంపు, వ్యక్తిగత సమయానికి ప్రాధాన్యత పెరుగుతోంది. యువత ఆకాంక్షలకు విద్య నుంచి ఉపాధికి జరిగే మార్పు విధానమే కీలకమైన పరీక్షగా నిలుస్తోంది. ఉన్నత విద్య విస్తరిస్తున్నప్పటికీ, విద్యార్థులు పొందుతున్న విద్యకు, ఉద్యోగ మార్కెట్ కోరుతున్న నైపుణ్యాలకు మధ్య అంతరం కొనసాగుతూనే ఉంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ, ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా రూపొందించిన ఇండియన్ ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ 2024 కూడా భారత కార్మిక మార్కెట్‌లో యువత ఉపాధి, నైపుణ్యాలే కీలక అంశాలని తెలిపింది. విద్యార్థులు పట్టా పొందిన వెంటనే ఉద్యోగానికి సిద్ధంగా ఉండేలావిద్యా వ్యవస్థలో మార్పులు రావాల్సిన అవసరం ఉంది.దీనికోసం కళాశాలలు, విశ్వవిద్యాలయాలు పరిశ్రమలు, పరిశోధనా సంస్థలతో అనుసంధానాన్ని పెంచుకోవాలి. ఇంటర్న్‌షిప్‌లు, ఆచరణాత్మక ప్రాజెక్టులు ఉన్నత విద్యలో అనివార్య భాగం కావాలి. నైపుణ్య శిక్షణకు ఇచ్చే ధ్రువీకరణ పత్రాల సంఖ్య కంటే ఉద్యోగ ప్రాప్తి, ఆదాయ పెరుగుదల,వ్యాపార స్థాపన వంటి ఫలితాల ఆధారంగా ప్రమాణాలను కొలవాలి. కోర్సు




ఎంచుకునే ముందే అభ్యర్థులకు మార్కెట్ డిమాండ్‌పై స్పష్టమైన వృత్తి మార్గదర్శకత్వం అందడం వల్ల ఏ రంగంలో అవకాశాలున్నాయో ముందే తెలుస్తుంది.చదువు పూర్తయ్యాక స్థిరమైన ఉద్యోగం కోసం పోటీ పడే యువతకు అవకాశాలు పరిమితంగా కనిపించినప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలపై ఆకర్షణ పెరుగుతుంది. అయితే మొత్తం యువతకు సరిపడా ప్రభుత్వ ఉద్యోగాలు సాధ్యం కావు. కాబట్టి తయారీ, నిర్మాణం, ఆరోగ్యం, పర్యాటకం, రవాణా, ఆధునికవ్యవసాయం, సంరక్షణ సేవలు, డిజిటల్ రంగాల వంటి అధిక ఉపాధి సృష్టించే రంగాలను విస్తరించాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణాలు, సాంకేతికత సులభంగా అందేలా చూస్తూ, యువ పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహాయంతో పాటు సరియైన మార్గదర్శకత్వం అందించాలి. అదే సమయంలో ప్రభుత్వ నియామకాలు, పోటీపరీక్షల నిర్వహణలో పారదర్శకత అత్యంత అవసరం. నియామకాల్లో జాప్యం, పరీక్షల నిర్వహణపై అనుమానాలు యువత భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ప్రతి శాఖ ఖాళీలను ముందుగానే ప్రకటించి నిర్ణీత కాలపరిమితిలో నియామక ప్రక్రియ పూర్తిచేయాలి. పరీక్షా విధానంలో సాంకేతిక భద్రతను పెంచి, కష్టపడి చదివే అభ్యర్థికి తన శ్రమకు తగిన న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని కల్పించాలి.ఉపాధి పోటీ, విద్యా ఒత్తిడి, ఆర్థిక అనిశ్చితి యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. యునిసెఫ్ ప్రకారం 18-29 సంవత్సరాల యువతలో 7.3 శాతం మంది మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటుండగా, ఎన్‌సీఈఆర్‌టీ సర్వేలో 11శాతం మంది విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు వెల్లడైంది. ప్రతిలక్ష జనాభాకు కేవలం 0.75 మంది మానసిక వైద్యులు మాత్రమే ఉండటం సేవల కొరతను సూచిస్తోంది. అందుకే పాఠశాలలు, కళాశాలల్లో గోప్యతతో కూడిన సలహా కేంద్రాలను ఏర్పాటుచేసి, మానసిక ఆరోగ్య సేవలను సంక్షోభం వచ్చినప్పుడు మాత్రమే కాకుండా ముందస్తు సహాయ వ్యవస్థగా మార్చాలి. మరోకవైపు, కృత్రిమ మేధ ఉపాధి ప్రపంచాన్ని వేగంగా మార్చుతోంది. 2026 డెలాయిట్ సర్వే ప్రకారం భారత జెన్ జెడ్, మిలీనియల్స్ లో90 శాతానికి పైగా ప్రతిరోజూ ఎఐని ఉపయోగిస్తున్నారు. కేవలం సాంకేతిక వినియోగమే కాకుండా డేటా రక్షణ, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. విద్యా సంస్థలు, పరిశ్రమలు కలిసి నిరంతర నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా కొత్త విజ్ఞానాన్ని నేర్చుకునే అవకాశం లభిస్తుంది. యువతుల విషయంలో భద్రత, ప్రయాణ సౌకర్యం, పిల్లల సంరక్షణ, అనువైన పని విధానాలు కల్పించి వారు స్థిరమైన ఆదాయం పొందేపరిస్థితులను సృష్టించాలి. అలాగే గ్రామీణ, చిన్న పట్టణ యువతకు నాణ్యమైన విద్య, ఇంటర్నెట్, గ్రంథాలయాలు అందుబాటులో ఉంచి ఆర్థిక పరిస్థితి అడ్డంకిగా మారకుండా విద్యా రుణాలు, ఉపకార వేతనాలను విస్తరించాలి. 2036 నాటికి యువత జనాభా 34.55 కోట్లకు తగ్గే అవకాశం ఉన్నందున ప్రస్తుత దశలో తీసుకునే నిర్ణయాలు దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి. యువత సంఖ్యను మానవ సామర్థ్యంగా మార్చడానికి విద్యతోపాటు నైపుణ్యం,ఉపాధి, మానసిక ఆరోగ్యం,ఆర్థికభద్రత, మహిళల భాగస్వామ్యం అవసరం. యువతను కేవలం దేశ 'భవిష్యత్తు' అని పిలవడంతో సరిపెట్టకుండా వారు తమ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకునే వాతావరణాన్ని నిర్మించడమే ప్రభుత్వ విధానాల ప్రధాన లక్ష్యం కావాలి. ●

# డిజిటల్ శబ్దంలో ప్రకృతి స్వరం వినిపిస్తుందా?

ఫిరోజ్ ఖాన్

స్వాతంత్ర్య దినోత్సవ వైభవం ముగిసింది. దేశం సాధించిన విజయాలను గర్వంగా స్మరించుకున్నాం. అయితే ఆ సంబరాల తర్వాత కూడా మన ముందున్న ఒక ప్రశ్నను విస్మరించలేం. అభివృద్ధి ఫలితాలు ప్రతి పౌరుడి దైనందిన జీవితంలో ఎంతవరకు ప్రతిఫలిస్తున్నాయి? స్వతంత్రం అంటే కేవలం విదేశీపాలన నుంచి విముక్తి మాత్రమే కాదు. ప్రతి పౌరుడు ఆరోగ్యకరమైన, సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణంలో జీవించే అవకాశమూ దాని విస్తృత భావనలో భాగమే. ఇది ఏ ప్రభుత్వానికీ, ఏ రాజకీయ పార్టీకీ వ్యతిరేకమైన ప్రశ్న కాదు. అభివృద్ధి, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను ఎలా సాధించాలనే అంశంపై సమాజం చేసుకోవాల్సిన ఆత్మపరిశీలన. భారత రాజ్యాంగంలోని 48ఏ అధికరణం పర్యావరణం, అడవులు,వన్యప్రాణుల పరిరక్షణకు రాష్ట్రం కృషి చేయాలని సూచిస్తే, 51ఏ(జి) అధికరణం ప్రకృతి పట్ల కరుణతో వ్యవహరించడం ప్రతి పౌరుడి కర్తవ్యంగా పేర్కొంటుంది. న్యాయవ్యవస్థ కూడా జీవించేహక్కును ఆరోగ్యకరమైన పర్యావరణంతో అనుసంధానిస్తూ వచ్చిన నేపథ్యంలో, అభివృద్ధిని కేవలం ఆర్థిక గణాంకాలతో కాకుండా పౌరుడు పీల్చే గాలి, తాగే నీరు, పిల్లలు పెరిగే పరిసరాలు, నగరాల్లో పచ్చదనం వంటి అంశాలతోనూ అంచనా వేయాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యంలో రాజకీయ చర్చ అనివార్యం. ఎన్నికలు, విధానాలు, అధికార-ప్రతిపక్ష వాదనలు ప్రజా జీవితంలో సహజమైన భాగాలే. అయితే డిజిటల్ వేదికలపై ఏఅంశం ఎంత వేగంగా వైరల్ అవుతుందో,అదే అంశం ప్రజా చర్చలో ఎంతకాలం నిలుస్తుందో కూడా మారుతోంది.రాజకీయ అంశాలు తక్షణ దృష్టిని ఆకర్షిస్తున్న సమయంలో గాలి, నీరు, అడవులు, వాతావరణ మార్పు, ప్రజారోగ్యం వంటి దీర్ఘకాలిక సమస్యలు వెనుకబడే అవకాశం ఉంది. రాయిటర్స్ ఇన్‌స్టిట్యూట్ డిజిటల్ న్యూస్ రిపోర్ట్ 2026లో భారత్‌కు సంబంధించిన సర్వేలో వార్తలపై విశ్వాసం 39




శాతంగా నమోదైందని, ఆన్‌లైన్‌లో తప్పుడు లేదా తప్పుదారి పట్టించే సమాచారంపై ఆందోళన వ్యక్తం చేసిన వారి వాటా 58శాతంగా ఉందని పేర్కొంది. సామాజిక మాధ్యమాలను పూర్తిగా ప్రతికూలంగా చూడటం కూడా సరైంది కాదు. అవే వేదికలు పర్యావరణ అవగాహన, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, స్థానిక సమస్యలకుప్రజా దృష్టి తీసుకురావడంలో ఉపయోగపడుతున్నాయి. అసలు అవసరం వైరల్ సమాచారాన్ని వెంటనే నిజమని నమ్మడం కాదు. మూలాలను పరిశీలించడం, శాస్త్రీయ ఆధారాలను గౌరవించడం, ధృవీకరించిన సమాచారాన్నే ముందుకు తీసుకెళ్లడం. దేశంలో రహదారులు, పరిశ్రమలు, పట్టణాలు, డిజిటల్ సేవలు విస్తరిస్తున్న కొద్దీ వాటి పర్యావరణ ప్రభావాలను ముందుగానే అంచనా వేసి తగ్గించడం కూడా అవసరం. ప్రపంచ ఆరోగ్యసంస్థ వాయు కాలుష్యాన్నిప్రజారోగ్యానికి ప్రధాన ప్రమాద కారకంగా గుర్తిస్తోంది. సూక్ష్మ కణకాలుష్యం, ముఖ్యంగా పీఎం 2.5, ఆరోగ్యంపై చూపే ప్రభావాలపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం ద్వారా నగరాల్లో గాలినాణ్యత మెరుగుదల, కాలుష్య నియంత్రణ, స్థానికస్థాయి కార్యాచరణకు ప్రాధాన్యం ఇస్తోంది. ఇటువంటి కార్యక్రమాల అసలు ఫలితం వాటి అమలు,పర్యవేక్షణ,ప్రజలకు అందుతున్నప్రయోజనాల్లో కనిపించాలి.వాహనాల ఉద్గారాలు,నిర్మాణ ధూళి, రోడ్డు ధూళి, వ్యర్థాల దహనం, పారిశ్రామిక ఉద్గారాలు వంటి కాలుష్య వనరులపై నిరంతర పర్యవేక్షణ అవసరం. అభివృద్ధి ఆగాల్సిన అవసరం లేదు. పర్యావరణ పరిరక్షణను అభివృద్ధికి వ్యతిరేకంగా చూడకుండా, అభివృద్ధి నాణ్యతను నిర్ణయించే ఒక ముఖ్యమైన ప్రమాణంగా చూడాల్సిన సమయం ఇది. దేశాభివృద్ధిని ఇకపై కేవలం జీడీపీ, హైవేలు, భవనాలు,పెట్టుబడుల పరిమాణంతోనే కొలవడం సరిపోదు.అభివృద్ధి మధ్యఒక సాధారణ పౌరుడి జీవన నాణ్యత ఎంత మెరుగుపడిందన్నదీ అంతేముఖ్యమైన ప్రమాణం కావాలి. దేశం ఎంత ఎత్తుకు ఎదిగిందన్నదే కాదు, ఆఎదుగుదల ప్రతిపౌరుడికి ఎంత ఆరోగ్యకరమైన,స్వచ్ఛమైన,జీవితం అందించిందన్నదే నిజమైన ప్రగతికి కొలమానం. ●

# సాగునీరు లేక ఎండిపోతున్న కృష్ణా డెల్టా

కె. శ్రీనివాస్

కృష్ణా డెల్టాకు జూన్ 15 నుండి సాగునీరు విడుదల చేస్తామని ప్రకటించడంతో కొద్దిపాటి వర్షాలు, కాలువకు వచ్చిన నీరుతో రైతులు నారుమళ్ళు వేసుకున్నారు.కృష్ణా డెల్టాలో ఇప్పుడు వరి వేయవద్దు అంటూ ప్రచారం చేయడంతో రైతులు, కౌలు రైతులు గందరగోళ స్థితిలోఉన్నారు. కృష్ణా డెల్టా పరిధిలో ఖరీఫ్‌లోనే వరి సాగు చేసే పరిస్థితి ఉంది. సాగునీరు లేక రబీ కాలంలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకుంటున్నారు. ఖరీఫ్, రబీ కాలాల్లో ఆరుతడి పంటలు సాగు చేసుకోమని చెప్పడం వలన కృష్ణా డెల్టా రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు ఉపాధి లేక వలసలు పోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా డెల్టాకు సాగునీటి సమస్యపై దృష్టి సారించి అందుకు తగులు చర్యలు ప్రకటిస్తే రైతులు కాస్త ఊపిరి పీల్చుకుంటారు. పట్టిసీమ, పులిచింతల ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉంది. ఏలూరు మండలంలో 10వేల ఎకరాలకు పోణంగి పుంత కాలువ ద్వారా గోదావరి జలాలు గోదావరి ఏలూరు కాలువ నుండి అందించవచ్చు. కానీ పోణంగి కాలువకు గోదావరి నీళ్లను విడుదల చేయడం లేదు. అందుకు గోదావరి మెయిన్ కెనాల్ ఆధునీకరించకపోవడం వలన పోణంగి పుంత కాలువకు గోదావరి నీరు అందడం లేదని అధికారులు చెప్తున్నారు. గోదావరి మెయిన్ కెనాల్‌ను ఆధునీకరణ చేయకుండా అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి రైతులను బలి చేస్తున్నారు. పట్టిసీమ కాలువ నీళ్లను కృష్ణా, గోదావరి మెయిన్ కాలువలకు మళ్లించే అవకాశం ఉంది. పట్టిసీమకు గోదావరి నుండి 80టీఎంసీల నీరు తోడుకునే అవకాశం ఉంది. ఇట్లాంటి పరిస్థితుల్లో గోదావరి వరద జలాలను సముద్రం పాలు చేయకుండా కృష్ణా డెల్టా రైతులకు సాగునీరు అందించే పరిస్థితి ఉన్నా పెడచెవిన పెడుతున్నారు. అందుకు తగిన చర్యలు ప్రభుత్వం ఎందుకు తీసుకోవడం లేదో అర్థం కాని పరిస్థితి. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు పెద్దఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయాలు నిండుతున్నాయి. పులిచింతల వద్ద నీటి నిల్వలు ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావం తగ్గుతోందని శాస్త్రవేత్తలు చెబుతుంటే అందుకు విరుద్ధంగా ప్రభుత్వం మాట్లాడుతున్నది. వందల టిఎంసిల గోదావరి వరద నీరు సముద్రం పాలు అవుతున్నది. రైతులు, కౌలు రైతులు ఎకరాకు రూ. 10 వేలు నుండి రూ. 15 వేలు వరకు పెట్టుబడులు పెట్టి నారుమళ్ళు వేశారు. కొన్నిచోట్ల నాట్లు కూడా వేశారు. ఈ పరిస్థితుల్లో కృష్ణా కెనాల్, గోదావరి ఏలూరు మెయిన్ కెనాల్ రెండు కూడా సమాంతర కాలువలుగా ఉన్నాయి. ఏలూరు పరిధిలోని కృష్ణా డెల్టా ఆయకట్టుకు గోదావరి జలాలు నేరుగా అందించే అవకాశం ఉంది. గతంలో అనేక సందర్భాల్లో కృష్ణాజిల్లా తేలప్రోలు వరకు కృష్ణా డెల్టాకు గోదావరి జలాలను అందించారు. అయితే ఇప్పుడు కృష్ణా, గోదావరి ప్రధాన కాలువలు ఆధునీకరణ జరగకపోవడంతో ఈ కాలువలు శివారు ప్రాంతానికి సాగునీరు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇందుకు ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖ



అధికారులదే బాధ్యత. ఇప్పటికైనా మేల్కొని కృష్ణా,గోదావరి ప్రధాన కాలువలను ఆధునీకరణ చేయాలి. ఇరిగేషన్ శాఖ ప్రణాళికా లోపం చాలా స్పష్టంగా కనబడుతున్నది. రైతులు నారుమళ్ళు వేసుకుని, నాట్లు వేసుకునే సమయంలో నీరు ఇవ్వలేమని చేతులెత్తేయడం భావ్యంగా లేదు. ఖరీఫ్, రబీ రెండు పంట కాలాల్లో అపరాలు సాగు చేస్తే పశువులకు మేత దొరకదు. పైగా పనులు దొరికే పరిస్థితి లేక కౌలు రైతులు,వ్యవసాయ కార్మికులు ఉపాధి కోసం వలసలు పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కృష్ణా డెల్టా ఆయకట్టు భూములకు సాగునీరు విడుదల చేయాలని రైతాంగం కోరుతున్నారు. కొన్ని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కృష్ణ డెల్టాకు సాగునీరు అందించే పరిస్థితి ఉంది. ఉదాహరణకు ఏలూరు రూరల్ మండలంలోని కృష్ణా డెల్టా పరిధిలోని 10వేల ఎకరాలకు పోణంగి పుంత కాలువ ద్వారా గోదావరి జలాలు అందించవచ్చు. పట్టిసీమ ఎత్తిపోతలు కాలువ నీళ్లను పెదవేగి మండలం జానం పేట వద్ద తమ్మిలేరులోకి, ఇతర చోట్ల నుండి మళ్లించి కృష్ణా డెల్టా శివారు భూములకు సాగునీరును గతంలో అందించారు. గోదావరి కాలువకు తూర్పు లాకుల వద్ద మోటార్లు పెట్టి నీరు తోడి గోదావరి జలాలు అందించే అవకాశం ఉన్నది. రైతులు, కౌలు రైతులు వేసిన వరి నారు మళ్ళు, నాట్లు ఎండిపోకుండా సాగునీరు అందించి పంటలను కాపాడాలి. ఇప్పటికైనా ప్రభుత్వం తగు ప్రణాళిక రూపొందించి, నిధులు కేటాయించి కృష్ణా, గోదావరిప్రధాన కాలువలను, ఇతర పంట కాలువలను ఆధునీకరణ చేయాలి. సాగునీటి కోసం కృష్ణా డెల్టా రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు. ఏలూరు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనేక చోట్ల నిరసనలు తెలియజేస్తున్నారు. అయినా ప్రభుత్వం స్పందించడం లేదు. కదలడం లేదు. ఎల్‌నినో ఉంది ప్రత్యామ్నాయ పంటలు వేసుకోమని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు ప్రచారం చేస్తున్నారు. అదే శాస్త్రవేత్తలు ఎల్‌నినో ప్రభావం తగ్గుతోందని చెబుతున్నారు. మరోవైపు కృష్ణానది లోని జలాశయాలకు పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరణకు పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. అయినా కృష్ణా డెల్టా సాగుకు నీటి కొరత ఎదుర్కోవాల్సిన పరిస్థితులే ఉన్నాయి. లక్ష కోట్లు పెట్టి గోదావరి బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తామని ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నారు. ఉట్టికి ఎగురలేని అమ్మ.. ఆకాశానికి ఎగురుతా అన్నట్లుగా మన పాలకుల మాటలు ఉన్నాయి. కాలువల్లో గుర్రపు డెక్క, తూడు, కర్ర నాచు తొలగించలేని ప్రభుత్వాలు లక్షల కోట్లతో కొత్త సాగు నీటి ప్రాజెక్టులు నిర్మాణం చేస్తామని చెప్పడం ఇవి ప్రజలను మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదు. కళ్ళ ఎదుట ఉన్న పంట కాలువల్లో నీరు పారడం లేదు కానీ, ఎక్కడికో నీళ్ల ఇస్తాం.. సస్యశ్యామల చేస్తాం.. అని చెబుతుంటే ఇది రైతులకు అర్థం కాదని ప్రభుత్వాలు భావించడం వారి అవివేకం అవుతుంది. కృష్ణా డెల్టా సాగు నీటి హక్కులను కూడా కాపాడలేకపోతున్నారు. పార్టీలకు అతీతంగా రైతులు తమ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా డెల్టా రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్ పరిణామాలు మరో విధంగా ఉంటాయి. అందుకు పాలకులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పని పరిస్థితులు ఏర్పడతాయి. ఇప్పటికైనా కృష్ణా డెల్టా రైతుల గోడు వినాలి. సాగునీటి సమస్యలు పరిష్కరించాలి. కృష్ణా డెల్టా ఎడారిగా మారకుండా సాగునీటి కోసం కృష్ణా డెల్టా రైతులకు ఉద్యమ మార్గం తప్ప మరో మార్గం లేదు. ●

# సముద్రంలో నిప్పుల తుఫాను!






❖70యేళ్ల రికార్డ్ బ్రేక్ దిశగా ఎల్ నినో ❖మారుతున్న వాతావరణ సరళి ❖వర్షపాతం, ఉష్ణోగ్రతలు, కరవుపై ప్రభావం, ❖నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్పియరిక్ అడ్మినిస్ట్రేషన్ అంచనా ❖ ఇక ఆశలన్నీ ఈశాన్యపవనాలపైనే

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** వర్షాకాలం ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావోస్తోంది. కానీ వర్షాలు మాత్రం 'ఒక్కసారి వచ్చిపోమ్మ మెరుపుతీగ్గ అన్నట్టు ఇలా వచ్చి అలా వెళ్తున్నాయి. ఇక ముందైన వర్షాలు రాకపోతాయా? అని ఓ పక్క రైతులు ఆకాశంవైపు దిగాలుగా చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్పియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఓఎఎ) చేదు వార్తతో పాటు శుభవార్త కూడా చెప్పింది. వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఎల్ నినో బిగ్ షాక్ ఇచ్చింది. ఉష్ణమండల పసిఫిక్ మహాస ముద్రంలో ఈ ఎల్ నినో భూతం వేగంగా బలప డుతోంది. ఇది 2026 అక్టోబర్-డిసెంబర్ నాటికి, 1950 తర్వాత నమోదైన మిగతా ఎల్ నినోల తీవ్రత కంటే 69శాతం ఎక్కువగా ఉండొచ్చని నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్పియరిక్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది. ఎన్ఓఎఎ అంచనా ప్రకారం, ప్రస్తుతం ఏర్పడుతున్న సూపర్ ఎల్ నినో ఇప్పటివరకు నమోదైన వాటిలో అత్యంత బలమైన సంఘటనగా నిలిచేందుకు దాదాపు 69శాతం అవకాశం ఉంది. గతంలో, ఈ సంఘటన "చారిత్రక రికార్డులలోని అతిపెద్ద ఎల్ నినో సంఘటనలలో ఒకటిగ్గా నిలిచే అవకాశం ఉందని ఎన్ఓఎఎ అంచనా వేసింది. ఈ ఎల్ నినో ఎంత వేగంగా తీవ్రమవుతోందనే దానితో పాటు, ఇది శరదృతువు చివరిలో, శీతాకాలం ప్రారంభంలో గతంలో అనుకున్న దానికంటే బల మైన స్థాయిలో గరిష్ట స్థాయికి చేరుకుం టుందని కంప్యూటర్ మోడల్ మార్గదర్శకాలు దాదాపు ఏకగ్రీవంగా చూపించడం వల్ల, అంచనాలో ఈ మార్పు ప్రధానంగా వచ్చింది. ఎల్ నినో అనేది మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్‌లో సగటు కంటే ఎక్కువ వేడి సముద్ర ఉష్ణోగ్రతలతో కూడిన ఒక వాతావరణ చక్రం. ఈ వెచ్చని నీరు మేఘా లు, భారీ వర్షపాతం ద్వారా వాతావరణంలోకి అధిక పరిమాణంలో వేడిని బదిలీ చేస్తుంది.దీని ఫలితంగా, ప్రపంచవ్యా ప్తంగా వాతావరణ సరళి మారుతుంది. ఇది ఇండోనేషియా, ఆస్ట్రేలియాలో కరువుకు, దక్షిణ అమెరికాలోని కొన్ని ప్రాంతాలలో వరదలకు, ఇతర ప్రాంతాలలో అనేక ఇతర ప్రభా వా లకు దారితీస్తుంది. ఉష్ణమండల పసిఫిక్‌లోని ఒక ప్రామాణిక ప్రాంతంలో సగటుతో పోలిస్తే సముద్రపు ఉష్ణోగ్రతలు ఎంత వేడిగా ఉన్నాయనే దాని ఆధారంగా ఎల్ నినో తీవ్రతను నిర్ణయి స్తారు. ఈ సంఘటన, దాని తీవ్రతలో మునుపటి రికార్డు హోల్డర్‌గా ఉన్న 1982-83 మధ్య సంభవించిన భారీ సూపర్ ఎల్ నినోను కూడా మించిపోతుందని ఎన్ఓఎఎ అంచనా వేస్తోంది. ఇదే విషయాన్ని భారత భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ పార్లమెంటు ముందు సైతం తీసుకొచ్చింది. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది చివరి త్రైమా సికంలో తీవ్ర వాతావరణ పరిస్థితుల ఏర్పడే అవ కాశం ఉందని తెలిపింది.

**నైరుతి రుతుపవనాల్లో కనిపించని వర్షపాతం**

పసిఫిక్ మహాసముంద్రంలోని నీరు వేడెక్కడం నైరుతి రుతుపవనాలపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. ఈ కారణంగానే గతంలో పోల్చు కుంటే ఈ ఏడాది వర్షపాతం చాలా తక్కువగా నయోదైంది. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం, దేశంలో జూన్ 1 నుంచి ఆగస్టు 14 మధ్య కాలంలో దీర్ఘకాలిక సగటులో కేవలం 90శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉంది. అంటే ఇది సాధారణం కంటే చాలా తక్కువ అని ఐఎండి స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా మరో శుభవార్త కూడా చెప్పింది. ఈ ఎల్‌నినో ప్రభావం సాధారణంగా నైరుతి రుతు పవనాల వర్షాలను తగ్గించినప్పటికీ, అక్టోబర్-డిసెంబర్ మధ్య దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తమిళ నాడు ప్రాంతాలలో ఈశాన్యరుతుపవనాల రాక కొనసాగుతుంది. ఆ రుతువప నాలపై ఇది పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని అంచనావేసింది. అంటే రాబోయే రోజుల్లో ఈశాన్య రుతుపవనాలతో వర్షా లు పెరిగే అవకాశంఉంది. ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో బలపడుతున్న పాజిటివ్ ఇండి యన్ ఓషన్ డైపోల్ పరిస్థి తులను వాతావరణ శాస్త్రవేత్తలు నిశితంగా గమనిస్తున్నారు. ఒక వేళ ఈ ఓషన్‌డైపోల్ కనుక అక్కడే స్థిరపడితే దక్షి ణాది రాష్ట్రాలపై ఎల్‌నినో చూపే ప్రతికూల ప్ర భావం తగ్గి,వర్షాలకు అనుకూలమైన వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని చెబుతున్నారు. అంటే రాబోయే రోజుల్లో మనకు వర్షాలు వచ్చే అవకాశం ఉన్నట్టే సూచనలు కనిపిస్తున్నాయి.



## మా పైలట్లను బంధించిన ఖతార్

### ఇరాన్ తాజా ఆరోపణ, ఆ ప్రచారంలో నిజంలేదన్న ఖతార్

**దోహా, ఆగస్టు 16:** తమ సైన్యానికి చెందిన ము గ్గురు పైలట్లను ఖతార్ బంధించిందని, వారిని వెంటనే విడిచిపెట్టాలని ఇరాన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఖతార్ ప్రభుత్వానికి సూచించింది. అయితే, ఇరాన్ ఆరోపణలను ఖతార్ ఖండిం చింది. తాము పైలట్లను బంధించలేదని, ఈ ప్రచారంలో నిజం లేదని పేర్కొంటూ అధికారిక ప్రకటన విడుదల చేసింది. అమెరికా, ఇరాన్ యు ద్ధం ప్రారంభమై దాదాపు ఆరు నెలలు కావ స్తోంది. ఇజ్రాయెల్, అమెరికా కలిసి దాడి చేశా యి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌తోపాటు అమెరికా సైనిక బేస్ కలిగిన ఇతర గల్ఫ్ దేశాలపై దాడు లకు దిగిన సంగతి తెలిసిందే. దుబాయ్, యు ఎఇ, సౌదీ, ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాల లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడు లు చేసింది. ఈ క్రమంలో గత ఏప్రిల్‌లో ఖతార్ లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ వైమానిక దాడులకు దిగింది. యుద్ధ విమానాలతో దాడి చేసింది. అయితే, ఖతార్‌లోని అమెరికా సైన్యం ఈ విమానాల్ని కూల్చివేసింది. ఈ ఘటనలో ముగ్గురు పైలట్లు, విమానాల నుండి దూకి తమ ను తాము రక్షించుకున్నారని ఇరాన్ చెబుతోంది. అయితే, ఖతార్ భూభాగంలో దిగిన ముగ్గురు పైలట్లను ఆ దేశం బంధించిందని ఇప్పుడు ఇరాన్ ఆరోపిస్తున్నది. నెలలు గడుస్తున్నా వారిని తమకు అప్పగించడం లేదని చెబుతోంది. ఇరాన్‌కు చెందిన ఎఫ్‌యు-24 విమానాల్ని ఖతార్ కూల్చి వేయడంతో, ఆ విమానాల్లోని జావేద్ సలేహి, అబ్బోల్లాజిద్ దష్తియన్, ఒమిద్ బెహ్జాదేషియన్ అను ముగ్గురు పైలట్లు ఖతార్ సైన్యానికి చిక్కా రని, వారిని విడిచిపెట్టాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. అయితే, ఇరాన్ వాదనను ఖతార్ కొట్టేసింది. తమ వద్ద ఇరాన్ సైనికులు ఎవరూ లేరని చెబుతోంది. ఈ మేరకు ఖతార్ విదేశాంగ శాఖ ప్రతినిధి మాజెద్ అల్ అన్సారీ సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు. తాము విమానాలు కూల్చిన ఘటనలో సైనికుల కోసం పూర్తి స్థాయిలో సోదాలు, సహాయక చర్యలు చేపట్టామని వివరించింది. అయితే, తమకు ఏ ఒక్క సైనికుడు దొరకలేదని చెప్పింది. ఇదే సమ యంలో ఒక సైనికుడికి సంబంధించిన అస్థికలను గతంలోనే ఇరాన్‌కు అందజేశామని పేర్కొంది. అంతేకాదు ఈ ఆరోపణలు గతంలోనే వచ్చా యని, అప్పుడు ఇరాన్‌కు ఒక ప్రతిపాదన పంపినట్లు పేర్కొన్నారు. ఇరాన్ అధికారులు, ఖతార్‌లో పర్యటించి, పూర్తిస్థాయి సోదాలు జరు పుకోవచ్చని చెప్పామన్నారు. కానీ, ఈ అంశంపై ఇరాన్ ఇంకా స్పందించలేదని చెప్పారు. ఇరాన్.. ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు చేస్తుందని విమర్శించారు. ఈ విషయంపై కొం తకాలంగా వివాదం కొనసాగుతున్నా ఇరు దేశాలు తమ వాదనకు కట్టుబడి ఉన్నాయి.

## భారత స్వాతంత్ర్య వేడుకలు గిన్నిస్ రికార్డు

**న్యూయార్కు, ఆగస్టు 16:** అమెరికాలో భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. న్యూయార్క్ ట్రైస్టేట్ ప్రాంతంలోని భారతీయ అమెరికన్ సమాజం నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమం ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంది. అమెరికా 250వ వార్షికోత్సవం, భారత 80వస్వాతంత్ర్య దినోత్సవాన్ని పుర స్కరించుకుని న్యూజెర్సీలోని పార్సిప్పానీ వెట రన్స్ మెమోరియల్ పార్క్‌లో 1,300కు పైగా అమెరికా జెండాలను ఏర్పాటు చేశారు. భారత త్రివర్ణ పతాకాల మధ్య వాటిని 250 అనే సంఖ్య ఆకారంలో అమర్చారు. దీంతో అత్యధిక సం ఖ్యలో జెండాస్తంభాల ఏర్పాటు విభాగంలో గిన్నిస్‌వరల్డ్ రికార్డు నమోదైంది. భారత స్వా తంత్ర్య దినోత్సవం, అమెరికా 250వ వార్షికో త్సవం ఒకేసారి రావడంతో ఈ ఏడాది వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో భారత్ 80, అమెరికా 250 పేరుతో ఆ కార్యక్ర మాన్ని నిర్వహించారు. భారత్, అమెరికా మధ్య స్నేహబంధానికి, రెండు దేశాల ప్రజలను మరిం త దగ్గర చేయడంలో భారతీయ అమెరికన్ సమా జం పోషిస్తున్న పాత్రకు ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. భారత టెక్నాలజీ సంస్థ జోహో మద్దతుతో న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. భారీ సంఖ్యలో జెండాలను ఒక ప్రత్యేక ఆకృతిలో ఏర్పాటు చేయడం ద్వారా భారత్, అమెరికా మధ్య ఉన్న బంధాన్ని చాటే ప్రయత్నం చేశారు. భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరిం చుకుని న్యూయార్క్ ట్రైస్టేట్ ప్రాంతంతో పాటు అమెరికాలోని పలు ప్రాంతాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్, ఐక్యరాజ్యసమితిలోని భారత శాశ్వత మిషన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. వీటికి పెద్ద సంఖ్యలో




ప్రవాస భారతీయులు హాజరయ్యారు. టైమ్స్ స్క్వేర్‌లో ఎఫ్ఐఏ నిర్వహించిన వార్షిక వేడుకల్లో భారత త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. భార తీయ సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమెరికాలోని పలు ప్రముఖ కట్టడాలు భారత త్రివర్ణ పతాకపు రంగుల్లో వెలిగిపోయాయి. న్యూయార్క్‌లోని ఎంపైర్ స్టేట్ బిల్డింగ్, బోస్టన్‌లోని ప్రుడెన్షియల్ సెంటర్ వంటి ప్రముఖ భవనాలు త్రివర్ణ రంగుల్లో దర్శనమిచ్చాయి. అమెరికాలోని పలు రాష్ట్రాల గవర్నర్లు కూడా ఆగస్టు 15ను భారత దినోత్సవం గా ప్రకటిస్తూ ప్రత్యేక ప్రకటనలు జారీ చేశారు. అమెరికా సెనేటర్లు, గవర్నర్లు, చట్టసభ సభ్యులు, వివిధ నగరాలు, పట్టణాలు భారతీయఅమెరికన్ సమాజం అందిస్తున్న సేవలను ప్రశంసించాయి.

## ఆత్మీయ నేస్తాలతో గడిపిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** జెన్ జీ స్టైల్లో ప్రధాని మోడీ పూర్తిగా సోషల్ మీడియాపై ఫోకస్ పెట్టారు. ఇటీవల ఆయన చేస్తున్న ఇన్స్టాగ్రామ్ పోస్టులే ఇందుకు నిదర్శనం. తాజాగా సోషల్ మీడియా స్టార్లు తమ డైలీ రొటీన్ ను పోస్ట్ చేసినట్లు మోడీ కూడా తన దినచర్యలో కీలక ఘట్టాన్ని మన ముందుకు తీసుకువచ్చారు. స్వాతంత్ర్య దినో త్సవం సందర్భంగా ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జాతిని ఉద్దేశించి ప్రసంగించడానికి కొద్ది నిమిషాల ముందు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన అధికారిక నివాసంలో అత్యంత ఆత్మీ యమైన క్షణాలను గడిపారు. 7 లోక్ కల్యాణ్ మార్గ్‌లోని తన నివాస ప్రాంగణంలో రోజూవారీ దినచర్యలో భాగంగా నెమళ్లు, ఆవులకు ఆహారం తినిపిస్తున్న అరుదైన దృశ్యాలను ఆయన సామాజిక మాధ్యమ వేదికగా పంచుకున్నారు. దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్న 80వ స్వాతంత్ర్య వేడుకల వేళ ఈ భావోద్వేగపూరిత వీడియో నెటిజన్ల మనసులను అమితంగా ఆకట్టుకుంటోంది. తన నివాసంలోని మూగ జీవాలు తన కుటుంబ సభ్యులతో సమానమని ప్రధాని మోడీ తరచూ చెబుతుంటారు. ప్రతి రోజూ ఉదయాన్నే వాటికి దాణా అందించడం ఆయన నిత్యకృత్యం. స్వాతంత్ర్య దినోత్సవం కావడంతో ఎప్పటికంటే ముందే ఆయన ఎర్ర కోటకు బయలుదేరాల్సి వచ్చింది. ఈ మార్పును గ్రహించినట్లుగా ఆవులు, అందమైన నెమళ్లు ఆయన కంటే ముందే దగ్గరకు వచ్చి వీడ్కోలు



పలికాయని మోడీపేర్కొన్నారు. నా మిత్రులకు ఆహారం అందించడం రోజూ చేసేదే కానీ నిన్న ఉదయం నేను తొందరగా వెళ్తున్నానని గ్రహించి అవి నన్ను కలిసేందుకు వచ్చాయంటూ ఆయన ఇన్స్టాగ్రామ్‌లో రాసుకొచ్చారు. పీఎం నివాసంలో కనిపిస్తున్న పశువులలో ఆంధ్రప్రదేశ్ ప్రాచీన, అరుదైన రకానికి చెందిన పుంగనూరు జాతి ఆవులు కూడా ఉండటం గమనార్హం. వీటితో పాటు అందమైన నెమళ్లకు ఆయన సొంత చేతు లతో ధాన్యాన్ని, దానాను అందిస్తున్న దృశ్యాలు ప్రధాని వ్యక్తిత్వంలోని మరొక భావోద్వేగ కోణాన్ని ఆవిష్కరించాయి. గతంలో కూడా ఆయన తన ప్రశాంతమైన ఉదయపు నడక సమయంలో వీటితో గడిపిన సందర్భాలను సోషల్ మీడి యాలో పంచుకున్నారు.

### అమెరికాలో వరుస కాల్పుల కలకలం

## నిందితుడు సహా ఆరుగురు దుర్మరణం


**వాషింగ్టన్, ఆగస్టు 16:** అమెరికాలో వరుస కాల్పుల ఘటనలు కలకలం రేపాయి. కెంటకీ రాష్ట్రంలోని లెక్సింగ్టన్‌లో గల ఓ పార్కులో జరిగిన ఈ కాల్పుల్లో ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో 16 యేళ్ల బాలుడు సహా నలుగురు పెద్దలు ఉ న్నారు. మరో 13యేళ్ల బాలికకు తీవ్ర గాయాల య్యాయి. తొలుత ఓ నివాసంలోకి ప్రవేశించిన దుండగుడు విచక్షణారహితంగా కాల్పులు జర పడంతో ముగ్గురు మృతి చెందారు. అనంతరం అక్కడి నుంచి పరారై మరో ఇంటికి వెళ్లి కాల్పులు జరపడంతో మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఆ తర్వాత సమీప అటవీ ప్రాంతంలో మరో మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు పాల్పడినట్లు అనుమానిస్తున్న చాడ్ హిక్‌మన్ (39) మృతదేహం కూడా అదే అటవీ ప్రాంతంలో లభ్యమైంది. దాంతో ఈ ఘటనలో నిందితుడి ప్రమేయంపై దర్యాపు కొనసాగు తోంది. డెట్రాయిట్‌కు సుమారు 170 మైళ్ల (270 కిలోమీటర్ల) దూరంలోని ఓ ఇంట్లో కాల్పులు జరిగినట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఇంట్లో తనిఖీలు చేపట్టిన అధికారులు 16 యేళ్ల బాలుడు, 45 యేళ్ల వ్యక్తి,



40 యేళ్ల మహిళ మృతదేహాలను గుర్తించారు. అదే ఇంట్లో 13 యేళ్ల బాలిక కూడా తుపాకీ గాయాలతో కనిపించింది. ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. కాల్పుల తర్వాత నిందితుడు అక్కడి నుంచి పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతడి కోసం మస్కాకీ కౌంటీలో భారీగా గాలింపు చేపట్టారు. నిందితుడి కోసం గాలింపు కొనసాగుతున్న సమయంలో మరో ఇంట్లో 53 యేళ్ల వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అతడు కూడా తుపాకీ గాయాలతో మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. దాంతో నిందితుడే ఈ హత్య కూడా చేసి పరారయ్యాడని భావించిన పోలీసులు, అతడి కోసం విస్తృతంగా గాలించారు. హిక్‌మన్ ఎలా మృతి చెందాడు? కాల్పులకు కారణమేంటి? అనే విషయాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వందేమాతరం గీతాన్ని అవమానించారంటూ సోనియాపై ఫిర్యాదు

**మంగుళూరు, ఆగస్టు 16:** వందేమాతరం గేయా న్ని అవమానించారంటూ కాంగ్రెస్ అగ్రనేత సో నియా గాంధీపై కేసు నమోదైంది. కర్ణాటకలోని మంగళూరుకు చెందిన బీజేపీ నాయకుడు వికాస్ పుట్టూర్ స్థానిక ఉర్వా పోలీస్ స్టేషన్‌లో



ఫిర్యాదు చేశాడు. శనివారం ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా వందేమాతరం గేయాన్ని సోనియా అవమానపరిచారని, ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొ న్నారు. వెంటనే ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరాడు. ఒకవేళ పోలీసులు లేదా రాష్ట్ర ప్రభుత్వం తగిన రీతిలో స్పందిం చకుంటే కర్ణాటక హైకోర్టును ఆశ్రయిస్తానని పేర్కొన్నాడు. వందేమాతరం గేయాన్ని కాంగ్రెస్ అవమానించి, చారిత్రకంగా తప్పు చేసిందని బీజేపీ నేత పుట్టూర్ అన్నారు. జాతీయ పతాకం ఎగరేసే సమయంలో వందేమాతరం ప్లే అవుతున్నప్పుడు సోనియా గాంధీ ఆటంక పరిచారని, గేయాన్ని అవమానించారని విమర్శించాడు. ఈ గేయాన్ని అవమానించిన వారి హోదాకు, స్థాయికి అతీతంగా చర్యలు తీసుకోవాలని తన ఫిర్యాదులో కోరినట్లు వివరించాడు. రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా ఈ కేసుపై విచారణ జరపాలని పోలీసుల్ని కోరాడు. ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించిన అంశాల్ని పోలీసులు పరిశీలిస్తున్నారు. సోనియా గాంధీకి వ్యతిరేకంగా ఇప్పటివరకు ఇంకా ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని తెలుస్తోంది. భారత న్యాయ వ్యవస్థపై తనకు నమ్మకం ఉందని, పుట్టూర్ స్పష్టం చేశాడు.

## బెంగాల్ అసెంబ్లీ మాజీ డి.స్పీకర్ అనుమానాస్పద మృతి

### టిఎంసి కార్యాలయంలో ఆయన మృతదేహాన్ని కనుగొన్న పోలీసులు



**కోల్‌కత్తా, ఆగస్టు 16:** పశ్చిమ బెంగాల్ రాజకీ యాల్లో తీవ్ర విషాదం, కలకలం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సీనియర్ నాయ కుడు, రాష్ట్ర అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ ఆశిష్ బెనర్జీ (80) అనుమానాస్పద స్థితిలో మర ణించారు. బీర్భూమ్ జిల్లా రాంపూర్‌హాట్‌లోని తన నివాసానికి సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఈ ఘటనతో అధికార టీఎంసీ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్ట్‌మార్టం నిమిత్తం రాంపూర్‌హాట్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. ఇది ఆత్మహత్యా లేక దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆశిష్ బెనర్జీకి బెంగాల్ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. రాంపూర్‌హాట్ నియోజకవర్గం నుంచి ఆయన ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. మమతా బెనర్జీ ప్రభుత్వంలో విద్య, వ్యవసాయ శాఖల మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అనం తరం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా కూడా సేవలు అందించారు. అయితే, ఈ ఏడాది మొదట్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన బీజేపీ అభ్యర్థి ధృవ సాహా చేతిలో ఓటమి పాలయ్యారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత, జూన్‌లో బీర్భూమ్ జిల్లా టీఎంసీ కోర్ కమిటీ ఛైర్మన్ పదవికి కూడా ఆశిష్ బెనర్జీ రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆయన రాజకీయంగా కొంత ఒత్తిడిలో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో టీఎంసీకి కంచుకోటగా ఉన్న బీర్భూమ్ జిల్లాలో ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా 6 స్థానాలు గెలుచుకోవడం టీఎంసీకి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. ఈ రాజకీయ పరిణామాలు కూడా జిల్లా నేతలపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ఆశిష్ బెనర్జీ మరణవార్త తెలియగానే ఆయన నివాసం వద్దకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి గల కచ్చితమైన కారణాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు.

## కోటి ఇస్తే అసోం సిఎంను హతమారుస్తానన్న నిందితుడి అరెస్టు

**గువాహతి, ఆగస్టు16:** తనకు కోటి రూపాయిలు ఇస్తే అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మను హత్య చేస్తానని అందుకు తన సెల్ నం బర్‌ను సంప్రదించాలంటూ ప్రకటన చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి తండ్రి, సోదరు డితోపాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేశామని అస్సాం పోలీసులు వెల్లడించారు. మోరిగావ్ జిల్లాలో శనివారం రాత్రి ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. సీఎం శర్మ హత్యకు సోషల్ మీడియాలో ప్రకటించిన సెల్ నంబర్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేపట్టినట్లు వారు వివరించారు. దీనిపై విచారణ చేపట్టగా ఆ నం బర్ అబ్దుల్ ముతాలేబ్ పేరు మీద ఉందని అన్నా రు. అతడు వృత్తిరీత్యా టైలర్‌గా జీవనంగా సాగిస్తున్నారని పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని గువాహతిలోని



ఖానాపారాలో శుక్రవారం సీఎం హిమంత బిశ్వ శర్మ రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మీడియాలో లైవ్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా అస్సాం సీఎంను తాను హత్య చేస్తానని ప్రకటించాడు. అందుకు కోటి రూపాయిలు ఇస్తే ఆ పని చేస్తానని వెల్లడించారు. అందుకు తన సెల్ నంబర్ సంప్రదించాలని సోషల్ మీడియాలో ప్రకటిం చాడు. అదే సమయంలో పాకిస్థాన్‌ను అనుకూ లంగా భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశాడు. దీంతో ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దాంతో భూరగావ్ పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో సెల్ నంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టి అబ్దుల్ ముతాలేబ్‌ను అరెస్ట్ చేశారు. అనం తరం అతడి తండ్రి, సోదరుడితోపాటు మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారందరిని పోలీసులు విచారిస్తున్నారు. ఈ ప్రకటన అబ్దుల్ ముతాలేబ్ ఒక్కరే చేశారా లేకుంటే దీని వెనుక ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. సోషల్ మీడియాలో వచ్చిన బెదిరింపు ఆరోపణలపై దర్యాప్తు కొనసా గుతోందని పోలీసులు చెప్పారు. ఆ కేసుకు సంబంధించి అందుబాటులో ఉన్న డిజిటల్ ఆధారాలను కూడా పరిశీలిస్తున్నట్లు పోలీస్ ఉన్నతాధికారులు వివరించారు.

## జార్ఖండ్ కూటమి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించండి

### రాహుల్ గాంధీకి నిరసనకారుల అల్టిమేటమ్

**రాంచి, ఆగస్టు 11:** జార్ఖండ్‌లో జేఎంఎం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు ఉపసంహరించాలని ఆ పార్టీ నేత రాహుల్ గాంధీని విద్యార్థి నిరసనకారులు డిమాండ్ చేశారు. ఆగస్ట్ 20న సీఎం హేమంత్ సోరెన్ నివాసాన్ని ముట్టడిస్తామని వారు స్పష్టం చేశారు. జార్ఖండ్‌లో నిర్వహించిన నియామక పరీక్షలలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న విద్యార్థులు గత 22 రోజులుగా నిరసనలు కొనసా గిస్తున్నారు. దేశ స్వాతంత్ర్య దినోత్సవం సం దర్భంగా రాంచిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. తమ డిమాండ్లపై స్పందించని సీఎం హేమంత్ సోరెన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్ట్ 20న ముఖ్యమంత్రి నివాసాన్ని మేం ముట్ట డిస్తాం. జేఎంఎం, కాంగ్రెస్ రెండూ మాతో రాజ కీయాలు చేస్తున్నందున ఆయన రాజీనామాను మేం కోరుతున్నాం. ఒకవేళ ముఖ్యమంత్రి మా మాట వినకపోతే, జేఎంఎం నేతృత్వంలోని కూటమికి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మద్దతు ఉపసంహరించుకోవాలని కూడా మేము




డిమాండ్ చేస్తున్నామని జేపీఎస్సీ జేఎస్ఎస్సీ రిఫార్మ్స్ మంచ్ నాయకుడు రవీంద్ర పాశ్వాన్ అన్నారు. 24 జిల్లాల్లోనూ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మలను దహనం చేస్తామని నిరస నకారులు తెలిపారు.

# సంక్షిప్త వార్తలు

## జార్ఖండ్‌లో ఆటోరిక్షా బైక్ ఢీ: ఆరుగురు మృతి

**రాంచీ, ఆగస్టు 16:** జార్ఖండ్ రాష్ట్రంలో ఘోరరోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. లతేహార్ జిల్లాలో ఓ కంటైనర్ ట్రక్కు అదుపు తప్పి ఆటో రిక్షా, బైక్‌ను ఢీకొట్టడంతో చిన్నారి సహా ఆరుగురు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల నప్రకారం వేగంగా వచ్చిన ట్రక్కు ఆటో, బైక్‌ను ఢీకొట్టడం తో చంద్వాపోలీస్ స్టేషన్ పరిధిలోని దేద్ తంగవాలోయలో పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ రగిబ్‌ఖాన్ (35),అఫసారి ఖాటూన్(40), ఆమె కుమారుడు అస్జాద్ (7)ఉన్నారని, మరో ముగ్గరి వివరాలు తెలియాల్సి ఉందని చంద్వా పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ మనోరంజన్ ప్రసాద్ తెలిపారు.

## బర్త్‌డేకేక్‌లో చచ్చిన బల్లి: 11 మందికి అస్వస్థత




**ముంబై, ఆగస్టు16:** బర్త్‌డే కేక్‌లో చచ్చిన బల్లి కనిపించింది. ఆ కేక్ తిన్న 11మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు దీనిపై దర్యాప్తు చేపట్టారు.మహారాష్ట్రలోని నలసోపారాలో ఈసంఘటనజరిగింది. ఒకరి పుట్టిన రోజు వేడుక పలువురిని ఆసుపత్రి పాలు చేసింది.బర్త్‌డే కేక్‌లో చచ్చిన బల్లి కనిపించింది.అది తిన్నతర్వాత 11మంది ఫుడ్‌పాయిజ నింగ్‌కు గురయ్యారు.ఏడుగురుపిల్లలు,నలుగురు మహిళలు కడుపు,ఛాతిలో నొప్పితో బాధపడ్డారు.

## ప్రధాని మోడీపై అనురాగ్ కశ్యప్ సెటైర్లు




**ముంబయి, ఆగస్టు 16:**స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్ర కోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీచేసిన దిమాగీ నక్సల్ (మేధో నక్సల్) వ్యాఖ్యలపై ప్రముఖ సినీ దర్శకుడు అనురాగ్ కశ్యప్ తీవ్రంగా స్పందించారు. యువతపై రాజకీయ ముద్రలు వేయడం కన్నా,వారికి విద్యా బుద్ధులు నేర్పడం, విమర్శనాత్మక ఆలోచనల ను ప్రోత్సహించడం, అవసరమైతే థెరపీ ద్వారా వారిని అర్థం చేసుకోవడం ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడి యాలో పెద్ద చర్చకు దారితీశాయి. సోషల్ మీడియా వేదికగా ప్రధాని వ్యాఖ్యలపై అనురాగ్ కశ్యప్ స్పందిస్తూ, నేటి రాజకీయ భాష యువతరం ఆందోళనలను, వారి ఆలోచనా విధానాన్ని ప్రతిబింబిస్తోందా అని ప్రశ్నించారు.

## మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది ఇంటిపై జాతీయ జెండా



**శ్రీనగర్, ఆగస్టు 16:** జమ్మూ కశ్మీర్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఓఆసక్తికరమైన దృశ్యం అందరి దృష్టిని ఆక ర్షించింది. భద్రతాదళాల మోస్ట్‌వాంటెడ్ లిస్ట్‌లో ఉన్న లష్కరే తోయి బా టాప్‌కమాండర్ అబిద్ రంజాన్ షేక్ తల్లిదండ్రులు తమ ఇం టిపై మువ్వన్నెలజెండాను ఎగరేసి దేశభక్తిని చాటుకున్నారు. షోపి యాన్‌లోనివారి నివాసంపై తల్లి,తండ్రి ఇద్దరూ కలిసి త్రివర్ణ పతా కాన్ని ఆవిష్కరించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) నుంచి కార్య కలాపాలు సాగిస్తున్న అబిద్ రంజాన్ షేక్, లోయలో జరిగిన అనేక ఉగ్రవాద దాడుల్లో కీలక సూత్రధారిగా ఉన్నాడు.

## భార్యను హత్యచేసిన బిఎస్‌ఎఫ్ జవాన్



**చండీగఢ్, ఆగస్టు 16:** బోర్డర్ సెక్యూరిటీఫోర్స్ (బీఎస్ఎఫ్)జవాన్‌గా పని చేస్తున్న అమర్‌జిత్ సింగ్ సెలవుపై ఇంటికి వచ్చి భార్య రమాతో గొడవ నేపథ్యంలో ఆమెను కొట్టడంతో మరణించింది. అయితే టెర్రస్ పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడినట్లు భార్య కుటుంబ సభ్యులకు సమా చారమిచ్చాడు. ఆమహిళ శరీరంపై పలు గాయాలు ఉండటంతో అను మానించిన ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంజాబ్‌లోని హోషియార్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది.

## ఎయిర్‌పోర్టులో ప్యాసింజర్‌వద్ద గన్‌పేలి ఇద్దరికి గాయాలు

**వారణాసి, ఆగస్టు 16:** వారణాసి ఎయిర్‌పోర్టులో ఒక ప్యాసింజర్ గన్ తీసుకెళ్తుండగా, అధికారులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఉన్నట్లుండి గన్‌పేలిపోయింది. ఈఘటనలో ఇద్దరికి గాయాల య్యాయి. వారణాసిలోని లాల్‌బహదూర్ శాస్త్రిఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఆదివారం ఉదయం 9.30గం టలకు ఈఘటన జరిగింది.అజాంగడ్‌కు చెందిన కమ్లేష్ రాయ్ అనే ప్రయాణికుడు తనభార్యతో కలిసి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఐఎక్స్1810 అనే విమానంలో ముంబై వెళ్లేందుకు ఎయిర్పోర్టుకు వచ్చాడు.



ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా చిత్రపటం వద్ద నివాళులర్పించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తదితరులు

# నైతిక విలువలకు కట్టుబడిన మహోన్నతుడు వాజ్‌పేయి

## వర్ధంతి కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 16:** మాజీ ప్రధాని, భారతరత్న, స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు ర్నాచందర్‌రావు మాట్లాడుతూ వాజ్‌పేయి దేశానికి అందించిన విశిష్ట సేవలను, వారి ఆదర్శవంతమైన జీవన ప్రస్థానాన్ని స్మరించుకున్నారు. వాజ్‌పేయి దాదాపు ఆరేళ్లకు పైగా ప్రధానిగా దేశాన్ని సమర్థవంతంగా నడిపించారని చెప్పారు, వారి హయాంలో చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణం, టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు, సామాన్యులకు సైతం గ్యాస్ కనెక్షన్లు సులభంగా అందేలా చేయడం వంటి సంస్కరణలు దేశాభివృద్ధికి బలమైన పునాది వేశాయన్నారు. భారత రాజకీయ చరిత్రలో వాజ్‌పేయి పరిపాలనా కాలాన్ని ఒక స్వర్ణయుగంగా పరిగణిస్తారని పేర్కొన్నారు. అలాగే, వాజ్‌పేయి పాటించిన విలువలతో కూడిన రాజకీయాలను ప్రస్తావిస్తూ, 'పార్లమెంటులో కేవలం ఒక్క ఓటు తేడాతో ప్రభుత్వం పడిపోయే పరిస్థితి ఉన్నప్పటికీ, నైతిక విలువలకు కట్టుబడి రాజీపడకుండా నిలిచిన మహోన్నత నాయకుడు. అధికారం కంటే ప్రజాస్వామ్య విలువలకే వాజ్‌పేయి అగ్రతాంబూలం ఇచ్చారని చెప్పారు. నేటి తరం రాజకీయ నాయకులు, యువత ఆ ఉన్నతమైన విలువల నుంచి స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. నేటి యువతరం వారి జీవిత చరిత్రను అధ్యయనం చేసి, వారి చూపిన మార్గంలో నడవడమే వారికిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

## మాజీ సిఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి జయంతి సందర్భంగా గాంధీభవన్‌లో నివాళులు

**హైదరాబాద్, ఆగస్టు 16,ప్రభాతవార్త:**మాజీ ముఖ్యమంత్రి, అధ్యక్షులు కోట్ల విజయ భాస్కర్ రెడ్డిజయంతి సందర్భంగానాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి ఆదివారం గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. ప్రజాసేవకు అంకితమై, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేసిన కోట్ల విజయ భాస్కర్ రెడ్డి సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా ఆయన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి,రాజకీయాల్లో గొప్ప సంచలనం పరిణామాల ఆవిష్కరణకు ఆయన బాటలు వేశారని ఆయన ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని ఎంపి డాక్టర్ మల్లు రవి అన్నారు.



### మందకృష్ణ మాదిగకు మల్లు రవి ఘన సన్మానం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎంతోమంది పిల్ల లకు ప్రాణదానం చేసిన సామా జికవేత్తగా కృష్ణను ప్రశంసించారు. ఆయన సమాజ సేవలో మరింతగా ముందుకు సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ పార్టీ పోలింగ్ బూత్ నుంచి సంస్థాగతంగా బలోపేతం కావాలి

## పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

**హైదరాబాద్, ఆగస్టు16, ప్రభాతవార్త:** గ్రామం, పోలింగ్ బూత్ నుంచి పార్టీ సంస్థాగతంగా బలోపేతంగా ఉండాలని క్రియాశీలక కార్యకర్తలకు అత్యంత ప్రాధన్యత ఇస్తూ పార్టీ నిర్మాణం జరగాలని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నట రాజన్ అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో హైదరాబాద్ డిసిసి పిఎసి సమావేశాలు మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగింది. హైదరాబాద్ డిసిసి సంబంధించిన కీలక అంశాలపై సమావేశంలో ప్పార్టీ కార్యక్రమాలు, సంస్థాగత వ్యవహారాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బూత్ పటిష్టంగా ఉంటే పార్టీ కచ్చితంగా గెలుస్తుందనీ వివరించారు. కాంగ్రెస్ ను అన్ని ప్రాంతాల్లో గెలిపించుకోవడమే మన బాధ్యత అని అన్నారు. రంగారెడ్డి ఇన్‌చార్జి కర్ణాటక మాజీ ఎమ్మెల్సీ పివి మోహన్ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర, న్యాయ యాత్రలో చాలా తెలుసుకున్నారనీ అన్నారు. సంఘ్టన్ సృజన్ అభియాన్ అనేది భారత జాతీయ కాంగ్రెస్ చేపట్టిన ఒక దేశవ్యాప్త సంస్థాగత పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టారని వివరించారు. క్షేత్రస్థాయి నుండి, అంటే బూత్ స్థాయి నుండి జిల్లా కాంగ్రెస్ కమిటీ వరకు పార్టీను బలోపేతం చేయడం జరుగాలని కోరారు.. సమర్థ లైన, నిబద్ధత కలిగిన డిసిసి అధ్యక్షులను గుర్తించి, నియమించడంతో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందనీ తెలిపారు. ఆ తర్వాత డిసిసి, బ్లాక్, మండల, గ్రామ/వార్డు బూత్ స్థాయి సంస్థలను పునర్నిర్మించి, బలోపేతం చేయడం జరుగుతుందనీ వివరించారు.కేవలం కార్యవర్గాలను మార్చడం మాత్రమే దీని లక్ష్యం కాదు, క్రియాశీలకమైన, జవాబుదారీతనం గల, వికేంద్రీకృత, క్షేత్రస్థాయి ఆధారిత సంస్థను సృష్టించడం దీని ముఖ్య ఉద్దేశం.దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు 1,054 సంస్థాగత జిల్లాలు ఉన్నాయి 24 జూలై 2026 నాటికి, 762 జిల్లాలలో డిసిసి అధ్యక్షులను ప్రకటించడం జరిగిందనీ తెలిపారు.ఇది ఒక ముఖ్యమైన మైలురాయి, కానీ అభియాన్ పూర్తి అయినట్లు కాదని అన్నానరు. సంస్థాగత పునర్వ్యవస్థీకరణ బూత్ స్థాయి వరకు వరుస దశలలో కొనసాగుతుందనీ వివరించారు.




### 'సర్'పై శిక్షణా కార్యక్రమం

గాంధీభవన్‌లో 'సర్' 2పై శిక్షణ కార్యక్రమం జరిగింది. హైదరాబాద్‌లోని గాంధీభవన్, ఇందిరా భవన్‌లో ఎస్ఐఆర్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. 'సర్' ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలు, సమన్వయం, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై కోఆర్డినేటర్లకు శిక్షణ అందించారు.

# ఆటోరిక్షా ఎలక్ట్రిక్ మార్పిడి పథకం-2026

## పెట్రోల్, డీజిల్ ఆటోలు ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్పు

## రూ.1.50 లక్షల వరకు ఆర్థికసాయం

## రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో అర్హత కలిగిన ప్రతి ఆటో యజమానికి సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా రూ.1.50 లక్షల వరకు సబ్సిడీ అందిస్తామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ మార్పిడి పథకం-2026 కింద పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చనున్నట్లు తెలిపారు. యజమానులకు రెండు అవకాశాలు ఉంటాయన్నారు. హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛమైన, సుస్థిరమైన, పర్యావరణహిత ప్రజా రవాణా నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047కు అనుగుణంగా 'తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ మార్పిడి పథకం-2026 రూపకల్పనకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.

కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్) ప్రాంతంలో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్‌తో నడుస్తున్న ఆటో రిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చడం లేదంటే కొత్త ఎలక్ట్రిక్ ఆటో రిక్షాలతో భర్తీ చేయడం ద్వారా పట్టణ ప్రజా రవాణాను నెట్‌జీరో కార్బన్ ఉద్గారాల దిశగా తీసుకెళ్లడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్ వాహనాల వినియోగం కారణంగా వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం పెరగడంతో పాటు ఇంధన ధరల పెరుగుదల ఆటో డ్రైవర్లపై ఆర్థిక భారాన్ని పెంచుతోందని ఈ సమస్యలకు పరిష్కారంగా క్యూర్ ప్రాంతంలోని అర్హత కలిగిన 18,766 ఆటోలు పథకం పరిధిలోకి వస్తాయన్నారు. రవాణా శాఖ అధికారిక డేటాబేస్ ప్రకారం క్యూర్ ప్రాంతంలో చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్‌తో క్రియాశీలంగా డీజిల్ ఆటోలు 11,254 ఉన్నాయని, పెట్రోల్ ఆటోలు 7,512 ఉన్నాయన్నారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి తన అవసరానికి అనుగుణంగా రెండు మార్గాల్లో ఒకదాన్ని ఎంచుకునే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. అందులో ప్రస్తుత ఆటో రిక్షా ఛాసిస్‌ను కొనసాగించాలనుకునే లబ్ధిదారులు ఏఐఎస్-123 ఆమోదించిన ఎలక్ట్రిక్ కిట్ ద్వారా తమ వాహనాన్ని ఎలక్ట్రిక్‌గా మార్చుకోవచ్చని ఈ విధానంలో కిట్ ఖర్చు, ఇన్‌స్టాలేషన్ ప్రామాణిక ఫిట్‌మెంట్ ఉపకరణాల ఖర్చుతో కలిపి రూ.1.50 లక్షల వరకు లేదంటే వాస్తవ వ్యయం రెండింటిలో ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్థిక సహాయంగా అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

ఈ పథకం అమలుకు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల నుంచి రూ.50 కోట్ల చొప్పున మొత్తం రూ.200 కోట్లు సమకూర్చే విధంగా ప్రతిపాదన రూపొందించారు.

# జనాభా లెక్కల్లో ఒబిసి/ఎస్ఇబిసిల గణనకు ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలి

## ప్రధాని మోడీకి మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** 2027 జనాభా లెక్కల్లో ఇతర వెనుకబడిన తరగతులు (ఓబీసీ), సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులు (ఎస్ఈబీసీ) జనాభాను శాస్త్రీయంగా, పారదర్శకంగా నమోదు చేసేలా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కోరారు. ఈ మేరకు ఆదివారం ప్రధానమంత్రికి లేఖ రాశారు. ప్రధానికి రాసిన లేఖలో ఓబీసీ/ఎస్ఈబీసీ వర్గాల కులగణనకు సంబంధించి పలు సూచనలు చేశారు. వెనుకబడిన వర్గాల వాస్తవ జనాభా, సామాజిక ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన విశ్వసనీయమైన సమాచారం అందుబాటులో ఉంటేనే రిజర్వేషన్లు, విద్య, ఉపాధి, సంక్షేమం, సమాన ప్రాతినిధ్యం వంటి విధానాలను సమర్థవంతంగా అమలు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక కేటగిరీలు ఉన్నట్లుగానే జనాభా లెక్కల ప్రశ్నావళిలో ఓబీసీ/ఎస్ఈబీసీలకు కూడా స్పష్టమైన ప్రత్యేక కేటగిరీని ఏర్పాటు చేయాలని మంత్రి కోరారు. కేవలం వ్యక్తులు తమ కులం పేరును నమోదు చేయడం ద్వారా ఓబీసీ/ఎస్ఈబీసీ గుర్తింపు అనంతరం అధికారిక వర్గీకరణపై ఆధారపడే పరిస్థితి రాకుండా ముందుగానే స్పష్టమైన విధానం రూపొందించాలని సూచించారు. 2011 సామాజిక ఆర్థిక, కుల గణనలో కులాల పేర్లను ఓపెన్-ఎండెడ్ విధానంలో నమోదు చేయడం వల్ల స్పెల్లింగ్, స్థానిక పేర్లు, పర్యాయపదాలు, ఉపకులాలు, ఉచ్చారణలోని తేడాలతో అనేక రకాల కులపేర్లు నమోదైన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. 2027 జనాభా లెక్కల్లో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ప్రమాణీకృత విధానాన్ని అవలంబించాలని ప్రధానికి రాసిన లేఖలో మంత్రి పొన్నం కోరారు. తెలంగాణలో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే(ఎస్ఈఈపీసీ) 2024-25 ద్వారా ఇంటింటి స్థాయిలో నిర్మిత డేటా సేకరణ, కుల సమాచారాన్ని పద్ధతిగా నమోదు చేయడం, వెనుకబడిన వర్గాల వర్గీకరణలో అనుభవం లభించిందని మంత్రి పేర్కొన్నారు. ఈ అనుభవాలను జాతీయ స్థాయిలో 2027 జనాభా లెక్కల రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రాష్ట్రాల వారీగా సమగ్ర మాస్టర్ కుల డైరెక్టరీ రూపొందించాలి, కులాలు, సముదాయాలకు ప్రత్యేక డిజిటల్ కోడ్లు కేటాయించాలని, జాబితాలో లేని, వివాదాస్పదమైన, స్థానికంగా గుర్తింపు పొందిన కులపేర్లను ప్రత్యేకంగా నమోదు చేసి ధృవీకరించే విధానం ఏర్పాటు చేయాలన్నారు.

వ్యక్తి స్వయంగా ప్రకటించిన కులం, దానికి సంబంధించిన అధికారిక వర్గీకరణ రెండింటినీ డేటాలో భద్రపరచాలని, కేవలం కులపేర్లను సేకరించకుండా, రిజర్వేషన్లు, ప్రాతినిధ్యం, విద్య, ఉపాధి, సంక్షేమం, సామాజికఆర్థిక అభివృద్ధికి ఉపయోగపడే విశ్వసనీయమైన ఓబీసీ/ఎస్ఈబీసీ డేటాసెట్ రూపొందించాలన్నారు. దేశంలో సామాజిక న్యాయం, సమాన ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు, విద్యా అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, లక్ష్యిత సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు విశ్వసనీయమైన కులవారీ జనాభా సమాచారం ఎంతో అవసరమని మంత్రి పేర్కొన్నారు. జనాభా లెక్కల దశలోనే విధానపరమైన స్పష్టత లేకపోతే, భవిష్యత్తులో ఆ డేటా వినియోగం కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉందన్నారు. కాబట్టి 2027 జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభమయ్యే ముందే ఓబీసీ/ఎస్ఈబీసీల గణనకు సంబంధించి అవసరమైన పద్ధతులు, సాంకేతిక ప్రమాణాలు, డేటా రక్షణ చర్యలను అమలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రధానమంత్రికి రాసిన లేఖలో కోరారు.



చిక్కడపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాఆవిష్కరణ పోస్టర్‌ను ఆవిష్క రిస్తున్న బాలరాజ్ గౌడ్, అయిలి వెంకన్నగౌడ్ తదితరులు

## సర్దార్ పాపన్న విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి : బాలరాజ్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు16, ప్రభాతవార్త:** సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 376వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 18న ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు రాష్ట్ర గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ తెలిపారు. ఆదివారం చిక్కడపల్లిలోని కార్యాలయంలో విగ్రహ ఆవిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 18న సాయంత్రం 4 గంటలకు ట్యాంక్‌బండ్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొంటారని చెప్పారు. అదేరోజు ఉదయం 9 గంటలకు చిక్కడపల్లిలోని కల్లు కంపౌండ్ వద్ద పాపన్నగౌడ్ 376వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## 19న గాంధీభవన్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రజలతో ముఖాముఖి

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** ప్రజాసమస్యల పరిష్కారానికి 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమంలో పాల్గొనడానికి ఈ నెల 19న షెడ్యూల్ కులాలు అభివృద్ధి, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గాంధీభవన్‌కు వచ్చి ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంటవరకు విన్నపాలు ప్రజల నుంచి స్వీకరిస్తారు. ఏదైనా అప్పటికప్పుడు పరిష్కరించే వాటిని ఫోన్‌లో ఆయా అధికారులకు చెప్పి వాటి పరిష్కారం చేయిస్తారు. మొత్తం ఎన్ని విన్నపాలు వచ్చాయో వాటి సంఖ్యను వివరించి వాటిని ఆయా శాఖలకు పంపుతారు. గాంధీభవన్‌లోని ఇందిరాభవన్‌లో ఈ కార్యక్రమం ఉంటుంది.

# పాలిటెక్నిక్ కాలేజీలను స్కిల్స్ వర్సిటీకి అనుసంధానం చేయొద్దు

## కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం..

## ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ది యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ప్రభుత్వ సాంకేతిక విద్యను ప్రైవేటీకరించే ప్రయత్నం చేయొద్దని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ డిమాండ్ చేసింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ఐటీఐ, ఏటిసిలతో కలిసి డిప్లొమా కోర్సులను అనుసంధానం చేసే విధంగా ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 97ను వెంటనే వెనక్కి తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ డిమాండ్ చేశారు. స్కిల్ యూనివర్సిటీ పేరిట కొత్త పాలసీ తీసుకువచ్చి ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే కుట్ర సరికాదని, తద్వారా పాలిటెక్నిక్ విద్యావ్యవస్థ పూర్తిగా అధ్యాపకుల నియామకాల నుంచి మొదలుకొని అడ్మిషన్ల వరకు కూడా మొత్తం ప్రైవేట్ కార్పొరేట్ శక్తుల్లోకి వెళుతుందని ఇది నూతన జాతీయ విద్యా విధానం అమలులో భాగమేనన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం 2020 తీసుకొస్తే దానిని దక్షిణాది రాష్ట్రాలు పూర్తిగా వ్యతిరేకించి కేంద్రంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తెలంగాణలో జాతీయ విద్యా విధానం అమలు చేసే కుట్ర చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దశాబ్దాలుగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, దానికి సమాంతరంగా పీపీపీ విధానాన్ని తీసుకురావడం ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో తక్కువ ఫీజుతో విద్యను అందిస్తున్నప్పుడు వాటికి అవసరమైన నిధులు, ల్యాబ్‌లు, సిబ్బంది కల్పించకుండా కొత్తగా ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వాయం (పీపీపీ) వ్యవస్థను ఎందుకు ప్రోత్సహిస్తున్నారనీ, స్కిల్ యూనివర్సిటీ కౌన్సిల్‌లో ఏడుగురు పారిశ్రామిక వేత్తలు ఉన్నారని వారే ప్రభుత్వ విద్యను అందులో పాలిటెక్నిక్ విద్యను వ్యాపారమాయం చేసే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు

### శక్తి డిపార్ట్‌మెంట్‌లో విలీనం చేయొద్దు : టిపిజెఏసి తీర్మానం

రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీలను శక్తి డిపార్ట్‌మెంట్‌లో కలపడాన్ని తెలంగాణ పాలిటెక్నిక్ జేఏసీ (టిపి జేఏసీ) తీవ్రంగా ఖండించింది. ఆదివారం పాలి టెక్నిక్ డిపార్టుమెంటులో ఉన్న టీచింగ్‌నాన్ టీచింగ్‌కు సంబంధించిన 16 సంఘాలు మాసబ్ ట్యాంక్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సమావేశమై అన్ని సంఘాలు కలిసి ఒక జేఏసీగా ఏర్పాటు చేసుకున్నారు.

జేఏసీ మీటింగ్‌లో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్‌ను శక్తి డిపార్ట్‌మెంట్‌లో విలీనం చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నంబర్97ను తీవ్రంగా వ్యతి రేకిస్తున్నట్టు జేఏసీ ఛైర్మన్ నాగ రాజు తెలిపారు.

స్కిల్ హ్యూమన్ క్యాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రెయినింగ్ ఇన్‌షియేటివ్స్ (శక్తి) అనే డిపార్ట్మెంట్ కింద యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి దాని కింద ఎస్‌బిటెట్ నిధులు వెళ్లడాన్ని జీర్ణిం చుకోలేమన్నారు. పిపిపి మోడ్‌లో నడిచే వ్యవస్థ కింద.. ప్రస్తుతం పూర్తి స్థాయిలో అత్యంత ఉన్నత స్థితిలో కొనసాగుతున్న వ్యవస్థ, విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత చదువులకు ఆస్కారం లేని యూనివర్సిటీ కిందికి పని చేయడానికి ససేమిరా అంటున్నారని తెలిపారు. పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థులు సైతం సమావేశంలో పాల్గొని ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేసినట్టు జేఏసీ నేతలు తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం ప్రభుత్వం భాగస్వామ్య ఉద్యోగ సంఘాలకు గానీ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఏ ఒక్క ఆఫీసర్‌కి తెలియకుండా విలీన ప్రతిపాదనను పెట్టి కేబినెట్‌లో ఆమోదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకి స్తున్నామన్నారు. ఇదే అంశంపై ఉద్యమ కార్యాచరణకు సిద్ధంకానున్నట్టు తెలుస్తోంది.

ఆది వారం జరిగిన సంఘాల సమావేశంలో టిపిజేఏసీ ఛైర్మన్‌గా నాగరాజు, కన్వీనర్‌గా సురేష్, సెక్రటరీ జనరల్‌గా శ్రవణ్ కుమార్ శ్రీరామ్, కో ఛైర్మన్స్‌గా సౌజన్య, సునీత, సలహాదారులుగా ఆనంద్, రమణ ప్రసాద్, రాజా, కృష్ణ, డాక్టర్ చంద్రశేఖర్ ఎన్నికైనట్టు తెలిపారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య

## గురుకుల ఉపాధ్యాయులకు రూ.36 వేల జీతం చెల్లించాలి : ఎంపి ఆర్.కృష్ణయ్య


**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త :** సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న గెస్ట్, కాంట్రాక్టు ఉపాధ్యాయుల జీతాలను ఇతర శాఖల మాదిరిగానే నెలకు రూ.36 వేలకు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం బీసీ భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర పార్ట్‌టైం కాంట్రాక్ట్ టీచర్ల సంఘం సమావేశంలో ఆయన ప్రసంగించారు. 15 యేళ్లుగా అరకొర వేతనాలతో పనిచేస్తున్న ఉపాధ్యాయులు 24 గంటలు పాఠశాలల్లోనే ఉంటూ విద్యార్థుల భవిష్యత్తు కోసం కష్టపడుతున్నారని గుర్తుచేశారు. డే అండ్ నైట్ స్టడీస్, మెస్ డ్యూటీ, హౌస్ మాస్టర్ బాధ్యతలతో పాటు ఇతర అదనపు పనులు చేస్తున్నా శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని గురుకులాల్లో ఒకే విధమైన విధివిధానాలు, మెనూ అమలు అవుతున్నప్పుడు జీతాలలో వ్యత్యాసం ఉండటం సరికాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల ఉపాధ్యాయులకు కూడా రూ.36 వేల వేతనం చెల్లించడంతో పాటు వెంటనే మినిమమ్ టైమ్ స్కేల్ (లీగిలీ) అమలు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ఘట్‌కేసర్ ఆలయంలో నేడు రథోత్సవం

## భక్తుల కొంగుబంగారం

## ఉత్తర శ్రీవిల్లిపుత్తూరుగా ప్రసిద్ధి

**ఘట్‌కేసర్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత మన్నారు రంగనాయకస్వామి ఆలయంలో నాగులపంచవమి సందర్భంగా సోమవారం సాయంత్రం గోదా రంగనాయకస్వామి విమాన రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ ధర్మకర్తలు సన్నాహాలు చేస్తున్నారు. వారం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి కళ్యాణం నిర్వహించగా సోమవారం రథోత్సవం జరుగనుంది. రథాన్ని వివిధ రకాల పూలు, విద్యుత్‌దీపాలతో అలంకరించి ఉత్సవ మూర్తులను భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఘనంగా ఊరేగిస్తారు. శ్రీగోదా మన్నారు రంగనాయక స్వామి ఆలయాన్ని సుమారు 600 సంవత్సరాల క్రితం ఎదులాబాద్‌లో అప్పలాచార్య అప్పన్న అయ్యంగార్ నిర్మించారు. ఎంతో ఘన చరిత్ర కల్గిన ఆలయం దేవాదాయశాఖ ఆధీనంలో లేకపోవడంతో తిరువడందం పోరెత్తి వంశపారంపర్య ధర్మకర్తలు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. మొఘలులు భారతదేశంపై దండెత్తక ముందే ఇది నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. ఇక్కడి ప్రధాన దైవం శ్రీగోధా రంగనాయక స్వామి అయినప్పటికీ, వాస్తవానికి గోధాదేవి అలియాస్ కోధై అమ్మవారికే ఇక్కడ ఎక్కువ ప్రాధాన్యత ఉంది. భారతదేశం మొత్తం మీద ఆండాళ్ అమ్మవారికి కేవలం రెండు ఆలయాలు మాత్రమే ఉండగా వాటిలో ఒకటి తమిళనాడులోని శ్రీవిల్లి పుత్తూరు కాగా ఈఆలయం రెండవది, అందుకే దీనిని ఉత్తర శ్రీవిల్లిపుత్తూరు అని పిలుస్తారు. 15వ, 16వ శతాబ్దాల మొఘల్ కాలంలో ఎదులాబాద్‌ను రాయపురం అని పిలిచేవారు. ఈఆలయానికి సమీపంలోనే 400 ఎకరాల విస్తీర్ణం కల్గిన లక్ష్మీనారాయణ చెరువు ఉంది. ఈఆలయం చారిత్రాత్మకంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన, భారతదేశంలోనే అత్యంత అరుదైన దేవాలయాలలో ఒకటి. రాష్ట్రంలోనూ దేశవ్యాప్తంగానూ అనేక దేవాలయాలు ఉన్నప్పటికీ వాటిలో ముఖ్యమైనవి మూడు మాత్రమే. అందులో ఒకటి తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూర్, మిగిలిన రెండు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయి. ఇక్కడికి వచ్చి గోదాదేవి అమ్మవారికి పూజలు, గాజులు సమర్పించే అవివాహిత యువతులకు వివాహం జరుగుతుందని ప్రగాఢ నమ్మకం. శ్రీవిల్లిపుత్తూరులో శ్రీగోధాదేవిని కోదై అని, ఇక్కడ గాజులమ్మగా కూడా పిలుస్తారు.



ఏదులాబాద్‌లోని గోదారంగమన్నారునాయకస్వామి ఆలయం ఇన్‌సెట్ ముస్తాబైన స్వామి రథం




## యుజిసినెట్ జూన్ 2026 పరీక్షల్లో మూడు సబ్జెక్టులకు రీటెస్ట్

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** యూజీసీనెట్ జూన్ 2026 పరీక్షల్లో ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్టీఏ పూర్తి స్థాయిలో మళ్లీ పరీక్ష నిర్వహించనున్నది. పరీక్ష పత్రాల్లో భారీగా వాస్తవ, టైపోగ్రాఫికల్, అనువాదపరమైన తప్పులు ఉన్నట్లు ఎన్టీఏ ఏర్పాటు చేసిన దర్యాప్తు కమిటీ నిర్ధారించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మూడు ప్రశ్నపత్రాల్లో గతంలో అడిగిన ప్రశ్నలు గణనీయంగా పునరావృతం కావడంతో పాటు అనేక తప్పులు ఉన్నట్లు కమిటీ గుర్తించింది. ఈ లోపాలు చాలా తీవ్రమైనవని, తప్పుగా ఉన్న ప్రశ్నలను ఆన్సర్ కీ నుంచి తొలగించడం ద్వారా మాత్రమే సమస్యను పరిష్కరించడం సాధ్యం కాదని కమిటీ తేల్చింది. జూన్ 22 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా 87 సబ్జెక్టుల్లో యూజీసీనెట్ జూన్ 2026 పరీక్షను నిర్వహించారు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఈ పరీక్ష నిర్వహించారు. పరీక్షలకు హాజరైన పలువురు అభ్యర్థులు ఇంగ్లిష్, కామర్స్ ప్రశ్నపత్రాల్లో గత సంవత్సరాల ప్రశ్నలు భారీగా పునరావృతమయ్యాయని, సోషియాలజీ పేపర్‌లో అనేక స్పెల్లింగ్ తప్పులు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఈ ఫిర్యాదులపై దర్యాప్తు చేస్తున్నామని ఎన్టీఏ వర్గాలు తెలిపినప్పటికీ, ఇలాంటి తప్పులు 'అసాధారణమైనవి కావని పేర్కొన్నాయి. ఆ తరువాత ఏర్పాటు చేసిన కమిటీ విచారణలో మూడు ప్రశ్నపత్రాల్లో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు తేలింది. పండితుల పేర్లలో స్పెల్లింగ్ తప్పులు, పుస్తకాల పేర్లు తప్పుగా ముద్రించడం, ప్రశ్నలను తప్పుగా రూపొందించడం, వ్యాకరణం, విరామ చిహ్నాల్లో పొరపాట్లు, ఇప్పటికే ప్రామాణ్యంలో ఉన్న భావాలకు ప్రామాణికం కాని పదాలను ఉపయోగించడం వంటి లోపాలను కమిటీ గుర్తించింది. వీటితో పాటు గతంలో ఉపయోగించిన ప్రశ్నలు తిరిగి చేర్చినట్లు నిర్ధారించింది. సెప్టెంబర్ 9, 10 తేదీల్లో రీటెస్ట్ ఇంగ్లిష్ సబ్జెక్టుకు సెప్టెంబర్ 9న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కామర్స్‌కు అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రీ టెస్ట్ నిర్వహిస్తారు. సోషియాలజీ పరీక్షను సెప్టెంబర్ 10న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. రీ టెస్ట్‌కు హాజరయ్యే అభ్యర్థుల నుంచి ఎలాంటి అదనపు పరీక్ష ఫీజు వసూలు చేయబోమని యుజిసి స్పష్టం చేసింది.

## వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాల్లో పాల్గొన్న గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు16:** చందానగర్‌లోని విశాఖ శారదా పీఠపాలిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలకు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్‌శుక్లా ఆదివారం సాయంత్రం హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారిని, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామివారిని గవర్నర్ శివప్రతాప్‌శుక్లా మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతుల ఆశీస్సులు అందుకున్నారు.

## శ్రీశైలం రిజర్వాయర్ నీటి వినియోగమే ప్రధాన లక్ష్యం

### నేడు కెఆర్ఎంబి త్రిసభ్య కమిటీ సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటి వినియోగమే లక్ష్యంగా కెఆర్ఎంబి త్రిమెన్ కమిటీ సమావేశం సోమవారం నిర్వహిస్తున్నారు. కెఆర్ఎంబి బోర్డు సమావేశం నిర్వహించకుండా ఆంధ్రప్రదేశ్ కోరిన విధంగా నేరుగా త్రిమెన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయడంపై తెలంగాణ నీటిపారుదలశాఖను నిస్సహాయ స్థితిలోకి నెట్టివేసింది. కెఆర్ఎంబి చైర్మన్, మెంబర్ సెక్రెటరీ, టెక్నికల్ మెంబర్లు, ఇరు రాష్ట్రాల సెక్రెటరీలు సభ్యులుగా బోర్డు సమావేశం ముందుగా జరుగాల్సి ఉంటుంది. ఇరు రాష్ట్రాల మధ్య జలాల వినియోగం, వివాదాల అంశాలపై బోర్డులోనే చర్చిస్తారు. వాటాలను ఖరారు చేయాల్సి ఉంటుంది. ఏకాభిప్రాయం కుదరని అంశాలను కేంద్రానికి నివేదిస్తారు. అధికారిక గుర్తింపు ఉంటుంది. ప్రతి నీటి సంవత్సరం జూన్1 నుంచి మే31 వరకు నీటి వినియోగ వాటాలపై బోర్డులోనే నిర్ణయం తీసుకుంటారు. ఏ రాష్ట్రానికి ఎంత వాటా అనేది ఖరారు చేసుకుంటారు. త్రిమెన్ కమిటీ అనేది బోర్డు సమావేశం నిర్ణయించిన వాటాలను మాత్రమే అమలు చేయాల్సి ఉన్నది. రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న జలాలు, అవసరాల మేరకు ఇరు రాష్ట్రాల ప్రతిపాదనలు పెట్టడం, వాటిపై త్రిమెన్ కమిటీ చర్చించి, బోర్డులో నిర్ణయించిన వాటాల మేరకు పంపిణీ చేయడం, అందుకు అనుగుణంగా నీటి విడుదల ఉత్తర్వులు జారీ చేయడం పరిపాటిగా కొనసాగుతున్నది. కానీ ఈ ఏడాది బోర్డు సమావేశం లేకుండా, వాటాలు తేలకుండానే నేరుగా త్రిమెన్ కమిటీ సమావేశం ఏర్పాటుకు సిద్ధమవడం గమనార్హం. నీటివాటా తేల్చాలని తెలంగాణ ప్రభుత్వం గట్టిగా పట్టుబట్టాల్సిన అవసరం ఉంది.

## వరి వైపే రైతుల మొగ్గు


### సర్కార్ వద్దన్నా బేఖాతర్

### సాధారణం కంటే మించి సాగు

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** తెలంగాణలో ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంట అయిన వరి వేయవద్దని, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేసినా వాటిని పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఫలితంగా రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం భారీగా పెరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా సాధారణ విస్తీర్ణానికి మించి వరి సాగు చేరుకుంటోంది. ఒకటి రెండు మినహా వర్షపాతం లోటు నమోదైన జిల్లాల్లో సైతం వరి సాగు విస్తీర్ణం పెరిగి సాధారణం కంటే మించిపోయింది. ఈ రుతుపవన కాలంలో వర్షపాతం లోటుకు ఎల్ నినో కారణమని ప్రభుత్వం పేర్కొన్నందున, ఖరీఫ్ సీజన్‌లో వరి సాగును మానుకుని, నీటిపారుదల సౌకర్యం ఉన్న మెట్ట పంటలను ఎంచుకోవాలని రైతులకు సలహా ఇవ్వబడింది. వర్షపాతం తక్కువగా ఉండటం, నీటి లభ్యత పరిమితంగా ఉండటం వంటి పరిస్థితుల్లో ఖరీఫ్ సీజన్‌లో వరికి నీటి వినియోగం గల పంటను పండించవద్దని సలహా ఇచ్చినప్పటికీ అన్నీ బేఖాతరు అయ్యాయి. సీజను మొదట్లో వరి సాగు చేయడానికి వెనుకాడిన రైతులు, జూలై చివరి వారంలో కురిసిన భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున పంటను నాటడం ప్రారంభించారు. మొత్తం వర్షపాతం లోటు ఉన్నప్పటికీ రైతులు వరి సాగును కొనసాగిస్తున్నారు.

వ్యవసాయ శాఖ ప్రారంభంలో కరవు పరిస్థితుల అంచనాలతో సాగు తగ్గుతుందని భావించినప్పటికీ రైతులు పెద్ద ఎత్తున వరి నాట్లు జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఒకటి రెండు జిల్లాల్లో తప్ప మిగిని వాటిల్లో వరి సాగు ఊపందుకుంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి నీటిపారుదల ప్రాజెక్టులకు తగినంత నీరు చేరినప్పటికీ, ఆ ప్రాజెక్టుల నుండి వ్యవసాయ అవసరాలకు నీటిని సరఫరా చేయకూడదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుబాటులో ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగిస్తామని కొందరు మంత్రులు ఇప్పటికే ప్రకటించారు. ఇటీవలి వర్షాల వల్ల కొన్ని ప్రాంతాల్లో నీటిమట్టాలు స్వల్పంగా పెరిగినప్పటికీ, భూగర్భ జలమట్టంలో కూడా చెప్పుకోదగ్గ మెరుగుదల ఏమీ లేదు. వ్యవసాయ శాఖ నివేదికలో వెల్లడించిన వివరాలు ప్రకారం ఈ ఖరీఫ్ సీజన్‌లో ఈ నెల 12వ తేదీ నాటికి వరి సాధారణ విస్తీర్ణం 36,71,373 ఎకరాల సాధారణ విస్తీర్ణానికి గాను 41,54,006 ఎకరాల్లో నాట్లు వేశారు. నాట్లు వేయడం ఇంకా కొనసాగుతున్నందున, ఈ విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలో సగటున సాధారణంగా కురవాల్సిన 445.1 మిల్లీ మీటర్లకు గాను ఆ తేదీ నాటికి 410.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# మేడారంలో బుచ్చమ్మకి ఇల్లు మంజూరు



### తనను కోరిన వృద్ధురాలికి తక్షణమే మంజూరు చేసిన సిఎం రేవంత్

### మేడారం నుంచి ములుగు దాకా పలు అభివృద్ధి కార్యక్రమాలతో సిఎం పర్యటన

### చేయూత పింఛన్ పత్రాల అందజేత

### జంపన్న వాగు సమగ్ర అభివృద్ధికి చర్యలు

### ములుగును ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి సీతక్క

**ములుగు జిల్లా బ్యూరో, ప్రభాతవార్త, ఆగస్టు 16:** ములుగు జిల్లా సమగ్ర అభివృద్ధి, గిరిజనుల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం జిల్లాలో విస్తృతంగా పర్యటిం చారు. మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతల దర్శనం అనంతరం చేయూత పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ, శుద్ధ తాగునీటి కేంద్రం ప్రారంభం, గ్రామీణ రహదారుల అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం, అభివృద్ధి పనుల పైలాన్, తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ, నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

#### వనదేవతల సన్నిధిలో నిలువెత్తు బంగారం సమర్పించిన సిఎం

ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు కామారెడ్డి జిల్లా నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి మేడారం చేరుకున్నారు. మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీలు బలరాం నాయక్, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. సీఎం వనదేవతల గద్దెల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తులాభారంలో 66 కిలోల నిలువెత్తు బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సీఎం తో పాటు మంత్రులకు సమ్మక్క-సారలమ్మ అమ్మవార్ల జ్ఞాపికలను అందజేశారు. ఆలయ ప్రాంగణంలో సీఎం మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ క్రమంలో అక్కడ ప్రజలతో మమేకమైన రేవంత్ రెడ్డి ని కలిసిన బుచ్చమ్మ అనే వృద్ధురాలు తనకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీఎం ను కోరింది. ఈ క్రమంలో ఇళ్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చిన సీఎం అక్కడే ఉన్న జిల్లా కలెక్టర్ కు బుచ్చమ్మకు ఇల్లు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు.

#### చేయూత పింఛన్ అర్హులకు పత్రాల అందజేత

గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వికలాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులకు చేయూత పింఛన్ మంజూరు చెక్కులు, పత్రాలను సీఎం అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

#### రూ.16,007 కోట్ల రహదారుల ప్రణాళికకు ములుగు జిల్లా వేదికగా శ్రీకారం

మేడారం కార్యక్రమాలు ముగించుకున్న ముఖ్యమంత్రి మధ్యాహ్నం 3.32 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ములుగు జిల్లా కేంద్రానికి బయలుదేరారు. అనంతరం ములుగు గట్టమ్మ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన గ్రామీణ రహదారుల అభివృద్ధి పైలాన్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.16,007 కోట్లతో 2,145 గ్రామీణ రహదారులను 7,448 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసే భారీ ప్రణాళికకు ములుగు నుంచి శ్రీకారం చుట్టారు. గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాలు, ప్రధాన రహదారులకు మెరుగైన అనుసంధానం కల్పించడం కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

#### ములుగు జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యం: సిఎం రేవంత్ రెడ్డి

కలెక్టరేట్ సభా వేదిక నుంచి ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సమ్మక్క-సారలమ్మల ఆశీస్సులతోనే గతంలో పీసీసీ అధ్యక్షుడిగా తాను చేపట్టిన పాదయాత్రను ములుగు గడ్డ నుంచి ప్రారంభించానని గుర్తుచేశారు. రాష్ట్ర నలుమూలల గ్రామాలు, గూడేలు, పల్లెల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నామని, ప్రజలకు ఇచ్చిన భరోసా మేరకు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ములుగు జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, సాగునీరు, రహదారులు, ఉపాధి అవకాశాలు, పర్యాటక రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.

#### ప్రపంచస్థాయిలో మేడారం అభివృద్ధి

సమ్మక్క-సారలమ్మ సన్నిధిని మరింత వైభవంగా తీర్చిదిద్ది మేడారం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటేలా అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మేడారం దేవాలయ ప్రాంతాన్ని రామప్ప, వేయి స్తంభాల గుడి తరహాలో విశిష్టంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు మేడారం ఆధ్యాత్మిక, గిరిజన సాంస్కృతిక విశిష్టత మరింత వెలుగొందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

#### మల్లూరు ఆలయానికి, జంపన్న వాగు అభివృద్ధికి ప్రత్యేక నిధులు

మల్లూరు నరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనతో పాటు మల్లూరు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మేడారం వచ్చే భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని జంపన్న వాగును సమగ్రంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. అవసరమైన చోట చెక్‌డ్యామ్‌లు, స్నాన ఘట్టాల నిర్మాణం చేపట్టి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

#### యువతకు నైపుణ్య శిక్షణ

యువతకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్యతో పాటు ఆ తర్వాత నైపుణ్య విద్యపై దృష్టి సారించి అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. 12వ తరగతి అనంతరం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, పాలిటెక్నిక్ కళాశాలలు, స్కిల్ యూనివర్సిటీ వంటి సంస్థల ద్వారా యువతకు సాంకేతిక, వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ములుగు ప్రాంతంలో గిరిజన విశ్వవిద్యాలయం అందుబాటులోకి రావడం ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు.

#### మహిళలకు 'సమ్మక్క-సారలమ్మ' చీరెలు

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ 'సమ్మక్క-సారలమ్మ' పేరుతో మహిళలకు నాణ్యమైన చీరలను అందించనున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్‌లో చిలకపచ్చ రంగు చీరలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. మంత్రి సీతక్క పర్యవేక్షణలో చీరల ఎంపిక, రూపకల్పన జరిగిందని పేర్కొన్నారు.

#### ములుగును ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతాం: మంత్రి సీతక్క

మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ములుగు జిల్లా, ములుగు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతమైన ములుగును హైదరాబాద్ వంటి అభివృద్ధి చెందిన ప్రాంతాలతో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. నూతన కలెక్టరేట్ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరైన ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. సమ్మక్క-సారలమ్మ సన్నిధిని గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడారం, ములుగు అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పలుమార్లు ఈ ప్రాంతాన్ని సందర్శించి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి దివ్య, మేడారం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భోగాపురం నుంచి విమానాల రాకపోకలు షురూ!

### తొలి రోజే హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై ఫ్లైట్స్

### ప్రయాణికులకు అందుబాటులోకి 31 విమానాల సర్వీసులు

### విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి షెడ్యూల్ విమానాల నిలిపివేత

**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా భోగాపురంలో కొత్తగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ



విమానాశ్రయం నుంచి వాణిజ్య విమాన సర్వీసులు ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. దీనితో పాటు, విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లోని (ఐఎన్‌ఎస్ డేగా) సివిల్ ఎన్‌క్లేవ్‌లో వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆదివారం అర్ధరాత్రి 12:01 గంటల నుంచి అంటే సోమవారం తొలి గంటల నుంచి భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయిలో పనిచేస్తుందని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అన్ని విమానయాన సంస్థలు తమ సేవలను విశాఖపట్నం నుంచి భోగాపురానికి మార్చాయి. తొలిరోజే హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, తిరుపతి వంటి నగరాలకు 31 సర్వీసులు నడపడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

పాత విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌కు ఉన్న విటిజెడ్ ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ కోడ్‌ను కూడా భోగాపురం విమానాశ్రయానికి బదిలీ చేశారు. అయితే, జాతీయ అత్యవసర పరిస్థితులు, భారత వైమానిక దళం, ఇతర రక్షణ దళాలు, పోలీసు, ప్రభుత్వ ప్రత్యేక విఐపి విమానాల రాకపోకలకు మాత్రం విశాఖ ఎయిర్‌పోర్ట్‌ను వినియోగించనున్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ ఆగస్టు 1న ఈ విమానాశ్రయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సుమారు రూ.4,727 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం 31 నెలల్లోనే పూర్తయి, దేశంలో అత్యంత వేగంగా నిర్మించిన విమానాశ్రయాల్లో ఒకటిగా నిలిచింది. షెడ్యూల్ కంటే దాదాపు ఐదు నెలల ముందే దీని నిర్మాణం పూర్తి కావడం విశేషం. ఈ ఎయిర్‌పోర్ట్‌కు ఇప్పటికే డిజిసిఎ ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు అవసరమైన అన్ని భద్రత, అగ్నిమాపక, పర్యావరణ అనుమతులు లభించాయి. మొదటి దశలో యేటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా దీన్ని రూపొందించారు. భవిష్యత్తులో దీని సామర్థ్యాన్ని యేటా 4 కోట్ల మంది ప్రయాణికులకు పెంచేలా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టు ఉత్తరాంధ్రలోని పూర్వపు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఆర్థిక వృద్ధి, పర్యాటకం, పారిశ్రామిక పెట్టుబడులు, ఎగుమతులు, లాజిస్టిక్స్, ఏరోస్పేస్, రక్షణ రంగాలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.

ఈ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక నూతన అధ్యాయం ప్రారంభం కానున్నది. పాత రన్‌వే కేవలం ఆరు వేల అడుగులు మాత్రమే ఉండటంతో పెద్ద విమానాల ల్యాండింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యేవి. దీన్ని అధిగమించడానికి 10,007 అడుగుల రన్‌వేను నిర్మించి 2007 జూన్ 15న ప్రారంభించారు. దీంతో బోయింగ్ 737, ఎయిర్‌బస్ ఎ320 వంటి భారీ వాణిజ్య విమానాల రాకపోకలకు మార్గం సుగమమైంది. రూ.95 కోట్లతో సరికొత్త ఇంటిగ్రేటెడ్ ప్యాసింజర్ టెర్మినల్ భవనాన్ని 2009 ఫిబ్రవరి 20న ప్రారంభించారు.

ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ (ఐఎల్‌ఎస్) రాత్రివేళల్లో విమానాలు దిగే సాంకేతికత (నైట్ ల్యాండింగ్) 2012లో అందుబాటులోకి వచ్చింది. భారతీయ వాయుసేన, సాయుధ దళాలు, పోలీసు విమానాలు, ప్రభుత్వ అతిథులు రాకపోకలు సాగించే విమానాలు, లీజ్, విఐపి ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఇక్కడి నుంచి నడుస్తాయని పౌరవిమానయానశాఖ పేర్కొంది. నాన్‌షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలూ కొనసాగుతాయని తెలిపింది. ఇప్పటి వరకు విశాఖ విమానాశ్రయానికి ఉన్న అంతర్జాతీయ ట్రావెల్‌కోడ్ విటిజెడ్ సోమవారం (ఆగస్టు 17) అర్ధరాత్రి 00:01 గంటల నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి బదిలీ అవుతుందని కేంద్రం వెల్లడించింది.

## యువతకు సరైన మార్గదర్శనానికి ఆధ్యాత్మిక గురువుల పాత్ర కీలకం

### ఎన్. రామచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు16:** నేటి యువతకు సరైన దిశ, స్పష్టమైన మార్గదర్శకత్వం ఎంతో అవసరమని, పూజ్య గురుదేవ్ వంటి మహనీయుల ఆశీస్సులు, మార్గదర్శనం ద్వారానే భావితరం సన్మార్గంలో పయనిస్తుందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పేర్కొన్నారు. ఆదివారం గురుదేవ్ ఆధ్యాత్మిక సమక్షంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని, రాబోయే యువతరం గురించి వారు పలికిన ప్రతి మాట అక్షరాలా శతశాతం సత్యమని ఆయన అన్నారు. వారి ప్రవచనాలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని, గురుదేవ్ ఇచ్చిన సందేశాన్ని తూచా తప్పకుండా ఆచరణలో పెడుతూ సమాజ సేవ, మానవ సేవకు నిరంతరం అంకితమై పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఒక న్యాయవాదిగా, విద్యావంతుడిగా సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగిన ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతను గుర్తించి, సమాజాన్ని సరైన దిశగా నడిపించాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజ హితం కోసం నిస్వార్థంగా పనిచేసే ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక గురువుల ఆశీస్సులు ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

## రాజ్యాంగ హక్కులపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలి

### హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి. రాధారాణి

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఆగస్టు 16, ప్రభాతవార్త:** మహిళా ఉపాధ్యాయులు రాజ్యాంగబద్ధమైన హక్కులపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకొని, వాటిని విద్యార్థులకు సక్రమంగా బోధించినప్పుడే సమగ్ర సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలంగాణ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి. రాధారాణి స్పష్టం చేశారు. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) ఆధ్వర్యంలో, సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సిహెచ్. దుర్గా భవాని అధ్యక్షతన నిర్వహించిన 'రాష్ట్ర స్థాయి మహిళా ఉపాధ్యాయుల సదస్సులో జస్టిస్ రాధారాణి పాల్గొని ప్రసంగించారు. ఆధునిక సమాజం సాంకేతికంగా వేగంగా పురోగమిస్తున్నప్పటికీ, సామాజిక, సాంస్కృతిక అడ్డంకులు మహిళలను ఇంకా వెనక్కి నెట్టివేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కులు పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని, ఈ నేపథ్యంలో ప్రతీ మహిళా ఉపాధ్యాయురాలు రాజ్యాంగ, రాజకీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు మరియం ధావలే మాట్లాడుతూ ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులకు, శ్రమదోపిడీకి గురవుతున్నారని విమర్శించారు. గృహ నిర్వహణ ద్వారా మహిళలు అందించే ఉచిత సేవల విలువ దేశ జిడిపి లో కనీసం 6 శాతంగా ఉన్నాదని ఎస్బీఐ నివేదిక స్పష్టం చేసిందని గుర్తుచేశారు. పార్లమెంటులో ఏకపక్షంగా తెస్తున్న చట్టాలు, నూతన లేబర్ కోడ్లు కార్మికులు, మహిళల



ప్రసంగిస్తున్నహైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి. రాధారాణి

హక్కులను కాలరాసేలా ఉన్నాయని మండిపడ్డారు. ఎస్టీఎఫ్ఐ కార్యదర్శి ఎన్. అరుణకుమారి మాట్లాడుతూ మహిళలపై కట్టుబాట్ల పేరుతో విధించే నియంత్రణలను అధిగమించడానికి ఉపాధ్యాయులు శాస్త్రీయ దృక్పథంతో వ్యవహరించాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎన్.వెంకట్, రాష్ట్ర కార్యదర్శులు వి.శాంతకుమారి, వై.జ్ఞాన మంజరి, విశాలి, కె.రవికుమార్, ఎస్.రవి ప్రసాద్, గౌడు వెంకటప్ప, సింహాచలం, మహిళా విభాగం కన్వీనర్ ఆర్.శారద, సీనియర్ నాయకులు జి.నాగమణి, అరుణమ్మలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి మహిళా ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ రద్దుకు కాంగ్రెస్ కుట్ర

### ప్రభుత్వ ధోరణికి వ్యతిరేకంగా నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

### పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు16:** పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆర్థిక భరోసాకు ప్రతీకగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఈ పథకాలను ఎత్తివేసేందుకు ప్రభుత్వం ఉద్దేశపూర్వ కంగా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ కుట్రను అడ్డుకోవడంతో పాటు కాంగ్రెస్ మోస పూరిత వైఖరిని ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టా లని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర జనరల్ బాడీ సభ్యులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్ ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదని, తెలంగాణ పేద కుటుంబాల ఆడబిడ్డల భవిష్యత్తు, ఆత్మగౌరవంతో ముడిపడిన కార్యక్రమాలని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన వెంటనే పేద కుటుంబాల్లో ఆడబిడ్డ పెళ్లి ఎంతటి ఆర్థిక భారమో గుర్తించిన కేసీఆర్ 2014 అక్టోబర్ 2న ఈ పథకాలను ప్రారంభించారని గుర్తుచేశారు. రూ.51 వేల ఆర్థిక సహాయంతో ప్రారంభమైన ఈ పథకాన్ని దశలవారీగా రూ.75,116కు, అనం తరం రూ.1,00,116కు పెంచారని తెలిపారు. కేసీఆర్ హయాంలో సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందిందన్నారు. కోవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి ద్వారా పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి తో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని బలోపేతం చేయాల్సింది పోయి దానినే రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోందని కేటీఆర్ విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని అర్హులైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# డ్రగ్స్ స్మగ్లర్లతో పోలీసుల దోస్తానా!

## గంజాయి డాన్‌లు బొల్లం బ్రదర్స్‌తో ఎస్ఐ సహా ఐదుగురు కానిస్టేబుళ్ల మిలాఖత్

## గతంలో స్టువర్ట్‌పురం దొంగలకు ఆశ్రయం కల్పించిన ఓ కానిస్టేబుల్

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** పోలీసు అధికారుల్లో కొందరు డ్రగ్స్ స్మగ్లర్లతో చెలిమి చేస్తుండడం మొత్తం పోలీసు విభాగానికే చెడ్డపేరు తెస్తోంది. బాలానగర్‌లో గత గురువారం ఈగల్ పోలీసులు గంజాయి డాన్‌లుగా పేరొందిన బొల్లం బ్రదర్స్ అడ్డాపై దాడులు చేసిన సమయంలో బాలానగర్ పోలీసు స్టేషన్‌కు చెందిన ఓ ఎస్ఐ సహా ఐదుగురు కానిస్టేబుళ్ల లాలూచీ వ్యవహారం వెలుగు చూసింది. గంజాయి డాన్‌ల అడ్డాలో ఏకంగా ఎస్ఐ మ్యాన్ ప్యాక్ (వాకిటాకీ) లభ్యం కాగా దీనిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. గతంలోనూ పలుపోలీసు ఇటువంటి ఉదంతాలు అనేకం వెలుగు చూడగా ఈగల్ ఏర్పాటయ్యాక ఏకంగా ఒక ఎస్ఐ స్మగ్లర్లతో దోస్తానా చేయడం సంచలనం రేపింది. ఇప్పటి వరకు దొంగలతో పాటు ఇతర నేరగాళ్లతోనే స్నేహంగా వుండే పోలీసులు ఇప్పుడు మాదకద్రవ్యాల స్మగ్లర్లతో చెట్టాపట్టాల్ వరకు ఎదిగారు. మూడేళ్ల క్రితం సైబరాబాద్‌లో సైబర్ క్రైం విభాగానికి చెందిన రాజేందర్ అనే ఒయువ ఎస్ఐ ఓ డ్రగ్స్ స్మగ్లర్‌ను మహారాష్ట్రలో అరెస్టు చేసిన సమయంలో అతని వద్ద లభించిన మాదకద్రవ్యాలలో కొంతభాగం సర్కారుకు ఇవ్వకుండా తన వద్ద దాచుకుని, దానిని బహిరంగ మార్కెట్లో విక్రయించేందుకు యత్నించి దొరికిపోయాడు. డ్రగ్స్ స్మగ్లర్ మరో కేసులో విచారణ ఎదుర్కొన్నే సమయంలో సదరు ఎస్ఐ బండారం బయటపెట్టడంతో గోల్‌మాల్ బాగోతం రట్టయ్యింది. ఈ కేసులో సదరు ఎస్ఐ ఇంట్లోనే డ్రగ్స్ పట్టుబడగా వివరకు అతన్ని అరెస్టు చేశారు. ఈ ఘటనకు ముందు అనేక మంది పోలీసు అధికారులు నేరగాళ్లతో చెలిమి చేసి ఉద్యోగాల నుంచి సస్పెండ్ కాగా కొందరు డిస్మిస్ అయ్యారు. ఇందులో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్లకు చెందిన వారు అనేక మంది వున్నారు. దీంతో పాటు ఎనిమిదేళ్ల క్రితం రాష్ట్రంలో సంచలనం రేపిన ఎంసెట్ స్కాంను విచారించిన సిఐడికి చెందిన ఓ ఇన్‌స్పెక్టర్ వరంగల్‌లో ఓ నిందితుడి నుంచి 50 వేల రూపాయలు తీసుకుని దొరికిపోవడం సంచలనం రేపింది. సైబరాబాద్, మల్కాజిగిరి పరిధుల్లో వున్న ఎస్ఓటికి చెందిన కొందరు అధికారులు గతంలో కరడుగట్టిన నేరగాళ్లను అరెస్టు చేసే సమయంలో వారి వద్ద నగదును కాజేసిన ఉదంతాలు అనేకం వెలుగు చూశాయి. ఈ క్రమంలో కొందరిపై వేటు పడింది. దీని తరువాత నాలుగేళ్ల క్రితం సిటీ పోలీసు విభాగానికి చెందిన ఓ కానిస్టేబుల్ ఏకంగా స్టూవర్ట్‌పురం దొంగల ముఠాకు తన ఇంట్లోనే ఆశ్రయం ఇచ్చి వారిచేత దొంగతనాలు చేయించి, చివరగా నల్లగొండ పోలీసులకు చిక్కాడు. దీంతో పాటు రియల్ ఎస్టేట్ రంగంలో నేరచరిత్ర వున్న వారి నుంచి కొందరు ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని ఉద్యోగాల నుంచి సస్పెండ్ అయిన ఘటనలు కూడా వున్నాయి. దీంతో పాటు హవాలా నగదును తరలిస్తూ దొరికిపోయిన పోలీసులు కూడా వున్నారు. వీటన్నింటికి భిన్నంగా కొంతకాలంగా డ్రగ్స్ స్మగ్లర్లతో పోలీసుల దోస్తానా ఎక్కువయ్యింది. ఈగల్ విభాగం ఏర్పాటయ్యాక రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి సహా ఇతర మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతూ అడ్డాలపై దాడులు చేస్తుండడం తెలిసిందే. దాడుల సమయంలో ఆయా ప్రాంతాల పోలీసులతో స్మగ్లర్లకు వున్న లింకులు బయట పడుతున్నాయి. బాలానగర్‌లో రట్టయిన గోల్‌మాల్ ఈ కోవలో నిదే. ఈఘటనపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ కేసులో ఎస్ఐని విచారిస్తుండగా ఆయనతో పాటు కానిస్టేబుళ్లపై వేటుపడే వీలుందని తెలిసింది.

**ఉన్నతాధికారుల అజమాయిషీ కొరవడడం వల్లే ఇటువంటి ఘటనలు:** ఇదిలావుండగా పోలీసు శాఖలో కీలకంగా వుండే ఎస్ఐ స్థాయి అధికారులు ఏకంగా డ్రగ్స్ స్మగ్లర్లతో దోస్తానా చేయడం పోలీసు శాఖకు తల వంపుగా తేలింది. ఇలాంటి ఘటనలు జరగడానికి క్షేత్రస్థాయిలో వుండే అధికారులపై ఉన్నతాధికారుల అజమాయిషీ కొరవడడమేనని నిపుణులు అంటున్నారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందనే దానిపై ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షణ చేయడంతో పాటు ఒకటికి నాలుగుమార్లు క్రాస్ చెకింగ్ చేస్తే ఇటు వంటి ఘటనలు జరిగేందుకు ఆస్కారం వుండవని వారంటున్నారు.

### బొల్లం బ్రదర్స్ నుంచి కస్టమర్లకు భారీగా గంజాయి



**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** బాలానగర్‌లో గత గురువారం రట్టయిన బొల్లా బ్రదర్స్ గంజాయి డెన్‌లో మరిన్ని సంచలన విషయాలు వెలుగు చూశాయి. ఈ డెన్‌కు నాయకుడుగా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన బొల్లా కిరణ్ వుండగా అతని సోదరులు ఇద్దరు సహా నాయకులుగా వుండడం తెలిసిందే. పోలీసులకు ఓవైపు ఇన్‌ఫార్మర్లుగా వుంటూనే మరోవైపు గంజాయి దందా సాగిస్తున్న వీరు ఇందుకోసం డెడ్ డ్రాప్ పద్దతిని ఎంచుకోవడం విశేషం. ఒడిషా, ఏపి నుంచి తక్కువ ధరకు గంజాయి తెప్పించి దానిని చిన్న ప్యాకెట్లలో వుంచి వాటిని డెడ్ డ్రాప్ వద్ధతిలో అమ్ముతున్నారని పోలీసులు తేల్చారు. దీనికి సంబంధించి పోలీసులు కుంటలానికి రిపోర్టులను కోర్టుకు సమర్పించారు. ఈ కేసులో బొల్లా బ్రదర్స్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేయగా వీరిని విచారించగా కొత్త విషయాలు వెలుగు చూశాయి. బొల్లా బ్రదర్స్ నుంచి పెద్ద సంఖ్యలో గంజాయి వ్యసనపరులు గంజాయి కొంటున్నట్లు పోలీసులు తేల్చారు. వీరికి ఏడుగురు బడా స్మగ్లర్లు గంజాయి అమ్ముతున్నట్లు తేలింది. బొల్లా బ్రదర్స్ నుంచి గంజాయి కొన్న వారి జాబితా 225గా పోలీసులు గుర్తించారు. వీరి చిరునామాలను కూడా గుర్తించిన పోలీసులు వారిని విచారించేందుకు సిద్దమవు తున్నారు. డిజిటల్ పద్దతిలో వీరు నగదును తీసుకునే వారని తేలింది. దీంతో పాటు గంజాయిని సరఫరా కోసం నంబర్ ప్లేట్లు లేని పదికి పైగా వాహనాలను వాడినట్లు తేలింది. ఇందులో కొన్నింటిని జప్తు చేయగా మిగతా వాటి కోసం గాలిస్తున్నారు.

# డ్రంకన్ డ్రైవ్‌లో 271 మంది పట్టివేత

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** జంట నగరాలు, శివారు ప్రాంతాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రివేళలో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 271 మంది మందుబాబులు పట్టుబడ్డారు. వీరిలో 228 మంది ద్విచక్ర వాహనదారులు, 20 మంది ఆటో డ్రైవర్లు, 23 మంది కార్లతో పాటు ఇతర వాహనాల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ వారిలో 55 మందిలో 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 103 మందిలో 51 నుంచి 100 పాయింట్ల వరకు, 68 మందిలో 101 నుంచి 150 పాయింట్ల వరకు, 29 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, ఐదుగురు 201 నుంచి 250 పా యింట్ల వరకు, ఏడుగురు 251 నుంచి 300 పాయింట్ల వరకు, నలుగురు 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించినట్లు తేలింది. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ మీడియాకు తెలిపారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని ఆయన వెల్లడించారు.

**సైబరాబాద్‌లో 201 మంది పట్టివేత**

ఇదిలావుండగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 201 మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 174 మంది ద్విచక్ర వాహనదారులు, తొమ్మి ది మంది ఆటో డ్రై వర్లు, 17 మంది కార్ల డ్రైవర్లు, ఒకరు భారీ వాహనం డ్రైవర్ వున్నారు. పట్టుబడ్డ వారిని నిబంధనల మేరకు కోర్టులో హాజరు పరుస్తామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అదనపు డిసిపి నరేందర్ తెలిపారు.

**మల్కాజిగిరి పరిధిలో 193 మంది**

కాగా మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో 193 మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 161 మంది ద్విచక్ర వాహనదారులు. ఎనిమిది మంది ఆటో డ్రైవర్లు, 24 మంది కార్ల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ వారిని నిబంధనల మేరకు కోర్టులో హాజరు పరుస్తామని ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డి తెలిపారు.

# బాలికపై లైంగిక దాడి: 8 నెలల తరువాత కేసు నమోదు

**కుషాయిగూడ, ప్రభాతవార్త ఆగస్టు 16 :** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారంటూ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు సకాలంలో స్పందించలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాధితురాలు ఆరు నెలల గర్భవతి అయిన తర్వాత కేసు నమోదు చేయడం పోలీసుల విధి నిర్వహణపై ప్రశ్నలు తలెత్తేలా చేసింది. బాధితురాలి తల్లి తెలిపిన వివరాల ప్రకారం మైనర్ బాలికపై యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ గత డిసెంబరులో చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆ ఫిర్యాదుపై సుమారు ఎనిమిది నెలల పాటు ఎలాంటి కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. అనంతరం కేసు నమోదు చేసిన పోలీసులు, సంఘటన జరిగిన ప్రాంతం తమ పరిధిలోకి రాదని గుర్తించి కుషాయిగూడ పోలీసులకు బదిలీ చేసినట్లు సమాచారం. సంబంధిత ప్రాంతం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందని గుర్తించినప్పటికీ కేసును సకాలంలో బదిలీ చేయకపోవడం వల్ల బాధితురాలికి న్యాయం ఆలస్యమైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చివరకు ఆగస్టు 16న కేసును కుషాయిగూడ పోలీసులకు బదిలీ చేయగా, వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు అభిషేక్ (24) అనే యువకుడిపై మైనర్ బాలికపై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

బాలిక గర్భం దాల్చిన నేపథ్యంలో ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలి పారు. నిందితుడిపై చట్టప్రకారం చర్యలు తీసు కుంటామని పేర్కొన్నారు. బాధితురాలు మైనర్ కావడంతో ఆమె వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఆరావళిలో హాంగామా చేసిన మోడల్ అంతరా బెనర్జీ అరెస్టు

**ముంబై, ఆగస్టు 16:** ఆరావళి ఎక్స్‌ప్రెస్‌లో రైల్వే అధికారులపై బ్లేడుతో దాడికి పాల్పడిన కేసులో మోడల్, వెబ్‌సిరీస్ నటి అంతరా బెనర్జీ (31)ని పోలీసులు అరెస్టు చేశారు. ఏసీ కోచ్‌లో సీటు విషయంలో తలెత్తిన వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో ఆమె రైల్వే అధికారులు, ఆర్‌పీఎఫ్ సిబ్బందిపై దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఓ అధికారి సహా అంతరాకు గాయాలయ్యాయి. ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం నోటీసులు ఇచ్చి బెయిల్‌పై విడుదల చేశారు. అంతరా బెనర్జీ షూటింగ్ నిమిత్తం సూరత్‌కు వెళ్లేందుకు ఈ నెల 12 రాత్రి 9:30 గంటలకు బోరివాలిలో ఆరావళి ఎక్స్‌ప్రెస్ ఎక్కింది. ఆమె వద్ద స్లీపర్‌క్లాస్ టికెట్ ఉండగా రిజర్వ్‌డ్ ఏసీ కోచ్‌లోకి ప్రవేశించింది. ఆమె సీటులో కూర్చొని ఉండగా కాసేపటికి ఓ ప్రయాణికుడు వచ్చాడు. అది తాను రిజర్వ్ చేసిన సీటని, లేచి వెళ్లిపోవాలని కోరాడు. అందుకు ఆమె నిరాకరించడంతో సదరు ప్రయాణికుడు టికెట్ కలెక్టర్ హరికేష్ త్రిపాఠి, ఆర్‌పీఎఫ్‌కు సమాచారం అందించాడు. దీంతో కానిస్టేబుల్ రాజేశ్ కుమార్, ఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ యమినికాంత్ మిశ్రా వారి వద్దకు చేరుకున్నారు. సీటును ఖాళీ చేయాలని వారిద్దరూ అంతరాను కోరారు. అందుకు ఆమె నిరాకరిస్తూ అధికారులను దూషించింది. ఆ తర్వాత అంతరా తన బట్టలు విప్పేసి బ్లేడుతో దాడికి పాల్పడింది. ఈ ఘటనలో మిశ్రాతో పాటు అంతరాకు గాయాలయ్యాయి. పరిస్థితి అదుపు తప్పడంతో ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఏసీ కోచ్ తలుపులను మూసేశారు. దీంతో ఆమె తప్పించుకోవడానికి కోచ్ అద్దాలను పగలగొట్టేందుకు ప్రయత్నించింది. దాదాపు గంటపాటు ఆమె హంగామా చేయడంతో తోటి ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అనంతరం అంతరాను దహను రైల్వే స్టేషన్‌లో అధికారులు దించేశారు. మరుసటి రోజు ఉదయం అంతరాను బోరివాలి రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులకు ఫోన్ చేయాలని వారు కోరగా ఆమె నిరాకరించింది. తనపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. దీంతో అంతరాపై కేసు నమోదు చేసిన పోలీసులు.. అనంతరం నోటీసులు ఇచ్చి బెయిల్‌పై విడుదల చేశారు. ఏసీ కోచ్ టికెట్ దొరక్కపోవడంతో అంతరా బెనర్జీ తీవ్ర మనోవేదనకు గురైందని పోలీసులు పేర్కొన్నారు.

# తవ్వకాల్లో బయటపడ్డ రూ.98కోట్ల బంగారు బిస్కెట్లు



**బ్రస్సెల్స్, ఆగస్టు 16:** భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం తవ్వకాలు జరుపుతుండగా ఊహించని విధంగా భారీ మొత్తంలో బంగారు బిస్కెట్లు, అరుదైన నాణేలు బయటపడ్డాయి. వీటి విలువ దాదాపు 9 మిలియన్ యూరోలు అంటే భారత కరెన్సీల్లో రూ.98 కోట్లు ఉంటాయని అంచనా. ఈ ఘటన బెల్జియం రాజధాని బ్రెస్సెల్స్‌కు సమీపంలోని సింటిగిల్లిస్‌డెండర్‌మొండె ప్రాంతంలో వెలుగుచూసింది. సమ్మర్ జాబ్ చేస్తోన్న కోబే అనే 18 ఏళ్ల యువకుడు ఈ నిధిని మొదటిసారి గుర్తించాడు. మాకు ఒక్కసారిగా కింద ఏదో మెరుస్తున్నట్టు కనిపించింది దానిని మేము యూరో నాణేలు అనుకున్నాం కానీ, తవ్వుతుంటే బంగారం బిస్కెట్లు బయటపడ్డాయి మేము అనుకున్న దానికంటే అక్కడ పెద్ద నిధి ఉందని తర్వాత అర్థమైందని తెలిపాడు. తన సహచర కార్మికులతో కలిసి పనులు చేస్తున్న సమయంలో నిధి బయటపడింది. 19వ శతాబ్దం చివరలో మద్యం తయారీ కేంద్రం యజమాని థియోఫిలస్ వాన్ అస్చే కోసం నిర్మించిన విల్లా కింద ఇటుకలతో కట్టిన గోడలోపల భద్రపరిచిన ఒక బ్యాగులో ఈ నిధిని దాచారు. ఈ నిధిలో బంగారు నాణేలు, బంగారు ముక్కలు, నెంబర్లు వేసిన కడ్డీలు ఉన్నాయి. ఈ నిధిని కావాలనే ఎవరైనా దాచిపెట్టినట్లు కనిపిస్తోందని అతడు అభిప్రాయపడ్డాడు. నిధి బయటపడిన ప్రదేశంలో 1899లో ప్రారంభమైన బీరు తయారీ కేంద్రం 1970 వరకు నడిచింది. ఇప్పటికీ భవనం ఇనుప గేట్లపై అక్షరాలు కనిపిస్తాయి. ప్రస్తుతం సిఎడబ్ల్యు ఓస్ట్‌వ్లాండరెన్ అనే సామాజిక సంస్థ దీనిని కొత్త కార్యాలయాలు, నివాసాలను ఏర్పాటు చేయడానికి పునరుద్ధరిస్తోంది. బ్రూవర్స్ హౌస్ ఒక అందమైన భవనం, కానీ దానిని పూర్తిగా కూల్చి వేస్తున్నారు. చివరికి, కేవలం గోడలు మాత్రమే మిగిలి ఉంటాయి అని సంస్థ గీర్ట్ హిల్లార్ట్ చెప్పారు. అధికారులు వెంటనే ఆ ప్రదేశాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని, నిధిని బ్రస్సెల్స్‌లోని ఒక సురక్షిత కేంద్రానికి తరలించారు. చట్టబద్ధమైన యాజమాన్యాన్ని నిర్ధారించడానికి అధికారులు దాని మూలాలపై దర్యాప్తు చేస్తున్నారు. తూర్పు ఫ్లాండర్స్ ప్రాసిక్యూటర్ కార్యాలయానికి చెందిన హన్నే ఒల్లెవియర్ మాట్లాడుతూ ఆ బంగారం దొంగిలించింది కాదని లేదా నేరంతో సంబంధం లేదని దర్యాప్తు అధికారులు ముందుగా ధ్రువీకరించుకోవాలని అన్నారు.

అయితే, మున్ముందు ఇది సంక్లిష్టమైన వివాదానికి దారితీయవచ్చని ఆమె హెచ్చరించారు. భవన నిర్మాణ కాంట్రాక్టర్లు, సంక్షేమ సంస్థ, వాన్ అస్చే కుటుంబ ఈ నిధిపై హక్కులు కోరే అవకాశం ఉంది. బెల్జియన్ చట్టం ప్రకారం నిధిని కనుగొన్నవారు దాని అసలైన యజమానులు ముందుకు వచ్చే వరకు కనీసం ఐదేళ్లు వేచి ఉండాలి. ఇక కార్మికుల విషయానికొస్తే ఇంత పెద్ద నిధిని అప్పగిం చాల్సిందేనని తమకు తెలుసని కోబ్ అంగీకరిం చారు. అవి కొన్ని నాణేలు మాత్రమే అయితే పరిస్థితి వేరేలా ఉండేది కానీ బహుశా చివరికి మాకు ఏదో ఒకరకమైన బహుమతి లభిస్తుందేమో అని అతడు ఆశాభావం వ్యక్తం చేశాడు.

# పొంగి పొర్లుతున్న వారణాసి గంగానది

## బోట్ సర్వీసులు నిలిపివేయాలని ఆదేశాలు



**లక్నో, ఆగస్టు 16:** యూపీ, వారణాసి పరిధిలోని గంగానదిలో నీటి ప్రవాహం భారీగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో నదిలో బోటు సర్వీసుల్ని రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. భారీ నీటి ప్రవాహాన్ని, సందర్శకుల క్షేమాన్ని, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు వాటర్ పోలీస్ ఉన్నతాధికారులు ఏసీపీ దశాశ్వమేధ, డా.అతుల్ అంజాన్ త్రిపాఠిలు ప్రకటన జారీ చేశారు. బోటు నిర్వాహకులకు దీనిపై తగిన సూచనలు చేశారు. బోటు సేవల్ని నిలిపివేయడంపై అధికారులు మీడియాకు వివరించారు. ముందురోజు ఉదయానికి గంగానదిలో 64.70 మీటర్ల నీళ్లున్నాయి. ఈ నీళ్ల గంటలకు 6 సెంటీమీటర్ల మేర పెరుగుతున్నాయి. ఇది ప్రమాదకరమైన లోతు. నీటి ప్రవాహం కూడా ఎక్కువగానే ఉంది. వర్షాల కారణంగా నీటి ప్రవాహం పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో బోట్లు నడపడం అంత శ్రేయస్కరం కాదు. అందుకే బోటు సర్వీసుల్ని వెంటనే నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అందరు బోటు ఆపరేటర్లకు కూడా ఈ అంశంపై ఆదేశాలు జారీ చేశారు. సందర్శకులు కూడా నీటి లోపలికి వెళ్లకూడదని సూచించారు. అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో అధికారులు అక్కడి నీటి ప్రవాహాన్ని నిరంతరం గమనిస్తున్నారు. సందర్శకుల రక్షణ కోసం తగిన సూచనలు చేస్తున్నారు. వారి క్షేమమే తమ మొదటి కర్తవ్యమని అధికారులు వివరించారు. బోటు నిర్వాహకులు తమ ఆదేశాల్ని కచ్చితంగా పాటించాలని కోరారు. తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకు ఈ నిర్ణయం అమలవుతుందన్నారు. మరోవైపు బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా ఒడిశా సహా అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఐఎండీ తెలిపింది. ఒడిశాకు ఏకంగా రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఒడిశాతోపాటు ఏపీలోని ఉత్తర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈనెల 16నుంచి 18 వరకు వర్షాలు పడతాయని తెలిపింది.

# మహిమల పేరిట మోసం
# టాస్క్‌ఫోర్స్‌కు పట్టుబడ్డ ఆరుగురు నేరగాళ్లు



మహిమ గల పంచలోహ విగ్రహం, అరుదైన గులాబి రాయి పేరిట అమాయకులను మోసం చేస్తూ పట్టుబడ్డ నేరగాళ్లు

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** మహిమలు గల లక్ష్మీదేవి పంచలోహ విగ్రహంతో పాటు అరుదైన గులాబి రాయి వుందని, వీటివల్ల ఇంట్లో దివ్యశక్తులు వచ్చి సంపదలు సమకూరుతాయని అమాయకులను నమ్మిస్తూ నకిలీ వస్తువులను అమ్మేందుకు యత్నించిన ఆరుగురు నేరగా ళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి ఇత్తడి లక్ష్మీదేవి విగ్రహంతో పాటు గులాబి రంగు కలిగిన రా యి సహా మరికొన్ని వస్తువులను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ ఆదివారం మీ డియాకు వెల్లడించారు. శివార్లలోని లక్ష్మీగూడకు చెందిన నరసింహ (45) ఓ కారు డ్రైవర్. 2024లో వేములవాడలో రవి, బిక్షపతిల వద్ద ఇత ను పది లక్షల రూపాయలు చెల్లించి నకిలీ పంచలోహ విగ్రహం కొని మోసపోయాడు. దీని తరువాత తాను పోగొట్టుకున్న డబ్బులను ఎలా సంపాదించాలో తెలియక తన స్నేహితులైన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్‌కు చెందిన కేతావత్ రాజు అలియాస్ కట్టప్ప (38), (ఇతను మైలార్‌దేవుపల్లిలో వుంటున్నాడు), కాటేదాన్‌కు చెందిన వడత్య కుమార్ (34), ప్రవీణ్ సింగ్ (34),బసవ నరేష్ (38), చల్లా రవి (38) (ఇతను జ్యోతిష్యుడు)లతో కలిసి ఒక ముఠాను ఏర్పాటుచేశాడు. వీరితో కలిసి గతంలో తాను కొన్న నకిలీ పంచలోహ విగ్రహంతో పాటు నకిలీ గులాబిరాయిని ఎవరైనా అమాయకుడికి అంటగట్టి తన నష్టాన్ని భర్తీ చేసుకోవాలని, మరికొంత సంపాదించాలని నరసింహ పథకం రచించాడు. ఇం దులో భాగంగా శనివారం రాత్రి ఆరుగురు కలిసి లక్ష్మీగూడ వద్ద ఒక చోట ఇత్తడి లక్ష్మీదేవి పంచలోహ విగ్రహంతో పాటు నకిలీ గులాబి రంగు రాయితో ఒక వ్యక్తి కోసం వేచి వున్నారు. కాగా వీరి గురించి సమాచారం వున్న జూబ్లీహిల్స్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఒక్కసారిగా దాడిచేసి ఆరు గురిని పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి ఇత్తడి లక్ష్మీదేవి విగ్రహంతో పాటు నకిలీ గులాబి రంగురాయితో పాటు ఒక కారు, ఐదు సెల్‌ఫోన్లు, మూడురసాయనాల ద్రావకాల బాటిళ్లు జప్తు చేశారు. పట్టుబడ్డ నిందితులను తదుపరి విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు.

# నేను గర్వపడే దిమాగీ నక్సల్‌ను..
## కేంద్రమాజీ మంత్రి చిదంబరం పోస్టు



**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన దిమాగీ నక్సలిజం అంటే మేధో పరమైన నక్సలిజం వ్యాఖ్యలపై రాజకీయ దుమారం చెలరేగింది. ప్రధాని వ్యాఖ్యలకు కౌంటర్‌గా, తాను గర్వపడే దిమాగీ నక్సల్ అని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం ప్రకటించారు. ప్రధాని చేసిన వ్యాఖ్యల అనంతరం ఆదివారం ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "నేను గర్వపడే దిమాగీ నక్సల్‌ను!" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోడీ, దేశంలో సాయుధ నక్సలిజాన్ని బలహీనపరచడంలో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. అయితే, దిమాగీ నక్సలిజం రూపంలో ఒక కొత్త సవాల్ పొంచి ఉందని హెచ్చరించారు. "అడవుల్లో సాయుధ నక్సల్స్‌ను మనం వదిలించుకున్నాం. కానీ హింస, అశాంతిని సృష్టించడానికి దిమాగీ నక్సల్స్ అవకాశాల కోసం చూస్తున్నారు. వారు సమాజాన్ని తప్పుదోవ పట్టించాలనుకుంటున్నారు. ఈ దిమాగీ నక్సల్స్‌ను గుర్తించి, వారిని ఏకాకులను చేయాలి. యువతను ప్రధాన స్రవంతిలోకి తీసు కురావాలి" అని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. ప్రధాని వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. రాజకీయ ప్రత్యర్థులపై ప్రధాని మోదీ రెచ్చగొట్టే పదజాలాన్ని వాడుతున్నారని, ఇది ఆయనలోని రాజకీయ నిస్పృహను ప్రతిబింబిస్తోందని ఆరోపించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ప్రధాని వ్యాఖ్యలను తప్పుబట్టారు. గతంలో ఆయన ఉపయోగించిన అర్బన్ నక్సల్స్ పదాన్ని గుర్తుచేశారు. మొదట ఆయన తన ప్రత్యర్థులను అర్బన్ నక్సల్స్ అన్నారు. ఇప్పుడు దిమాగీ నక్సల్స్ అంటున్నారు. ఇది ఆయన నిరాశకు స్పష్టమైన సంకేతం" అని జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అంతేకాకుండా, అర్బన్ నక్సల్స్ లేదా దిమాగీ నక్సల్స్ అని ముద్ర వేసిన వారు డిమాండ్ చేసిన అనేక అంశాలను చివరికి ప్రధాని మోడీయే అమలు చేస్తుంటారని ఆయన ఆరోపించారు.

# వైభవంగా వరుణ యాగాలకు పూర్ణాహుతులు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 16, ప్రభాతవార్త :** సకల లోక కళ్యాణార్థం దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న వరుణ యాగాలకు ఆదివారం పూర్ణాహుతులతో స్వస్తి వచనాలు పలికారు. ఆగస్టు 14 నుండి అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన త్రయాహ్నిక "వరుణ యాగములు, వరుణ జపములకుమహా పూర్ణాహుతి నిర్వహించారు. ఈ వరుణ యాగా ముగింపు ఉత్సవాలలో ఆలయ వేదపాఠశాల విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

**నిత్యన్నదాన పథకానికి విరాళం:** కనకదుర్గమ్మ అమ్మవారి నిత్యఅన్నదాన విభాగానికి సత్తెనపల్లికి చెందిన దేవిశెట్టి నాగేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు మరియు కుటుంబ సభ్యులు ఆదివారం రూ. 1,00,116లు విరాళ మందించారు. విశాఖపట్నంకు చెందిన ఎస్. చక్రన్ శ్రీ షణ్ముఖ్ మరియువారి కుటుంబ సభ్యులు రూ.1,25,000లు ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్‌కు విరాళంగ అందించారు. విజయవాడకు చెందిన డివిఎస్ సాయిరాం మరియు వారి కుటుంబ సభ్యులు రూ.1,00,000లు విరాళమందించారు. విజయవాడకు చెందిన పి.రామయ్ లావణ్యదంపతులు రూ.1,00,000లు విరాళంగా సమర్పించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. ఆలయ ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు ఆదివారం పోరంకిలోని దేవస్థానం వేద పాఠశాల, గోశాలను సందర్శించారు. కొమరవోలులో వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ప్రతిష్ఠా మహోత్సవాలుఆలయ శిఖర కుంభాభిషేకం జరిగింది. ఈ సందర్భంగా దాత కాట్రగడ్డ రమేష్ దంపతులను దుర్గమ్మవారి ఆలయ ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు ఘనంగా సత్కరించారు.



**ఏపి డిజిపి దంపతులకు దుర్గమ్మవారి ప్రసాదమందిస్తున్న దృశ్యం**

**దుర్గమ్మవారి సేవలో ప్రముఖులు :** తెలుగు చిత్ర కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్, కొణిదెల నిహారిక శ్రీ అమ్మవారి దర్శనము చేసుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు.

**దుర్గమ్మవారి సేవలో ఏపి డిజిపి:** దుర్గమ్మవారిని రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఇఓ వి.కె. సీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు అమ్మవారి శేషవస్త్రం, పవిత్ర లడ్డు ప్రసాదం మరియు అమ్మవారి చిత్రపటం జ్ఞాపికను బహూకరించారు. సాంప్రదాయ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.

# శ్రావణ మాసంతో తగ్గిన చికెన్ ధరలు

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** శ్రావణ మాసం రాకతో చాలామంది నాన్ వెజ్ వంటకాలకు దూరంగా ఉంటున్నారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో చికెన్, కోడి గుడ్లకు డిమాండ్ భారీగా తగ్గిపోయింది. ఫలితంగా వీటి ధరలు రూ.100కు పడిపోయింది. గత నెలలో కిలో చికెన్ రూ.350 వరకు చేరుకోగా, ఒక్కో గుడ్డు ధర రూ.9 వరకు చేరుకుంది. కానీ ఇప్పుడు చికెన్‌తో పాటు గుడ్ల ధరలు కూడా పడిపోయాయి. గత కొద్ది రోజులలో ఈ రెండింటి ధరలు భారీగా పతనమయ్యాయి. గత నెలలో కిలో చికెన్ ధర రూ.340కి చేరుకోగా, ఇప్పుడు రూ.240 పలుకుతుంది. కొద్ది రోజుల్లోనే రూ.100 మేర పడిపోయింది. ఆదివారం హైదరాబాద్‌లో కిలో స్కిన్ లెస్ చికెన్ రూ.222 పలుకుతుండగా, డ్రస్డ్ చికెన్ రూ.197కి చేరుకుంది. ఇక రిటైల్ లైవ్ బర్డ్ రూ.127గా ఉండగా, ఎక్స్ ఫారం లైవ్ బర్డ్ రూ.100 వద్ద కొనసాగుతోంది. ఇక వరంగల్ డివిజన్‌లో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. ప్రాంతాలను బట్టి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చికెన్ ధరల్లో స్వల్ప మార్పులు ఉంటాయి. స్థానిక ఫామ్స్, రవాణా ఖర్చుల ఆధారంగా ధరల్లో మార్పులు ఉంటాయి.

# బూజు పట్టకుండా..



వర్షాకాలంలో తడిదనం, గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల వంటింటో ఉండే కొన్ని రకాల పదార్థాలు, స్నాక్స్.. వంటివి బూజు పడుతుంటాయి. ఇలా జరగకూడదంటే వాటిని నిల్వ చేసే విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాంరండి.

బయటి నుంచి కొని తెచ్చుకున్న స్నాక్స్ చాలవరకు ప్యాకెట్లలో పిల్వ చేస్తారు. అయితే వీటిని ఒక్కసారి తెరిచాక.. వాటిని అలాగే వదిలేస్తే.. అవి మెత్తగా అయిపోతాయి కొన్ని కొన్ని స్నాక్ ఐటమ్స్ జూజు పడతాయి కదా! కాబట్టి సాక్స్ ఇంట్లో చేసినా, బయటి నుంచి తెచ్చుకున్నా గాలి చొరబడని గాజు జార్లలో నిల్వ చేయడం మంచిది. వంటింట్లో నీటి వినియోగం ఎక్కువగా ఉండడం, తడిదనం వల్ల ఆ వాతావరణం ఎప్పుడూ తేమగా ఉంటుంది. తద్వారా క్రిములు, ఫంగస్..వంటివి వృద్ధి చెందే ప్రమాదం ఉంది. కాబట్టి నిల్వ చేసే పదార్థాలు, నిత్యావసర సరుకుల్ని తేమ లేని చోట భద్రపరచాలి. అలాగే తేమ చేరకుండా మధ్యమధ్యలో, కప్‌బోర్డ్ మూలల్లో సిలికాజెల్ ప్యాకెట్లను ఉంచాలి. తేమకు ఉప్పు, చక్కెర.. వంటివి గడ్డ కడతాయి. కాబట్టి ఈ రెండూ కలగలిసిన స్నాక్స్‌ని రెండు ఒకచోట నిల్వ చేయకుండా విడివిడిగా భద్రపరచడం వల్ల రుచి కోల్పోకుండా, మెత్తబడకుండా జాగ్రత్త పడచ్చు. తినగా మిగిలిన చపాతీలు, వేపుళ్లను అల్యూమినియం ఫాయిల్స్‌లో ప్యాక్ చేసి నిల్వ చేయడం వల్ల వాటి రుచి కోల్పోకుండా జాగ్రత్త పడవచ్చు. గోధుమ పిండి, శెనగపిండి.. వంటివి తేమ తగిలితే పాడవుతాయి.కాబట్టి వాటిని గాలి చొరబడని గాజు సీసాలో భద్రపరచి.. అందులో కొన్ని బిర్యాని అకుల్ని వేయాలి. తద్వారా ఈ ఆకులు ఏమాత్రం తేమ ఉన్నా పీల్చేసు కుంటాయి.



## 'గంగాదిత్యుడు'

కాశీ క్షేత్రం అనేక విశేషాలను సంతరించుకుని కనిపిస్తుంది. ఈ క్షేత్రంలో అడుగు పెట్టడమే పూర్వజన్మ సుకృతంగా భక్తులు భావిస్తుంటారు. ఇక్కడ చూడదగిన ప్రదేశాలలో సూర్య దేవాలయాలు కూడా కనిపిస్తాయి. ఒక్కో ఆలయంలోని సూర్య భగవానుడు ఒక్కో పేరుతో పిలబడుతూ ఉంటాడు. అలా సూర్యదేవుడు 'గంగాదిత్యుడు' అనే పేరుతో ఇక్కడ దర్శనమిస్తుంటాడు. ఇక్కడి 'లలితా ఘట్టం'లో స్వామి ఆలయం కనిపిస్తుంది.

అంశుమంతుడు ఆయన కుమారుడు దిలీపుడు గంగను భూలోకానికి తీసుకురావడానికి ఎంతగానో ప్రయత్నిస్తారు. చివరికి దిలీపుడు కుమారుడైన భగీరథుడు .. గంగను భూలోకానికి తీసుకొస్తాడు. తన వంశంలోని భగీ రథుడు చేసిన ఈ ప్రయత్నాన్ని అభినందించిన సూర్యభగవానుడు, ఇక్కడే గంగాదేవి ని స్తుతిస్తాడు. ఆ ప్రదేశంలోనే స్వామివారు 'గంగాదిత్యుడు' పేరుతో పిలవబడుతూ పూజలు అందుకుంటు న్నాడు. స్వామివారి దర్శనం వలన సమస్త పాపాలు నశిస్తాయని స్థల పురాణం చెబుతోంది.

**నిమిషంలో ఒక అమ్మాయి 19 సార్లు కళ్ల ఆర్పితే, అబ్బాయిలు 11 సార్లు మాత్రమే రెప్పవేస్తారట. అంతేకాదు, అమ్మాయిల కంటిపాప పెద్దగానూ ఉంటుందట.** ఆఫీసులో ఒత్తిడి తగ్గుతుందిలా.. మారిన జీవనశైలితో ప్రతి

# ఒత్తిడి తగ్గేలా !



ఒక్కరిపైనా పని ఒత్తిడి ఎక్కువ ఉంటోంది. అయితే, మగవారితో పోల్చి చూసినప్పుడు ఆడవాళ్లు ఎక్కువగా దీని బారిన పడుతుంటారు. ఈ విషయం తాజాగా యువర్ దోస్త్ అనే సంస్థ ఎమోషనల్ వెల్‌నెస్ స్టేట్ ఆఫ్ ఎంప్లాయీస్ పేరుతో 5000 మంది భారతీయ నిపుణులపై చేసిన సర్వేలో వెల్లడైంది. ఇదే కాదు మరెన్నో అధ్యయనాలూ ఈ విషయాన్నే చెబుతున్నాయి. కుటుంబ బాధ్యతలు, ఆఫీసు పనులు భారం మధ్య సమన్వయం చేసుకోవడంలో ఇబ్బందులు, ఇతరత్రా కారణాలు వంటివెన్నో ఒత్తిడికి కారణాలు. అయితే, ఈ పరిస్థితి నుంచి త్వరితగతిన బయటపడాలంటే.. విధులు నిర్వర్తించే వాతావరణం ఆహ్లాదంగా, సౌకర్యంగా ఉండాలి. ఒకవేళ అలా లేదంటే.. అందుకు తగ్గట్లు మార్చుకోండి. మొదట మార్చాలింది కుర్చీనే. ఎందుకంటారా?

వంగిపోయినట్లుగా కూర్చుంటే కాలక్రమంలో మీ భంగిమ మారుతుంది. వెన్నుపై ఒత్తిడి పెరిగి సయాటికా, స్పాండిలైటిస్ వంటి సమస్యల బారి పడే ప్రమాదం ఉంది. అందుకే, అది మీ వీపు భాగానికి ఆసరా ఇవ్వడంతో పాటు పాదాలు నేలను తాకాలని గుర్తుంచుకోండి. మీ డెస్ట్‌ఆప్‌ని క్లీన్‌చేయండి. ప్రతి ఫైల్‌నీ ఆర్గనైజ్ చేసుకోండి. ఇవన్నీ చిన్న విషయాల్లానే అనిపిస్తాయి కానీ ఎక్కువ ప్రభావం చూపిస్తాయి. కొందరు మహిళలు.. తమ శరీరానికి కావలసిన పోషకాలు అందుతున్నాయో లేదో సరిచూసుకోరు. ఇంకొందరు ఏది పడితే అది తినేస్తారు. ఇవన్నీ మీలో శక్తి స్థాయిల్ని తగ్గించేవే. ఈ తీరు ఒత్తిడితో పాటు మరికొన్ని అనారోగ్యాల బారినా పడేలా చేస్తుంది. అలాకాకుండా బ్యాగులో చిన్న చిన్న బాక్సుల్లో నట్స్, సీడ్స్ వంటివి పెట్టుకుంటే సరి. ఇవి మీలో ఎనర్జీ తగ్గనీయవు. క్రైస్ బారిన పడనివ్వవు. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా.. షార్ట్ బ్రేక్ తీసుకోండి. లేదంటే కండరాలు పట్టేస్తాయి. గంటకో సారైనా అటూ ఇటూ నాలుగడుగులు వేస్తే సరి. అయితే. అలాగని పదే పదే కాఫీ, టీలు తాగేయొద్దు. బదులుగా ఓ కప్పు వేణ్నీళ్లు లేదంటే నరగీన్‌టీ ఎంచుకోండి. వీటితో పాటు పనికి సరైన ప్రణాళిక వేసుని, వాటిని సకాలంలో పూర్తి చేసుకోవాలి. దీంతో పాటు శారీరక దృఢత్వాన్నీ, మానసిక బలాన్నీ పెంచుకోవడానికి యోగా, ధ్యాననం వంటివి చేయాలి.

# డాక్టర్ మిస్ క్వీన్



భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళా వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలనే సంకల్పం. ఆమెను కళా రంగానికి పరిచయం చేసింది. హైదరాబాద్‌కు చెందిన డా. సనా ఖయ్యూం. విద్య, కళలు, వ్యక్తిత్వ వికాసాన్ని మేళవిస్తూ నిర్వహించే సౌందర్య పోటీలు ఫ్యాషన్ ఈవెంట్లలో విభిన్న కార్యక్రమాల్లో పాల్గొంటుండటం ఆసక్తి. ఆమెను మిస్ యూనివర్స్ ఫైనలిస్ట్ స్థాయికి చేర్చింది. తాజాగా పెగాసస్ గ్లోబర్ ప్రైవేట్ లిమిటెడ్ కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో నిర్వహించిన సౌందర్య పోటీల్లో వారికి చే'మిస్ క్వీన్' అవార్డును దక్కించుకొంది. అందం, ఆత్మవిశ్వాసం. వ్యక్తిత్వ వికాసమే ఆలంబనగా నిర్వహించిన ప్రతిష్టాత్మక పోటీలలో డా.సనా టైటిల్‌ను గెలుచుకున్నారు. మిస్ ఇండియా గ్లామ్‌వరల్డ్ 2026 పౌర్ణమి మురళి నుండి 'మిస్ క్వీన్' టైటిల్ అందుకున్నారు. కళల్లోనూ వైద్య విద్యార్థిగా, శాస్త్రీయ నృత్య కళాకారిణిగా, కర్ణాటక సంగీత సాధకురాలిగా, అందాల పోటీలలో ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతోందామె.

## అటుకుల బూరెలు



బియ్యప్పిండితో చేసే బూరెలు అందరికీ తెలుసు కానీ.. అటుకులతో చేసినవి ఎప్పుడూ తిని ఉండరు కదూ! మరి అటుకుల బూరెలు రుచి చేసి చూదాం. ఎంతో సులువుగాచేసే ఈ బూరెలు మహా రుచిగా ఉంటాయి.

కావలసినవి : కప్పు అటుకులకు అర కప్పు బెల్లం, చారెడు గోధుమ పిండి, పావు చెంచా యాలకుల పొడి, రెండు స్పూన్ల నెయ్యి, వేయించేందుకు నూనె అవసరమౌతాయి.

తయారీ: అటుకులను కచ్చాపచ్చా దంచాలి. బెల్లం కరిగించి.. అందులో అటుకులు, గోధుమ పిండి, యాలకుల పొడి, నెయ్యి వేయాలి. సన్న సెగ మీద ఉండలు కట్టకుండా కలియ తిప్పుతూ రెండు నిమిషాలయ్యాక దించేయాలి. ఈ మిశ్రమాన్ని చల్లారనిచ్చి.. చిన్న ఉండలుగా చేసి బూరెలుగా ఒత్తుకునికాగిన నూనెలో బంగారు రంగు వచ్చేదాకా వేయించి తీయాలి. అంతే అటుకుల చిట్టి బూరెలు తయారైపోతాయి.

## మెడ మెరిసేన్

ముఖం అందంగా కనిపించడం కోసం ఎన్నో రకాల క్రీములు, ప్యాక్‌లు వాడతాం.కానీ మెడ భాగానికొచ్చేసరికి నిర్లక్ష్యం చేస్తుంటాం. ఇరవైల్లో పెద్దగా తేడా తెలియకపోయినా.. వయసు పెరిగేకొద్దీ ఆ ప్రభావం మెడ మీద బాగా కనిపిస్తుంది. మెడ చుట్టూ నల్లటి వలయం, సన్నటి ముడతలు, చిన్న చిన్న పొక్కులతో క్రమంగా చర్మం కాంతి విహీనంగా తయారవుతుంది. ఇలాంటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మెడ సౌందర్యాన్ని తిరిగి పెంపొందించుకోవచ్చు. అవేంటో తెలుసుకుందాం..

**ఇలా శుభ్రపరచుకోవాలి..** ముఖంపై ఉండే చర్మం కన్నా మెడ చర్మం చాలా పల్చగా, సున్నితంగా ఉంటుంది. అందుకని ఎక్కువ గాఢత కలిగిన సబ్బులను వాడకూడదు. వీలైనంత వరకు రసాయనాలు లేని సబ్బు/బాడీ వాష్‌లను వాడాలి. అంతేకాదు.. ముఖాన్ని శుభ్రం చేసుకునే ప్రతిసారీ మెడను కూడా శుభ్రం చేసుకోవడం అలవాటు చేసుకోవాలి.

**స్క్రబ్ వాడాలి ....** చెమట వల్ల మెడపై చాలా త్వరగా మురికి చేరుతుంది. అంటేకాదు నిత్యం మనం ధరించే చెయిన్ల వల్ల కూడా మెడ పైన మురికి పేరుకునే అవకాశం ఉంది. సబ్బుతో పైపై మురికి పోయినా, చర్మ రంధ్రాల్లో పేరుకున్న మలినాలు పోవాలంటే స్క్రబ్బర్ తప్పని సరి. ఆ జరగకుండా ఉండాలంటే మనం వేసుకునే చెయిన్లను శుభ్రంగా ఉంచుకోవాలి. వారానికి నాలుగుసారునఉల స్క్రబ్బర్ వాడాలి. బాదం పలుకులని బరకగా పొడి చేసి,



కొద్దిగా పాలుకలిపి పేస్ట్‌లా చేసి మెడకు పట్టించాలి. భుజాల నుంచి ముఖం వైపుగా ఐదు నిమిషాల పాటు స్క్రబ్ చేసి, చల్లటి నీటితో కడగేయాలి. ఐదు నిమిషాలకు మించి స్క్రబ్ చేయకూడదు. ఎందు కంటే అతిగా స్క్రబ్ చేయడం వల్ల పల్చని మెడ చర్మం దెబ్బతినే ప్రమాదం ఉంది.

**నెక్ ప్యాక్ !..** ఫేస్ ప్యాక్ వాడుతున్న ప్రతిసారీ మెడకి కూడా ప్యాక్ వేసుకోవడం తప్పనిసరి. బాగా పండిన అరటి పండు లేదా గుమ్మడి పండు, బొప్పాయి గుజ్జుతో ప్యాక్ వేసుకుని 20 నిమిషాల తర్వాత కడిగేయాలి. వారానికోసారి ఫ్రూట్ ప్యాక్‌లను వాడటం వల్ల చర్మం కాంతివంతంగా తయారవుతుంది. పాలమీగడలో పావు చెంచా నిమ్మరసం, చిటికెడు పసుపు కలిపి మెడకు పట్టించాలి. 20 నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేసే మెడ చుట్టూ పేరుకున్న నలుపు క్రమంగా తగ్గుతుంది.

**టోనింగ్...** ముఖంపై చర్మానికి టోనర్ వాడేప్పుడు మెడకు కూడా టోనర్ అప్లై చేయడం అలవాటు చేసుకోవాలి. కానీ మెడకి టోనర్ రాసుకునేప్పుడు నేరుగా చేతి వేళ్లతో కాకుండా దూదిని వాడాలి.

# 'విశ్వనాథ్ & సన్స్'కి నిజమైన హీరోలు ప్రేక్షకులే



## మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్

తమిళ అగ్ర కథానాయకుడు సూర్య నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ & సన్స్'. ప్రతిభ గల దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమితా బైజు కథానాయికగా నటించారు. రాధిక శరత్‌కుమార్, రవీనా టాండన్ కీలక పాత్రలు పోషించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు.

త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. "ఈ కథ విన్నప్పటి నుంచే, ఈ సినిమా నా హృదయానికి చాలా దగ్గరైంది. ఇలాంటి సమయంలో ఒక కుటుంబ కథా చిత్రం చేసి, దానిని విజయవంతం చేసినందుకు చిత్ర బృందం మొత్తానికి అభినందనలు. నేను సూర్యతో ఒక సినిమా చేయాలి. ఆయనకు నచ్చే కథ ఇంకా చెప్పలేకపోయాను (నవ్వుతూ). త్వరలోనే మేమిద్దరం కలిసి పని చేస్తామని నమ్ముతున్నాను' అన్నారు. కథానాయకుడు సూర్య మాట్లాడుతూ "మీరు చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతలు చెప్పడానికి మాటలు కూడా సరిపోవడం లేదు. త్రివిక్రమ్ గారు ఈ వేడుకకు రావడం చాలా సంతోషంగా ఉంది. ఆయన రాకతో ఇది మరింత ప్రత్యేకంగా మారింది' అన్నారు. నటి రవీనా టాండన్ మాట్లాడుతూ "విశ్వనాథ్ & సన్స్' సక్సెస్ వేడుకలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాపై ప్రేమను కురిపిస్తూ, ఇంతటి విజయానికి కారణమైన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అన్నారు. దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. "ఈ కథ రాసినప్పుడు ట్రెండ్ ఇది కాదు. యాక్షన్, డార్క్ హ్యూమర్, హారర్, డివోషనల్ లాంటి సినిమాల ట్రెండ్ నడుస్తుంది. ఇలాంటి సమయంలో ఫ్యామిలీ సినిమా చేస్తానంటే, ఎవరైనా నిరుత్సాహ పరుస్తారు. కానీ, వంశీ అలా చేయలేదు. త్రివిక్రమ్ కూడా నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. ఆయన మద్దతు లేకుండా ఇది సాధ్యమయ్యేది కాదు' అన్నారు.

తెర



# 'అ' ఫస్ట్‌లుక్ విడుదల

ప్యాషనేట్ ప్రొడక్షన్ హౌస్‌లు స్టార్ బాక్స్ స్టోరీస్, రిప్పుల్ స్లైడ్ స్టూడియోస్ తొలిసారిగా ఓ ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. రాహుల్ విజయ్, అర్చన అయ్యర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని కనకరావు తొనంగి, అభిషేక్, ప్రముఖ ఎడిటర్‌డైరెక్టర్ గ్యారీ నిర్మిస్తున్నారు. సాయి బాలి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం త్వరలోనే గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి 'అ' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను హిట్ మెషీన్ అడివి శేష్ ఆవిష్కరించారు. టైటిల్‌ను ఇంట్రెస్టింగ్‌గా ప్రజెంట్ చేయడంతో విడుదలైన వెంటనే అందరి దృష్టిని ఆకర్షించింది. టైటిల్ చుట్టూ 'అమ్మాయి, అదృశ్యం, అన్వేషణ' అనే పదాలను పొందుపరిచారు. ఆలోచింపజేసే పదాలతో రూపొందించిన ఈ ఇంట్రెస్టింగ్ టైటిల్ డిజైన్ విడుదలకు ముందే సినిమాపై ఆసక్తిని పెంచింది. ఇక ఫస్ట్ లుక్ ఈ క్యూరియాసిటీని మరింత పెంచింది. రాహుల్ విజయ్ ఓ ప్రదేశంలో చేతిలో లాఠీ పట్టుకుని కూర్చుని కనిపిస్తున్నారు. ఆయన చుట్టూ నేలంతా రక్తపు మరకలతో కనిపిస్తోంది. ఈ ఇంటెన్స్ విజువల్‌కు బ్యాక్‌గ్రౌండ్‌లో చార్మినార్ కనిపించడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. దీంతో ఈ థ్రిల్లర్ కథ హైదరాబాద్ నేపథ్యంగా సాగుతుందని అర్థమవుతోంది. రాహుల్ విజయ్ స్ట్రైకింగ్ లుక్, ఫస్ట్ లుక్‌లో కనిపిస్తున్న డార్క్ అండ్ సస్పెన్స్‌ఫుల్ వాతావరణం సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. అర్చన అయ్యర్ రాహుల్ విజయ్ సరసన కథానాయికగా నటిస్తున్నారు. సాయి బాలి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తుండగా, మోనిష్ భూపతి రాజు సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. అభినవ్ వి. కునపరెడ్డి కోప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తూ ఎడిటింగ్ బాధ్యతలను గ్యారీ తీబీతో కలిసి నిర్వహిస్తున్నారు. త్వరలోనే 'అ' గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది.

# 'డార్క్ చాక్లెట్' నుంచి సాంగ్ లాంచ్



రానా దగ్గుబాటి, స్పిరిట్ మీడియా, వాల్టెయిర్ ప్రొడక్షన్స్‌తో కలిసి 'డార్క్ చాక్లెట్' చిత్రాన్ని సగర్వంగా అందిస్తున్నారు. విశ్వదేవ్ రాచకొండ, బిందు మాధవి లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో విశ్వదేవ్ మాట్లాడుతూ.'కల్లో కల్లోలం' పాట ఈ సినిమాలో చాలా ముఖ్యమైన సందర్భంలో వస్తుంది. ఈ సాంగ్ సినిమాకు చాలా ఇంపార్టెంట్. వివేక్ సాగర్ చాలా అద్భుతమైన ట్యూన్ ఇచ్చారు. ఇందులో లిరిక్స్ విషయంలో చాలా పర్టిక్యులర్‌గా ఉంటారు' అన్నారు.

డైరెక్టర్ శశాంక్ మాట్లాడుతూ 'కల్లో కల్లోలం' పాటలో ఈ సినిమా కథంతా నిక్షిప్తమై ఉంది. కాకపోతే అది అంత ఈజీగా పట్టుకోలేం. చాలా ఇంట్రెస్టింగ్ సిట్యువేషన్‌లో ఈ పాట వస్తుంది. ఈ పాటకు వివేక్ సాగర్ తప్ప మరొకరు మ్యూజిక్ చేయలేరనేది నా స్ట్రాంగ్ ఫీలింగ్. ఈ సినిమాకు మ్యూజిక్ చేయడం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది' అన్నారు. బిందు మాధవి మాట్లాడుతూ.. 'నాకు వివేక్ సాగర్ మ్యూజిక్ అంటే చాలా ఇష్టం. ఈరోజు ఆయన చేసిన మ్యూజిక్‌లో నేను వర్క్ చేయడం చాలా ఆనందంగా ఉంది. 'డార్క్ చాక్లెట్'లో ఫుల్ లెంగ్త్ క్యారెక్టర్ చేశాను అన్నారు. డైరెక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఇందులో విశ్వదేవ్ వర్సటాలిటీ కనిపిస్తుంది' అన్నారు. వివేక్ సాగర్ మాట్లాడుతూ 'ఏదైనా సరే కథతోనే మ్యూజిక్ వస్తుంది. శశాంక్ చాలా అద్భుతమైన ఐడియాతో వచ్చారు' అన్నారు.

# 'ధరణి ఐ లవ్ యూ' పోస్ట్ ప్రొడక్షన్ పనులు



హెచ్‌ఎస్‌పీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్.ఎస్.రాజమౌళి, పరుచూరి మురళి, దేవిప్రసాద్ వంటి దర్శకుల వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసి మొదటగా 'అనగనగా ఒక ఊళ్ళో' చిత్రానికి దర్శకత్వం వహించిన సాయి కృష్ణ కె.వి దర్శకత్వంలో రాజశేఖర్ మద్దికుంట నిర్మిస్తున్న తాజా చిత్రం 'ధరణి ఐ లవ్ యూ' షూటింగ్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. బొమ్మరాశిపేట, ఎల్లగూడ, ఉద్దమర్రి, లాల్గాడిమలక్‌పేట్, శామీర్‌పేట్, తూప్రాన్, వెంకటరత్నాపురం తదితర ప్రాంతాల్లోని అందమైన లొకేషన్లలో చిత్రీకరణను పూర్తి చేసినట్లు చిత్రబృందం వెల్లడించింది. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆసక్తికరమైన కథనం, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో 'ధరణి ఐ లవ్ యూ'ను మంచి కుటుంబ కథా చిత్రంగా రూపొంది స్తున్నామని దర్శక, నిర్మాతలుతెలిపారు. ప్రేమ, కుటుంబ అనుబంధాలుతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా సినిమాను తెరకెక్కించినట్లు చెప్పారు.. ఈ చిత్రంలో ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ఆర్.పి.పట్నాయక్ ఒక సెంటిమెంట్ సాంగ్ పాడటం జరిగింది అన్నారు.

# '2కె లవర్స్' ప్రారంభం



ఎం బి ప్రొడక్షన్ హౌస్ బ్యానర్ మీద రాజేష్ నాయుడు దర్శకత్వంలో బిచ్చు నాయక్ నిర్మిస్తున్న ప్రొడక్షన్ నెం.1 '2కె లవర్స్' పూజా కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సినిమాలో మోహిత్ పెడాడ, శృతి శంకర్, సాయి కుమార్, తనికెళ్ల భరణి, ప్రణీత్ రెడ్డి, సప్తగిరి, రచ్చ రవి, మొట్టా రాజేంద్రన్, రమ్య పొందూరి, సూర్య, శివన్నారాయణ, ఆమని తదితరులు ముఖ్య పాత్రలను పోషించబోతున్నారు. ఈ మూవీకి రసూల్ భాయ్ కథను అందించారు. ఈ చిత్ర ప్రారంభోత్సవానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, తనికెళ్ల భరణి, వీఎన్ ఆదిత్య ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముహూర్తపు సన్నివేశానికి వీఎన్ ఆదిత్య క్లాప్ కొట్టగా, మణిశర్మ గౌరవ దర్శకత్వం వహించారు. తనికెళ్ల భరణి స్క్రిప్ట్ అందజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం.. దర్శకుడు రాజేష్ నాయుడు మాట్లాడుతూ ..'రసూల్ అద్భుతమైన కథను ఇచ్చారు. తెలంగాణ నేపథ్యంలో సాగే అందమైన ప్రేమ కథతో పాటు, ఎమోషన్స్‌తో సినిమాని రూపొందిస్తున్నాం. ఆద్యంతం వినోదభరితంగా మూవీ ఉంటుంది' అన్నారు. నిర్మాత బిచ్చు నాయక్ మాట్లాడుతూ ..'ఈరోజు మా ఎం.బి. ప్రొడక్షన్స్‌హౌస్ ప్రారంభించడం ఆనందంగాఉంది. రాజేష్ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. తెలంగాణ యాసలో ఇది వరకు చూడని ప్రేమ కథ, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో సినిమా ఉండబోతోంది' అన్నారు.రచయిత రసూల్ మాట్లాడుతూ 'ఎం.బి. ప్రొడక్షన్స్‌లో తెరకెక్కించబోతోన్న ఈ'2కె లవర్స్' ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మేం తీయబోతోన్న ఈ ప్రేమ కథను అందరూ ఆదరిస్తారు.' అని అన్నారు.హీరో మోహిత్ మాట్లాడుతూ 'ఎంబి ప్రొడక్షన్స్‌లో వస్తున్న ఈ '2కె లవర్స్' చిత్రంలో నాకు అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. ఇదొక కొత్త ప్రేమకథ. రెగ్యులర్‌సినిమాల్లా మాత్రం ఉండదు' అన్నారు. హీరోయిన్ శృతి శంకర్ మాట్లాడుతూ 'ఎంబి ప్రొడక్షన్స్‌లో వస్తున్న ఈ'2కె లవర్స్'లో ఎంతో ఎమోషన్ ఉంటుంది' అన్నారు.



# 'అమీర్ లోగ్' అందరికీ కనెక్ట్ అవుతుంది

'అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మించిన ఈ మూవీకి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకి మనోహర్ రెడ్డి మంచురి సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంలో ఎంసి హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రల్లో నటించగా.. వేధా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయోగి కీలక పాత్రలు పోషించారు. రానా దగ్గుబాటి సంస్థ 'స్పిరిట్ మీడియా' ఈ మూవీని తెలుగులో ఆగస్ట్ 21న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోంది. ఈ క్రమంలో ప్రమోషన్స్‌లో భాగంగా ప్రధాన పాత్రధారులు ఎంసి హరి, మనోజ్, శశిధర్ చిత్ర విశేషాల్ని పంచుకున్నారు. 'అమీర్ లోగ్' ఎంతో నేచురల్‌గా ఉంటుంది. సినిమాని చూసినట్టుగా ఉండదు. హైదరబాద్ బస్తీలోకి వెళ్లినట్టుగా, ఆబస్తీల్లో జీవిస్తున్నట్టుగా అనిపిస్తుంది. మేం బస్తీల్లోనే పెరిగాం. తెలంగాణ యాస, బస్తీ లైఫ్ కథ అవ్వడంతో మాకు చాలా సులభంగా మారింది. 'అమీర్ లోగ్' చిత్రంలో బిర్యానీ అనేదే మెయిన్ పాయింట్. ఆ బిర్యానీ చుట్టూనే మా పాత్రలు తిరుగుతాయి. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉంటుంది. మా సినిమా అంతా కూడీ ఫీమేల్ సెంట్రిక్‌గా ఉంటుంది. 'అమీర్ లోగ్' అవుట్ పుట్ చూశారు కాబట్టే మా దర్శకుడు రమణన్న గారు అంత కూల్‌గా ఉంటున్నారు. సినిమా చూశాక మా అందరికీ ఎంతో కాన్ఫిడెంట్ వచ్చింది. రానా టీం మా సినిమాని చూసింది. హైదరాబాద్‌లో ముందు ఫోకస్ పెట్టండి. ఆ తర్వాత అన్ని ఏరియాల్లో కవర్ చేయండని రానా చెప్పారు.మా సినిమాలోని ఎమోషన్‌ను స్మరణ్ మ్యూజిక్ మరో స్థాయికి తీసుకు వెళ్లింది. ఆయన పాటలే ఈ చిత్రానికి ప్రాణం. ఆయన ఇచ్చిన మ్యూజిక్, ఆర్ఆర్‌తో సినిమా నెక్స్ట్ లెవెల్‌కి వెళ్లింది. రెగ్యులర్ తెలుగు సినిమాల్లో ఉండేలా కాకుండా ఇందులో హిందీ ఎక్కువగా ఉంటుంది. తెలంగాణ, హైదరాబాద్ అంటే తెలీకుండానే కొన్ని పదాల్లో హిందీ, ఉర్దూ వచ్చేస్తుంది. మరీ హై లెవెల్లో కాకుండా సాధారణ జనాలకు అర్థమయ్యేలానే భాషను వాడాం. ఇక్కడి భాషకి, యాసకి అడ్రెస్‌లా మా 'అమీర్ లోగ్' సినిమా ఉంటుంది. భాష, యాసతో సంబంధం లేకుండా ఎమోషన్స్‌తో తీసిన ఈ చిత్రం అందరికీ కనెక్ట్ అవుతుంది. అన్నారు.



## మహిళల హాకీ వరల్డ్ కప్ ఆరంభ మ్యాచ్‌లో
# చైనాతో భారత్ డ్రా

**నెదర్లాండ్స్:** మహిళల హాకీ ప్రపంచ కప్ 2026 లో చైనా, భారత్ జట్లు డ్రా చేసుకున్నాయి. ఆదివారం నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టెల్వీన్‌లోని వాగెనర్ స్టేడియంలో జరిగిన మహిళల హాకీ ప్రపంచ కప్, గ్రూప్ డి ఆరంభ మ్యాచ్‌లో భారత్, చైనా జట్లు 2-2తో డ్రా చేసుకున్నాయి. ఈ మ్యాచ్‌లో భారత్ రెండు సార్లు ఆధిక్యంలోకి వెళ్లినా ఒలింపిక్ రజత పతక విజేత చైనా ప్రతీసారీ పుంజుకుని స్కోరును సమం చేసింది. మ్యాచ్ ప్రారంభం నుండే భారత్ దూకుడు ప్రదర్శించింది. 8వ నిముషంలో నవనీత్ కౌర్ గోల్ చేయడంతో భారత్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే తొలి క్వార్టర్ ముగిసే సమయానికి చైనా తిరిగి పుంజుకుంది. 15వ నిముషంలో జాంగ్ గోల్ చేయడంతో స్కోర్ 1-1గా సమమైంది. రెండో క్వార్టర్‌లో భారత్ మరోసారి ఆధిక్యంలోకి వచ్చింది. 25వ నిముషంలో దీపిక గోల్ చేయడంతో భారత్ 2-1తో ముందంజ వేసింది. భారత్ ఆధిక్యాన్ని కాపాడుకుంటూ విజయంపై ఆశలు పెట్టుకున్న సమయంలో చైనా మరోసారి ఎదురుదాడి చేసింది. 39వ నిముషంలో మా నింగ్ గోల్ చేయడంతో స్కోర్ 2-2గా మారింది. ఆ తర్వాత ఇరు జట్లు గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ మరో గోల్ రాకపోవడంతో చివరకు మ్యాచ్ డ్రా గా ముగిసింది. దీంతో చైనాతో పాయింట్లు పెంచుకున్న భారత్ పూల్ డి లో తదుపరి మ్యాచ్ కీలకంగా మారింది. ఈ నెల 18న దక్షిణాఫ్రికాతో భారత్ జట్టు తలడనుంది.



# స్విస్ లేడీస్ ఓపెన్‌లో కట్ సాధించిన ఏకైక భారత్ క్రీడాకారిణి ప్రణవి

**స్విట్జర్లాండ్:** స్విస్ లేడీస్ ఓపెన్‌లో హాఫ్‌వే కట్‌ను దాటిన ఏకైక భారతీయ గోల్ఫర్‌గా ప్రణవి ఉర్స్ నిలిచింది. అలాగే రెండో రౌండ్‌లో విభిన్నమైన ప్రదర్శనల తర్వాత భారత్‌కే చెందిన త్వేసా మాలిక్, దీక్షా దాగర్ టోర్నమెంట్ నుండి నిష్క్రమించారు. గోల్ఫ్‌పార్క్ హోల్జ్‌హౌసెర్న్‌లో ఆదివారం జరిగిన రెండు-అండర్ 70తో ప్రారంభించిన ప్రణవి, మరో రెండు-అండర్ 69 స్కోరు చేసి, మొత్తం మూడు -అండర్ 139 స్కోరుతో వారాంతంలోకి ప్రవేశించే ముందు 28వ స్థానంలో నిలిచింది. త్వేస తన తొలి రౌండ్‌లోని 72 స్కోరును మెరుగుపరుచుకుని వన్-అండర్ 71 స్కోరు చేసినప్పటికీ, వన్‌ఓవర్ పార్‌తో ముగించి, ఒక్క స్ట్రోక్ తేడాతో కట్‌ను కోల్పోయింది. ప్రణవి, త్వేసల మాదిరిగానే దీక్ష, తొలి రౌండ్‌లోని 71 స్కోరు తర్వాత 78 స్కోరు చేసి, సెవెన్ ఓవర్‌తో ముగించింది. స్వీడన్‌కు చెందిన కైసా ఆర్వెఫ్యాల్, 64 స్కోరుతో ప్రారంభించి, బోగీ రహిత 66 స్కోరుతో టోర్నమెంట్‌పై తన పట్టును మరింత బలపరుచుకుంది. ఆమె సాధించిన 12 అండర్ మొత్తం ఆమెకు మూడు షాట్ల ఆధిక్యాన్ని ఇస్తుంది. అలాగే ఆర్వెఫ్జాల్ తన రెండవ రౌండ్‌ను బ్యాక్ నైన్‌లో ప్రారంభించి, పార్‌ఫోర్ 10వ హోల్‌లో బర్డీ సాధించి, ఆ తర్వాత వరుసగా ఎనిమిది పార్స్ చేసింది. అనంతరం ఫ్రంట్ నైన్‌లో మొదటి, రెండవ, నాల్గవ మరియు ఏడవ హోల్స్‌లో మరో నాలుగు బర్డీలు సాధించి స్పష్టమైన ఆధిక్యాన్ని సంపాదించింది.

# ఆసియా కప్: భారత్‌తో పోరుకు పాక్ రెడీ



**న్యూఢిల్లీ:** భారత్, పాకిస్తాన్ మహిళల క్రికెట్ జట్లు వచ్చే నెల ప్రారంభంలో తలపడనున్నాయి. ఈ మ్యాచ్ టీ20 ఆసియా కప్‌లో భాగంగా జరగనుంది. మహిళల ఆసియా కప్ ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. గ్రూప్ ఎ లో పాకిస్తాన్‌తో పాటు హాంకాంగ్‌చైనా, భారత్, థాయిలాండ్ ఉన్నాయి. పాకిస్తాన్ తమ ఆసియా కప్ ప్రయాణాన్ని సెప్టెంబర్ 1న థాయిలాండ్‌తో ప్రారంభించనుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 5న ఏడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్‌తో, సెప్టెంబర్ 7న హాంకాంగ్‌చైనాతో తలపడనుంది. ఈ టోర్నమెంట్ సెమీఫైనల్స్ సెప్టెంబర్ 10, 11 తేదీలలో జరగనుండగా, ఫైనల్ సెప్టెంబర్ 13న జరగనుంది. దీనికోసం పాకిస్తాన్ తన జట్టును ప్రకటించింది. 2026 ఆసియా క్రీడల కోసం పాకిస్తాన్ 15 మంది సభ్యులతో కూడిన మహిళల క్రికెట్ జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు ఫాతిమా సనా నాయకత్వం వహించనుంది. లెఫ్టార్మ్ స్పిన్నర్ సాదియా ఇక్బాల్, బ్యాటర్ గుల్ ఫిరోజా కూడా పాకిస్తాన్ టీ20 జట్టులోకి తిరిగి వచ్చారు. సాదియా శ్రీలంక పర్యటనలో భాగం కాలేదు.

కాగా గుల్ ఫిరోజాను ఇటీవలి టీ20 మ్యాచ్‌ల నుంచి తప్పించినప్పటికీ పర్యటనలోని వన్డే సిరీస్‌లో ఆడింది. జపాన్‌లోని ఐచినగోయాలో జరిగే ఆసియా క్రీడల జట్టు నుంచి సాదియా, వహీదా అక్తర్, నజీహా అల్విలను తొలగించి, వారి స్థానంలో అలియా రియాజ్, తస్మియా రుబాబ్, హుమ్నా బిలాల్‌లను తీసుకున్నారు. అయితే స్టార్ పేసర్ డయానా బేగ్‌ను రెండు జట్ల నుంచి తొలగించారు. ఆమె పేరు రిజర్వ్ జాబితాలో కూడా లేదు.



# ఆస్ట్రేలియాకు షాక్
## 23 యేళ్ల తర్వాత బంగ్లా సంచలన విజయం

**డార్విన్:** బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. ఆస్ట్రేలియా గడ్డపై ఆ జట్టును ఓడించింది. నాల్గో రోజు రెండో సెషన్ ఆదివారం జరిగిన ఏకంగా 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. తద్వారా 23ఏళ్ల తరువాత సంచలన విజయాన్ని నమోదు చేసింది. ఫలితంగా రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌కు గాను 1-0తో బంగ్లాదేశ్ ఆధిక్యంలో ఉంది. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఎంచుకోగా, ఆ జట్టు బ్యాటర్లకు అద్భుత బంతులతో బంగ్లాదేశ్ బౌలర్లు చుక్కలు చూపించారు. దీంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 198 పరుగులకే ఆలౌటైంది. బంగ్లాదేశ్ బౌలర్ హసన్ మహ్మద్ 6 వికెట్లు పడగొట్టాడు. అతని దెబ్బకు ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలింది. ఆ తరువాత తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ జట్టు 426 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ బ్యాటింగ్‌లో తంజిద్ హసన్ శతకంతో మెరిశాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాపై బంగ్లాదేశ్ జట్టుకు 228 పరుగుల ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా బ్యాటింగ్‌లో కామెరాన్ గ్రీన్ ఒంటరి పోరాటం చేశాడు. అతను 104 పరుగులతో శతకం సాధించాడు. అయితే మరో ఎండ్‌లో సహచరుల నుంచి తగిన సహకారం లభించలేదు. ఫలితంగా ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే ఆలౌటైంది. దీంతో బంగ్లాదేశ్ ముందు విజయానికి కేవలం 57 పరుగుల లక్ష్యం మాత్రమే నిలిచింది. చిన్న లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్‌కు ఆస్ట్రేలియా బౌలర్లు పెద్దగా సవాలు విసరలేకపోయారు. బంగ్లాదేశ్ కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 57 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. మోమినుల్ హక్ విజయ బౌండరీ సాధించడంతో బంగ్లాదేశ్ చారిత్రక విజయాన్ని ఖాయం చేసుకుంది. 2003లో డార్విన్‌లోనే ఆస్ట్రేలియాతో బంగ్లాదేశ్ తొలి టెస్టు ఆడింది. ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా భారీ విజయాన్ని సాధించింది. ఇప్పుడు అదే డార్విన్‌లో బంగ్లాదేశ్ చరిత్ర తిరగరాసింది. ఈ విజయం బంగ్లాదేశ్ టెస్టు చరిత్రలోనే అత్యంత ప్రత్యేకమైన విజయాల్లో ఒకటిగా నిలిచింది. ఆస్ట్రేలియాపై వారి టెస్టు విజయాల సంఖ్య రెండుకు చేరింది. అంతకుముందు 2017లో స్వదేశంలో ఆస్ట్రేలియాను బంగ్లాదేశ్ ఓడించింది.

# శ్రీలంకతో రెండో రోజు ముగిసిన ఆట
## టీమిండియా 460 పరుగుల భారీ స్కోర్



**న్యూఢిల్లీ:** గాలే వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ ఆధిపత్యం కొనసాగుతోంది. అయితే తొలి రోజే పటిష్ట స్థితిలో నిలిచిన భారత జట్టు రెండో రోజు ఆదివారం తడబడింది. దీనికి తగినట్లుగా వర్షం కారణంగా రెండో కేవలం 43 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. దేవ్‌దత్ పడిక్కల్(167) భారీశతకంతో మెరిసినా, మిడిలార్డర్ బ్యాటర్లు చేతులెత్తేశారు. వర్షం ప్రభావంతో శ్రీలంక బౌలర్లు పుంజుకోవడంతో స్కోర్ వేగం తగ్గింది. అయితే టీ సెషన్‌లో ధ్రువ్ జురెల్(51), మానవ్ సుతార్(24)లు విలువైన భాగస్వామ్యం నెలకొల్పారు. ఆఖర్లో పేసర్ ప్రభాత్ జయసూర్య(4-109) వరసగా వికెట్లు తీయడంతో భారత్ ఆలౌట్ అంచున నిలిచింది. తొలి టెస్టులో భారీ స్కోర్ దిశగా సాగుతున్న భారత జట్టు రెండో రోజు దేవ్‌దత్ పడిక్కల్(167: 230 బంతుల్లో 15 ఫోర్లు, సిక్సర్) ఔటయ్యాడు. మొట్టమొదటి సెంచరీతో భారత జట్టు భారీ స్కోర్‌కు బాటలు వేసిన ఈ కుర్రాడు రెండో రోజు లంచ్ తర్వాత వెనుదిరిగాడు. ఓవర్ నైట్ స్కోర్ 288/2తో ఆట మొదలెట్టిన టీమిండియా రిషభ్ పంత్(39), కేఎల్ రాహుల్(82) వికెట్లు కోల్పోయింది. వెంటవెంటనే ఇద్దరూ కీలక ప్లేయర్లు ఔటైన వేళ ధ్రువ్ జురెల్(51) ఇన్నింగ్స్ నిర్మించిన పడిక్కల్ డబుల్ సెంచరీకి 33 పరుగుల దూరంలో ఆగిపోయాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రవీంద్ర జడేజా(13) విఫలమైనా జురెల్ ఆచితూచి ఆడాడు. లహిరు కుమార ఓవర్లో మానవ్ సుతార్(24) బౌండరీతో స్కోర్ నాలుగొందలు దాటింది. అర్ధ శతకం సాధించిన జురెల్‌ను ప్రభాత్ జయసూర్య కాసేపటికే సుతార్‌ను డగౌట్ చేర్చాడు. సిరాజ్ త్వరగా వెనుదిరిగినా కుల్దీప్ యాదవ్(12 నాటౌట్) పట్టుదలగా ఆడాడు. ప్రసిధ్ కృష్ణ(1 నాటౌట్) కూడా వికెట్ కాచుకోవడంతో రెండో రోజు ఆట ముగిసే సరికి 9 వికెట్ల నష్టానికి భారత్ 460 పరుగులు చేసింది.

# ఈ యేడాది పెన్నీస్టాక్స్ ఇన్వెస్టర్లకు కాసుల పంట




**ముంబయి, ఆగస్టు 16:** ఈ క్యాలెండర్ సంవత్సరంలో ఇప్పటి వరకు చూసుకుంటే 10 పెన్నీ స్టాక్స్ అత్యంత వేగంగా పెరిగాయి. ఈ స్టాక్స్ 25 శాతం నుంచి 325 శాతం మధ్య రిటర్న్స్ అందించాయి. అందులో 3 స్టాక్స్ ఇన్వెస్టర్ల పెట్టుబడిని పలు రెట్లు పెంచి మల్టీబ్యాగర్ స్టాక్స్‌లో నిలిచాయి. ఈ స్టాక్స్‌ను ప్రత్యేక కేటగిరీలోని అంశాలను పరిగణనలోకి తీసుకుని జాబితా చేయడం జరిగింది. అందులో కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1000 కోట్ల లోపు ఉండి షేర్ల ధర రూ.20 లోపు ఉంటూ రోజుకు సగటున 5 లక్షల షేర్ల ట్రేడింగ్ వాల్యూమ్ ఉన్న వాటిని ఎంచుకోవడం జరిగింది. దీంతో చాలా తక్కువ ధరకో మంచి పనితీరు గల మైక్రో క్యాప్‌స్టాక్స్ లభించాయి. ఈ స్టాక్స్ గత 8 నెలలుగా చూసుకుంటే హైరిటర్న్స్ ఇచ్చాయి. పెన్నీ స్టాక్స్‌లో విజయం సాధించడానికి కేవలం అదృష్టం మాత్రమే కాదు, స్పష్టమైన వ్యూహం, పటిష్టమైన నష్ట నిర్వహణ కూడా అవసరం. ట్రియో మెర్కంటైల్ అండ్ ట్రేడింగ్ కంపెనీ స్టాక్ ఇప్పటి వరకు 8 నెలల్లో చూసుకుంటే ఏకంగా 326 శాతం మేర రాణించింది. లక్ష రూపాయలు పెట్టిన వారికి రూ.4.26 లక్షల వరకు అందించింది. ఈ స్టాక్ ధర కేవలం రూ.2.94 వద్ద ఉండడం గమనార్హం. గుజరాత్ ఇంజెక్ట్ కేరళా లిమిటెడ్ కంపెనీ స్టాక్ గత ఎనిమిది నెలల కాలంలో చూసుకుంటే 254 శాతం మేర రాబడులను అందించింది. లక్ష పెట్టిన వారికి రూ.3.54 లక్షలు అందించింది. ప్రస్తుతం ఈ స్టాక్ ధర రూ.12.66 వద్ద ఉంది.

స్టార్‌లైన్‌ప్స్ ఎంటర్ ప్రైజెస్ కంపెనీ స్టాక్ గత 8 నెలల కాలంలో 156 శాతం మేర పెరిగింది. లక్ష పెట్టిన వారికి రూ.2.56 లక్షలు అందించింది. ప్రస్తుతం ఈ కంపెనీ స్టాక్ ధర రూ.8.57 వద్ద ఉంది. ఎసిఐ ఇన్ఫోకామ్ కంపెనీ స్టాక్ గడిచిన 8 నెలల కాలంలో 63 శాతం మేర పెరిగి లక్ష పెట్టిన వారికి రూ.1.63 లక్షలు అందించింది. ఈ స్టాక్ ధర రూ.2.05 మాత్రమే. ఎన్‌హెచ్ఎ ఫుడ్స్ కంపెనీ స్టాక్ ఈ ఏడాది 2026లో ఇప్పటి వరకు 60 శాతం మేర లాభాలు అందించింది.

# రోజుకు 64వేల టన్నులు ఉత్పత్తిచేయాలి
## రిఫైనరీలకు కేంద్రం ఆదేశాలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** ఇరాన్ యుద్ధం కారణంగా దేశంలో ఎల్పీజీ గ్యాస్ కొరతను భర్తీచేసేందుకు ఎల్పీజీ ఉత్పత్తి పెంచాలని కేంద్రం నిర్ణయించింది. చమురు ఉత్పత్తి, రిఫైనరీ సంస్థలకు ఈ నెల 13న కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎల్పీజీ ఉత్పత్తి పెంచాలని ఆదేశించింది. రోజుకు 63,810 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయాలని దేశంలోని 21 రిఫైనరీలను ఆదేశించింది. 2026 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఎల్పీజీ ఉత్పత్తికి రెట్టింపుకంటే ఎక్కువ. ప్రస్తుతం దేశంలో ఒకరోజు వినియోగమవుతున్న గ్యాస్‌లో 70 శాతం. ఇది ఇప్పటికిప్పుడే సాధ్యమయ్యే పరిస్థితి లేదు. ప్రస్తుతం విదేశాల నుంచి చమురు సరఫరా తగినంతగా లేకపోవడే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో తగినంత చమురు దిగుమతి జరిగితే, రిఫైనరీ కంపెనీలు ఈ టార్గెట్‌ను అందుకుంటాయి. దేశంలోఉన్న రిఫైనరీ కంపెనీలలో 18 రిఫైనరీలు ప్రభుత్వం రంగ సంస్థలే. వీటికి రోజుకు 31,470 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయాల్సిందిగా కేంద్రం లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రైవేటు రిఫైనరీ లలో అత్యధికంగా ఎల్పీజీ ఉత్పత్తి చేసే సామర్థ్యం రిలయన్స్ సంస్థకు ఉంది. ఈ సంస్థ రోజుకు 18,000 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయగలదు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రిఫైనరీలో ఏడాదికి 33 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయగలదు. ఆ తర్వాత కోచిలోని బీపీసీఎల్ సంస్థ 4,800 టన్నులు, రష్యాకు చెందిన నయారా ఎనర్జీ సంస్థ 4,480 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయగలవు. ఈ మూడు కంపెనీలు కలిపి 27,280 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయగలవు. 202526 ఆర్థిక సంవత్సరంలో ఇండియాలో 33.2 మిలియన్ టన్నుల ఎల్పీజీ వినియోగమైంది. రోజుకు సగటున 91,000 టన్నులు. వీటిలో 13.1 మిలియన్ టన్నుల ఎల్పీజీ దేశీయంగా ఉత్పత్తి అయితే, మిగిలిన 21.3 మిలియన్ టన్నుల ఎల్పీజీని విదేశాల నుంచి దిగుమతి చేయాల్సి వచ్చింది.

# టాప్ ఐదు కంపెనీల్లో రూ.లక్షల కోట్ల ఆవిరి




**ముంబయి, ఆగస్టు 16:** దేశీయ స్టాక్ మార్కెట్లలో గత వారం అమ్మకాల ఒత్తిడి తీవ్రంగా కొనసాగింది. ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీనపడటంతో సూచీలు నష్టాల్లో ముగిశాయి. దీని ప్రభావం దేశంలోని అత్యంత విలువైన టాప్10 కంపెనీలపై స్పష్టంగా కనిపించింది. వీటిలో ఐదు దిగ్గజ కంపెనీలు కలిసి తమ మార్కెట్ విలువలు ఏకంగా రూ.1 లక్ష కోట్లకు పైగా నష్టపోయాయి. నష్టపోయిన కంపెనీలలో ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అగ్రస్థానంలో నిలిచింది. ఒక్క వారంలోనే టిసిఎస్ మార్కెట్ విలువ రూ.34,263.28 కోట్లు క్షీణించి రూ.8.53 లక్షల కోట్లకు పడిపోయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా భారీ నష్టాన్ని చవిచూసింది. ఈ సంస్థ మార్కెట్ విలువ రూ.31,869.13 కోట్లు తగ్గి రూ.17.70 లక్షల కోట్లకు చేరింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.25,891.88 కోట్లు నష్టపోయి రూ.9.86 లక్షల కోట్ల వద్ద ముగిసింది. ఇ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ రూ.7,165.37 కోట్లు, ఐసిఐసిఐ బ్యాంక్ రూ.2,792.65 కోట్లు తమ మార్కెట్ విలువను కోల్పోయాయి. ఒకవైపు ఐదు కంపెనీలు నష్టాలపాలవ్వగా, మరో ఐదు కంపెనీలు మాత్రం లాభాలను ఆర్జించడం విశేషం. ఈ ఐదు కంపెనీలు కలిసి తమ మార్కెట్ విలువకు రూ.55,149.45 కోట్లను జోడించుకున్నాయి. లాభపడిన వాటిలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి) ముందుంది. ఎల్ఐసి మార్కెట్ విలువ రూ.26,438.49 కోట్లు పెరిగి రూ.5.23 లక్షల కోట్లకు చేరింది. భారతీ ఎయిర్‌టెల్ కూడా రూ.20,592.13 కోట్లు లాభపడి తన విలువను రూ.12.43 లక్షల కోట్లకు పెంచుకుంది. బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టూబ్రో, హిందుస్థాన్ యూనిలీవర్ కూడా స్వల్ప లాభాలతో వారాన్ని ముగించాయి. వారం ముగిసే నాటికి అత్యంత విలువైన కంపెనీల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఆ తర్వాతి స్థానాల్లో భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, ఎస్‌బిఐ నిలిచాయి.

# రూ.24 వేల కోట్ల రెవెన్యూపై లోధా ఫోకస్



**ముంబయి, ఆగస్టు 16:** ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ లోధా డెవలపర్స్ లిమిటెడ్ వచ్చే ఏడాది మార్చి నాటికి 21 కొత్త హౌసింగ్ ప్రాజెక్టులను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. వీటి ద్వారా సుమారు రూ.24,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉందని కంపెనీ తెలిపింది. బలమైన గృహ డిమాండ్ కొనసాగుతున్న నేపథ్యంలో వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు సంస్థ ఈ ప్రాజెక్టులను చేపడుతోంది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో లోధా డెవలపర్స్ ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లో 4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒకే హౌసింగ్ ప్రాజెక్టును ప్రారంభించింది. దీని ఆదాయ సామర్థ్యం రూ.330 కోట్లుగా ఉంది. ఎంఎంఆర్, ఢిల్లీ ఎన్‌సీఆర్, పుణె, బెంగళూరు ప్రాంతాల్లో 7 కొత్త హౌసింగ్ ప్రాజెక్టులను ప్రారంభించనుంది. మొత్తం 59 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో చేపట్టే ఈ ప్రాజెక్టుల ఆదాయ సామర్థ్యం సుమారు రూ.9,850 కోట్లు. ఇప్పటికే కొనసాగుతున్న 14 ప్రాజెక్టుల్లో కొత్త దశలను ప్రారంభించనుంది. మొత్తం 97 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో చేపట్టే ఈ దశల ద్వారా మరో రూ.14,210 కోట్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంది. ఈప్రాజెక్టులతో నిర్దేశించుకున్న రూ.24,000 కోట్ల సేల్స్ బుకింగ్స్ లక్ష్యాన్ని సాధించేందుకు కంపెనీ ప్రయత్నిస్తోంది.ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో లోధా డెవలపర్స్ సేల్స్ బుకింగ్స్ వార్షిక ప్రాతిపదికన 4 శాతం పెరిగి రూ.4,630 కోట్లకు చేరాయి. దేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల్లో ఒకటైన లోధా డెవలపర్స్‌కు ఎంఎంఆర్, పుణె, బెంగళూరులో కార్యకలాపాలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఢిల్లీఎన్‌సీఆర్‌లో తన తొలి హౌసింగ్ ప్రాజెక్టును ప్రారంభించేందుకు సంస్థ ప్రణాళిక సిద్ధం చేసింది.హౌసింగ్‌తో పాటు కార్యాలయాలు, మాల్స్, వేర్‌హౌసింగ్, పారిశ్రామిక పార్కులు, డేటా సెంటర్ల వంటి వాణిజ్య ప్రాజెక్టులను కూడా కంపెనీ అభివృద్ధి చేస్తోంది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నికర లాభాన్ని 20 శాతం వార్షిక వృద్ధితో రూ.4,100 కోట్లకు పెంచుకోవాలని లోధా డెవలపర్స్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ త్రైమాసికంలో కంపెనీ నికర లాభం దాదాపు రెట్టింపై రూ.1,373.1 కోట్లకు చేరింది. ఆదాయం కూడా రూ.3,624.7 కోట్ల నుంచి రూ.5,096.7 కోట్లకు పెరిగింది.

## ఈవారం మార్కెట్‌లోకి
# 8 కొత్త ఫండ్స్




**ముంబయి, ఆగస్టు 16:** మ్యూచువల్ ఫండ్స్‌లో ఈ వారం ఎనిమిది కొత్త ఫండ్స్ సబ్‌స్క్రిప్షన్ కోసం వస్తున్నాయి. అందులో 5 ఫండ్స్ ఆఫర్లు 17న తేదీన మొదలవుతున్నాయి. తమ పోర్ట్‌ఫోలియోల్లోని ఖాళీలను పూరించి ఇన్వెస్టర్లను ఆకర్షించడమే లక్ష్యంగా కొత్త ఫండ్స్‌ను సంస్థలు తెస్తున్నాయి. ఇందులో రెండు ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఉన్నాయి. నిప్పాన్ ఇండియా ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ ఓమ్ని ఫండ్ ఆఫ్ ఫండ్, క్వాంట్ ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ కోసం ఈనెల17నుంచి 31 వ తేదీ వరకు కొనసాగనున్నాయి. వీటిల్లో కనీస పెట్టుబడి రూ. 500, రూ. 5000గా నిర్ణయించారు. ఇక ఐటిఐ మల్టీ అసెట్ అలకేషన్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ సైతం 17న మొదలై ఆగస్టు 31వ తేదీ వరకు కొనసాగనుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 5000గా నిర్ణయించారు. క్వాంట్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ న్యూ ఫండ్ ఆఫ్ సబ్‌స్క్రిప్షన్ 21వ తేదీన మొదలై సెప్టెంబర్ 4వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇందులో కనీస పెట్టుబడి రూ.500గా నిర్ణయించారు. ఇన్వెస్కో ఇండియా ఫార్మా అండ్ హెల్త్ కేర్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 18వ తేదీన ప్రారంభమవుతోంది. సెప్టెంబర్ 1వ తేదీ వరకు కొనసాగనుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 1000గా నిర్ణయించారు. క్వాంట్ సిల్వర్ ఈటీఎఫ్ కొత్త ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 17వ తేదీన ప్రారంభమై ఆగస్టు 19తోనే ముగుస్తుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 2000గా నిర్ణయించారు. ఎడెల్వేయిస్ ఆల్ట్రా షార్ట్ టర్మ్ ఫండ్ న్యూ ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ కోసం 17వ తేదీన అందుబాటులోకి వస్తోంది. 24వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 100 మాత్రమే. డిఎస్‌పీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్టోరల్ డెట్ ఫండ్ కొత్త స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ 17వ తేదీన మొదలై 24వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 100గా నిర్ణయించారు.

SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబై
ఫోన్: 022-22820427

అప్లై చేయడానికి QRని స్కాన్ చేయండి

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI)లో క్లరికల్ కేడర్‌లో జూనియర్ అసోసియేట్స్ (కస్టమర్ సపోర్ట్ & సేల్స్) రిక్రూట్‌మెంట్
SC/ST/OBC బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి ప్రత్యేక నియామక ప్రక్రియ

భారతీయ స్టేట్ బ్యాంకు రెగ్యులర్ బేసిస్‌లో జూనియర్ అసోసియేట్స్ (కస్టమర్ సపోర్ట్ & సేల్స్) నియామకం కోసం అర్హులైన భారతీయ పౌరులనుండి దరఖాస్తులు కోరుచున్నది

ఖాళీల సంఖ్య : 1538

అర్హత ప్రమాణాలు (వయస్సు, అర్హత మొదలైనవి) అవసరమైన ఫీజులు మరియు ఇతర వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తు మరియు ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు లింక్‌తో పాటు, బ్యాంక్ వెబ్‌సైట్ https://sbi.bank.in/web/careers/current-openings ప్రకటన నం. CRPD/CR/SPLDRIVE/2026-27/16 లో లభిస్తుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసే ముందు మరియు ఫీజు చెల్లించే ముందు పూర్తి ప్రకటనని చూసి, తమ అర్హతలను నిర్ధారించుకోమని సలహా.

- ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : 07.08.2026 నుండి 27.08.2026 వరకు.

ఏవైనా సందేహాలు ఉన్నా, దయచేసి మాకు – "CONTACT US" —> "Post Your Query" లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ https://sbi.bank.in/web/careers/current-openings లో లభించును.

స్థలం: ముంబై
తేదీ: 07.08.2026
మహానిర్వహణాధికారి (ఆర్‌పి & పీఎం)

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.